www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 17-11-2024 | పేజీలు: 14 +28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 212 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా. 9.07 తదుపరి తదియ; నక్షత్రం: రోహిణి సా. 5.22 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ. 10.04-11.31, రా. 10.36-12.06; దుర్ముహూర్తం: సా. 4.05-4.50; అమృతఘడియలు: మ. 2.26-3.54; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.24; సూర్యాస్తమయం: 5.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



3 సెకన్లకు 10 కోట్లు కట్టాలా?

మీ నిజ స్వరూపం తెలిసింది
మా హృదయం ముక్కలైంది
ధనుష్‌పై నయనతార ధ్వజం
ఘాటుగా బహిరంగ లేఖ
తన డాక్యుమెంటరీలో 'నేను రౌడీనే' లేకపోవడంపై ఆవేదన

9





10

దిగొస్తున్న పసిడి

15 రోజుల్లో రూ.6 వేలు తగ్గిన ధర

మస్క్ రాకెట్.. ఇస్రో శాటిలైట్

14

ఫాల్కన్-9తో జీశాట్-ఎన్2 ప్రయోగం
స్పేస్ ఎక్స్, ఇస్రో మధ్య కీలక ఒప్పందం
వచ్చే వారం అమెరికాలో ప్రయోగం
విమాన ప్రయాణంలో ఇంటర్నెట్ సేవలకే



14

నటి కస్తూరి అరెస్టు

అదుపులోకి తీసుకున్న చెన్నై పోలీసులు
తెలుగువారిపై తీవ్ర వ్యాఖ్యలతో కేసు
అప్పట్నుంచి అజ్ఞాతంలో ఉన్న నటి
హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి అరెస్టు

వృద్ధుల సంరక్షణకు కొత్త పాలసీ

14

వేగంగా కసరత్తు
25 ఏళ్లలో తొలిసారి.. వచ్చే పాతికేళ్లపాటు మార్గదర్శనం
'తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ, సంక్షేమ చట్టానికి' సవరణలు
కేంద్ర కార్యదర్శి వెల్లడి



అహంకారం.. హాహాకారం!



..రాజకీయాలలో వ్యక్తిగత కక్షలకు తావు ఉండకూడదు. కానీ.. అటు తెలంగాణలో, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందేమిటి? రాజకీయ ప్రత్యర్థులను వ్యక్తిగత శత్రువులుగా ప్రకటించుకొని వేటాడారు.

..అధికారంలో ఉన్నప్పుడు కన్నూమిన్నూ కానకుండా అహంకార పూరితంగా వ్యవహరించిన వారు ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని గుర్తు చేసుకుంటున్నారు. తాము శాశ్వతంగా అధికారంలో కొనసాగుతామని నమ్మి విర్రవీగిన బీఆర్ఎస్, వైసీపీ నాయకులు ఇప్పుడు 'అధికారం శాశ్వతం కాదు' అని సూక్తులు చెబుతున్నారు.

..చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలే అయింది. అయినప్పటికీ రాష్ట్రం అన్ని రంగాలలో అధోగతి పాలవుతోందని జగన్ అండ్ కో గగ్గోలు పెడుతున్నారు. చంద్రబాబు పాలనలో దమనకాండ పెచ్చరిల్లుతోందని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు.

..ఈ ఐదు నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం ఏం సాధించింది? ఏం సాధించలేదు? అన్న విషయం పక్కన పెడితే ప్రజలు మాత్రం స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. నీలి మీడియా, కూలి మీడియాకు ఇది కనిపించకపోవచ్చు.


..1994లో ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా లభించకపోయినా అప్పుడు సీఎల్పీ నాయకుడిగా ఉన్న దివంగత పి.జనార్దన్ రెడ్డి ప్రభుత్వంపై పోరాటం చేశారు. "నేను అంత.. నేను ఇంత" అని చెప్పుకొనే జగన్ రెడ్డికి ఆ మాత్రం నైతిక ధైర్యం కూడా లేదే? శాసనసభలో చంద్రబాబును ఎదుర్కోలేరా?

..ఏబీఎన్ చానల్‌లో ఏదో ఒక కార్యక్రమం ప్రసారమైందని, అందులో తనను విమర్శించారంటూ విజయసాయిరెడ్డి నన్ను తిడుతూ సుదీర్ఘ ట్వీట్ చేశాడు. నేను బ్లాక్ మెయిల్ చేస్తాను, డీల్ మేకర్‌ని అని కూడా నన్ను నిందించాడు. బ్లాక్ మెయిల్ చేసి డబ్బు సంపాదించే బుద్ధి ఉంటే అటు తెలంగాణలో, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో కేసీఆర్, జగన్ రెడ్డితో ఏకకాలంలో పోరాడాల్సిన అవసరం ఏమిటి నాకు? ఎవరినో బ్లాక్ మెయిల్ చేసే బదులు ముఖ్యమంత్రులతోనే రాజీ పడిపోవచ్చు కదా!

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో..

తప్పు చేయలేదు!

అందుకే ధైర్యంగా నిలబడ్డాను



ఇదీ మోదీ బలం..

ఏ కేసూ లేకున్నా గత సర్కారు అరెస్టు చేసింది
ప్రజలు నాకు అండగా నిలిచారు
ఏపీలో మేం గెలుస్తామని ముందే ఊహించా
దేశం కోసం మోదీతో కలిసి పనిచేస్తున్నాం
అభివృద్ధి, సంక్షేమం.. ప్రజలతో కలిసి ముందుకు!
సోషల్ సైకోలకు అడ్డుకట్ట వేయాల్సిందే
లేదంటే భవిష్యత్తులో చాలా నష్టం
సంకీర్ణంలో చిన్నచిన్న సమస్యలు మామూలే
కలిసి మాట్లాడుకుంటే అన్నిటికీ పరిష్కారం
హిందూస్థాన్ టైమ్స్ సదస్సులో చంద్రబాబు

న్యూఢిల్లీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి కేసూ లేకున్నా, ఏ తప్పూ చేయకున్నా గత వైసీపీ ప్రభుత్వంలో తనను అరెస్టు చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తప్పు చేయలేదన్న ధైర్యంతోనే బలంగా నిలబడ్డానన్నారు. గత ఎన్నికల్లో ఏపీలో కూటమి గెలుస్తుందని నూటికి నూరు శాతం ముందే ఊహించానని తెలిపారు. ఓట్లు చీలిపోకూడదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముందుకు వచ్చారని, ఆ తర్వాత బీజేపీ కూడా కూటమిలో చేరిందని చెప్పారు. దేశ భవిష్యత్ కోసం

మిగతా 2వ పేజీలో...

అభివృద్ధి.. సంక్షేమం!

1995లో నేను తొలిసారి ముఖ్యమంత్రి అయ్యాను. 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చాయి. ఇంటర్నెట్ విప్లవం జరిగింది. వీటిని ప్రజల కోసం ఉపయోగించాలనుకున్నాను. ప్రజలతో నా ఆలోచనలను పంచుకుని వేర్వేరు కార్యక్రమాలను చేపట్టాను. 1999లో కూడా విజయం సాధించాను. అయితే ప్రజల ఆలోచనలను దాటి ముందుకు నడిచినందుకు రెండుసార్లు ఓడిపోయాను. దానివల్ల అభివృద్ధి ఆగిపోయింది. నరేంద్ర మోదీ అలా కాదు. ప్రజలను తనతో పాటు వెంట తీసుకుని ముందుకు వెళుతున్నారు. ఇప్పుడు నాకు ఒక స్పష్టత వచ్చింది. అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజలను నాతో పాటు ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయించుకున్నాను.

మాకు కొత్త కాదు..

కేంద్రంలో మేం కీలక పాత్ర పోషించడం ఇదే తొలిసారి కాదు. వాజపేయి ప్రభుత్వానికి ఎలాంటి షరతులూ లేకుండా, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆరున్నరేళ్లు మద్దతు ఇచ్చాం. గతంలో పార్లమెంట్‌లో ప్రతిపక్ష పాత్ర పోషించాం. ఆ సమయంలో బీజేపీకి రెండు సీట్లే వస్తే టీడీపీకి 35 సీట్లు వచ్చాయి. వాజపేయి బీజేపీని నిర్మిస్తే మోదీ పటిష్ఠం చేసి సుస్థిరం చేశారు. ఒకప్పుడు 2 సీట్లు ఉన్న బీజేపీ ఇప్పుడు పదకొండేళ్లుగా పరిపాలిస్తోంది. భవిష్యత్తులో కూడా ఈ ప్రభుత్వం కొనసాగుతుంది.

మహోన్నత దేశం కోసం మేం బీజేపీతో కలిసి పనిచేస్తున్నాం. మోదీ బలమైన నాయకుడు. ఆయనది ఆధునిక ప్రగతి శీల దృక్పథం. సంస్కరణలు, ఇంటర్నెట్ విప్లవం, టెక్నాలజీలను ఉపయోగించి తర్వాతి స్థాయి విప్లవాన్ని నరేంద్రమోదీ సృష్టించారు. ప్రపంచంలో 7.5-8 శాతం జీడీపీ వృద్ధి రేటు ఉన్న దేశం భారత్ మాత్రమే. ఇది మోదీ నాయకత్వంలో భారత దేశం పుంజుకున్న శక్తి. కలిసికట్టుగా కృషి చేస్తే 10 శాతం మించి జీడీపీ వృద్ధి సాధించే అవకాశాలున్నాయి.



సీఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడు కన్నుమూత

సీఎం చంద్రబాబుతో రామ్మూర్తి నాయుడు (ఫైల్)

14న గుండె సంబంధ సమస్యతో ఆస్పత్రికి.. అక్కడే చికిత్స పొందుతూ తుదిశ్వాస
విషయం తెలిసి హుటాహుటిన హైదరాబాద్ చేరుకున్న చంద్రబాబు
తమ్ముడి పార్థివదేహానికి నివాళులు.. నేడు నారావారిపల్లిలో అంత్యక్రియలు

2



జగన్ నిర్వాకంతో టిడ్కో ఇళ్లు నాశనం

కక్షగట్టి లబ్ధిదారులను మార్చేశారు
5 లక్షల ఇళ్లలో 2.38 లక్షలు రద్దు
52 వేల ఇళ్లను అర్ధంతరంగా నిలిపేశారు
కాంట్రాక్టర్లకు 540 కోట్ల బిల్లులు పెండింగ్
అక్రమాలన్నింటిపైనా విచారణ చేస్తున్నాం
అసంపూర్తి ఇళ్లకు రూ.5200 కోట్లు కావాలి
రుణం తీసుకుని ఆ ఇళ్లన్నీ పూర్తి చేస్తాం
అసెంబ్లీలో మంత్రి నారాయణ వెల్లడి

12

జగన్ పెట్టిన ఇబ్బందులకు నేను పదిసార్లు చావాలి
అసెంబ్లీలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆవేదన
ఐదేళ్ల జగన్‌ది రాక్షస పాలన అని మండిపాటు

13

కరువు సీమకు నీళ్లిచ్చే బడ్జెట్ ఇది!

13

జగన్ నిర్లక్ష్యంతో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది
చంద్రబాబు అప్రమత్తతతో 'తుంగభద్ర' నిలబడింది
బడ్జెట్ కేటాయింపులపై అసెంబ్లీలో సభ్యుల స్పందన

ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల అక్రమాలకు చెక్



వైసీపీ హయాంలో దుర్వినియోగం
విచ్చలవిడిగా నాడు దొంగ రిజిస్ట్రేషన్లు
ఇకపై వృద్ధులు, దివ్యాంగులకు మాత్రమే 'ఎనీవేర్'
'ఎబీఎం నంబర్ల' తలనొప్పికి స్వస్తి
సర్వే నంబర్లతోనూ రిజిస్ట్రేషన్లకు ఓకే
సిద్ధమవుతున్న రిజిస్ట్రేషన్ల శాఖ

అమరావతి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల అనేక అక్రమాలు జరిగాయి. ఇప్పుడు వాటన్నింటికీ చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కొన్ని మార్పులు చేస్తోంది. ముఖ్యంగా జగన్ హయాంలో ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల సౌకర్యాన్ని బాగా దుర్వినియోగం చేశారు. ఈ విధానంలో ప్రజలు ఎక్కడి నుంచైనా తమ భూములు రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉండేది. అయితే, నిబంధనలు కఠినంగా ఉండేవి. రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకుంటున్న ఆస్తి ఏ కార్యాలయం పరిధిలో ఉంటే, ఆ సబ్ రిజిస్ట్రార్‌ను నివేదిక అడిగి అన్నీ సరిగ్గా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే ఎనీవేర్ విధానంలో మరో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసేవారు. కానీ, వైసీపీ హయాంలో ఈ నిబంధనలు ఎత్తేశారు. ఒక ప్రాంతంలో ఉన్న ఆస్తులను మరో ప్రాంతంలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేసేశారు. ఆస్తి ఉన్న

మిగతా 12వ పేజీలో...



మహారాష్ట్రలోని లాతూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో జనసేనాని పవన్ కల్యాణ్ అభివాదం

13

బీజేపీ మతతత్వ పార్టీ కాదు.. మానవత్వ పార్టీ

బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో హిందువులకు రక్షణ లేదు
భారత్‌లో ఇతర మతాల హీరోలనూ అభిమానిస్తారు
దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యం.. ఆ పార్టీని గెలిపించండి
మహారాష్ట్ర ప్రచారంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్

గంజాయి స్మగ్లర్ల ఆస్తులు స్వాధీనం

12

సహకరించే వ్యాపారులవీ జప్తు.. జగన్ హయాంలో నాడు గంజాయి రాజ్
తిరిగి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే చర్యలు.. కేసులు, అరెస్టులతోనే చెక్ పెట్టలేం
ఆస్తులూ జప్తు చేస్తేనే స్మగ్లర్లలో భయం.. ఈ దిశగా కార్యాచరణకు సిద్ధం కండి
విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి ఆదేశం.. ఏజెన్సీ ప్రాంతాల సీఐలతో సమావేశం



ఒకే గూటికి 'ఉన్నత విద్య'

» ఉన్నత విద్య కమిషనరేట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం

అమరావతి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖను సమూలంగా ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం కళాశాల విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఉన్నత విద్య కోర్సుల కార్యకలాపాలు సాగుతున్నాయి. ఇకపై ఉన్నత విద్య కమిషనరేట్‌ను ఏర్పాటుచేసి వీటన్నింటినీ ఒకే గూటికి చేర్చాలని ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కళాశాల విద్య కమిషనరేట్ పరిధిలో కేవలం 160 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటి అడ్మిషన్లు, బోధన, ఉద్యోగుల సర్వీసు అంశాలను మాత్రమే ఈ కమిషనరేట్ చూస్తోంది. దాదాపు 1,200 ప్రైవేటు డిగ్రీ కాలేజీల కార్యకలాపాలు, తనిఖీలు, అడ్మిషన్లు ఉన్నత విద్యామండలి నిర్వహిస్తోంది. ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతులు, ఈఏపీ సెట్‌తో సహా ఇతర కామన్ ఎంట్రన్స్ టెస్టుల నిర్వహణ బాధ్యతలను ఉన్నత విద్యామండలి చూస్తుంటే.. అడ్మిషన్ల ప్రక్రియ సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఉంది. ఇకపై సెట్ల నిర్వహణ, అడ్మిషన్ల ప్రక్రియ, అన్ని డిగ్రీ కళాశాలల బాధ్యతలు ఒకే శాఖ పరిధిలో ఉండేలా సర్కారు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీంతో ఇప్పటి వరకు సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఇంజనీరింగ్ అడ్మిషన్ల బాధ్యత ఉండగా.. ఇకపై ఆ శాఖ పాలిటెక్నిక్ కాలేజీలకు మాత్రమే పరిమితం కానుంది.

విజయసాయి రెడ్డి వృత్తిపర దుష్ప్రవర్తనపై
చార్టర్డ్ అకౌంటెంట్స్ సంస్థ అప్పీల్

» విచారించనున్న హైకోర్టు డివిజన్ బెంచ్



హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వృత్తిపరమైన దుష్ప్రవర్తన వ్యవహారంలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి అనుకూలంగా సింగిల్ జడ్జి ధర్మాసనం తీర్పు ఇవ్వడంపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. జగన్ అక్రమాస్తుల విషయంలో ఆయన వృత్తిధర్మాలను విస్మరించారన్న అంశంపై తమ విచారణ పూర్తి కాకుండానే న్యాయమూర్తి తీర్పు ఇవ్వడాన్ని సవాలు చేసింది. విచారణ పెండింగ్‌లో ఉండగా హైకోర్టు జోక్యం చేసుకోరాదన్న అంశాన్ని సింగిల్ జడ్జి పట్టించుకోలేదని పేర్కొంది. విజయసాయిరెడ్డికి వ్యతిరేకంగా సీబీఐ కోర్టులో క్రిమినల్ ప్రొసీడింగ్స్ పెండింగ్‌లో ఉన్నప్పటికీ, వృత్తిపరమైన దుష్ప్రవర్తన అంశంపై విచారణ చేపట్టవచ్చని సుప్రీంకోర్టు సైతం ధ్రువీకరించిందని.. కానీ దీన్ని విస్మరించారని తెలిపింది. తమవద్దనే అప్పీల్ చేసుకునే అవకాశం అందుబాటులో ఉన్నప్పటికీ విజయసాయిరెడ్డి హైకోర్టులో నేరుగా రిట్ పిటిషన్ వేయడం చెల్లదని పేర్కొంది. కేవలం నోటీసు ఇచ్చినందుకే హైకోర్టులో పిటిషన్ వేశారని, అది సరికాదని తెలిపింది. ఈ కారణాల దృష్ట్యా ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును పక్కన పెట్టాలని కోరింది.

అనుచిత పోస్టులు.. వైసీపీ నేత అరెస్ట్

చీరాల టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టిన విశాఖపట్నానికి చెందిన వైసీపీ నేత బోడి వెంకటేశ్‌ను బాపట్ల జిల్లా చీరాల వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గతంలో స్థానిక టీడీపీ నాయకుడు లావేటి శ్రీనివాసతేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. గుంటూరు పోలీసుల అదుపులో వెంకటేశ్ ఉన్నట్లు గుర్తించారు. పీటీ వారెంట్ ద్వారా శనివారం అతడిని అదుపులోకి తీసుకుని చీరాల న్యాయమూర్తి వద్ద హాజరుపరచగా రిమాండ్ విధించారు. వెంకటేశ్‌ను ఒంగోలు జైలుకు తరలించారు.

విద్యాసాగర్ బెయిల్ పిటిషన్ డిస్మిస్

విజయవాడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో నిందితుడు కుక్కల విద్యాసాగర్‌కు విజయవాడలోని మహిళా సెషన్స్ కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం శనివారం డిస్మిస్ చేసింది. ఈ కేసులో జెత్వానీ, సీఐడీ న్యాయవాదుల వాదనలతో కోర్టు ఏకీభవించింది. విచారణ కీలక దశలో ఉన్నందున విద్యాసాగర్‌కు బెయిల్ ఇవ్వొద్దని, ఆయన బయటకు వస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశాలు ఉన్నాయని ఇరువురు న్యాయవాదులు వాదించారు. దీంతో విద్యాసాగర్ బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ న్యాయాధికారి తీర్పును వెలువరించారు. కాగా, విద్యాసాగర్‌ను మరోసారి కస్టడీకి ఇవ్వాలంటూ సీఐడీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌ను మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు కొట్టేసింది.

భూ సమస్యలపై బాధితుల ఏకరువు

» టీడీపీ ప్రజావేదికలో ఫిర్యాదుల వెల్లువ

అమరావతి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వైసీపీ నేతల కబ్జాలు, పరిష్కారం కాని ఇతర వ్యక్తిగత భూ సమస్యలపై టీడీపీ ప్రజావేదికలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మంగళగిరి తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పొలంలో వరి కోసేందుకు యంత్రాలను తెప్పిస్తే, వైసీపీ నేత సురేంద్రనాథ్‌రెడ్డి యంత్రాలు తగలబెడతామని బెదిరిస్తున్నారని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలానికి చెందిన శీలం సునీల్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తాము నివసిస్తున్న స్థలాన్ని గత ప్రభుత్వం మరొకరికి కేటాయించేసిందని, ఆ తర్వాత తమకు ఇస్తానన్న భూమి నేటికీ అందలేదని, దానిని ఇప్పించాలని బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన ఎస్టీలు కోరారు. తనకు హక్కుగా వచ్చిన స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించి, తననే హతమారుస్తానని తన భర్త మొదటి భార్య కుమారుడు రాధారామ్ బెదిరిస్తున్నాడని కడప జిల్లా మైదుకూరుకు చెందిన మాలేపాటి లక్ష్మీదేవి వాపోయారు. తమకు పేస్కేల్ అమలు చేయాలని పలువురు వీఆర్‌ఏలు కోరారు.

18 నుంచి 23 వరకు ప్రజావేదిక షెడ్యూల్

అమరావతి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 18 నుంచి జరిగే ప్రజావేదికలో పాల్గొనే మంత్రులు, ఇతర నేతల షెడ్యూల్‌ను పార్టీ కార్యాలయం ప్రకటించింది. 18న ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ విజయ్ కుమార్, 19న పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎఫ్‌డీసీ చైర్మన్ రంగారావు, 20న పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు రఘురామ్, ఆక్వా అథారిటీ చైర్మన్ వెంకట రమణారెడ్డి, 21న టీటీడీ సభ్యుడు రాజశేఖర్‌గౌడ్, స్వచ్ఛాంధ్ర మిషన్ చైర్మన్ పట్టాభిరామ్, 22న పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు, 23న పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్, హౌసింగ్ బోర్డు చైర్మన్ తాతయ్యబాబు ప్రజల నుంచి వినతుల స్వీకరిస్తారని తెలిపింది.

'నరేగా' పనులకు నిధుల కేటాయింపు హర్షణీయం

» గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి

అమరావతి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం బిల్లులు చెల్లిస్తూ వేతన జీవులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి చెప్పారు. 2014-19లో నరేగా పథకం కింద చేసిన పనులకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నరేగా ఫిర్యాదుల విభాగం సభ్యురాలు రేవతితో కలిసి, ఆయన మీడియా మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో ఏపీలో నరేగా నిధులు దుర్వినియోగమయ్యాయని పార్లమెంటే చెప్పడం సిగ్గుచేటు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక 7,700 పనులపై విజిలెన్స్ తనిఖీలు చేసి రూ.331 కోట్లు కేటాయించింది' అని చెప్పారు.

చెదురుమదురుగా వర్షాలు

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతం నుంచి శ్రీలంక సమీపాన కొమరిన్ తీరం వరకూ ఉపరితల ద్రోణి విస్తరించింది. ఇదే సమయంలో బంగాళాఖాతం నుంచి తమిళనాడు, దానికి ఆనుకుని రాయలసీమ, కోస్తా వైపు తూర్పుగాలులు వీస్తున్నాయి. ఈ రెండింటి ప్రభావంతో శనివారం రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాయలసీమలో పలుచోట్ల, దక్షిణ కోస్తాలో ఒకటి, రెండు చోట్ల వర్షాలు కురుస్తాయని, ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ తెలిపింది. ఏజెన్సీ ప్రాంతంలో చలి స్వల్పంగా పెరిగింది. రానున్న రెండు, మూడు రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉంది. శనివారం కళింగపట్నంలో 20.6 డిగ్రీలు కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు
సోదర వియోగం





హైదరాబాద్‌లో రామ్మూర్తినాయుడు పార్థివదేహం వద్ద సీఎం చంద్రబాబు, మాజీ సీజేఐ జస్టిస్ రమణ, బాలకృష్ణ, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మ తదితరులు



రామ్మూర్తి నాయుడు కుమారులను ఓదారుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

రామ్మూర్తినాయుడు కన్నుమూత

» నేడు నారావారిపల్లెలో అంత్యక్రియలు

తిరుపతి/ రాయదుర్గం/ అమరావతి/ న్యూఢిల్లీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు(72) శనివారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈ నెల 14న హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చేరారు. రెండు రోజులుగా ఆరోగ్యం విషమించడంతో వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి అత్యాధునిక చికిత్స అందించారు. అయినప్పటికీ ఆయన శరీరం చికిత్సకు సహకరించలేదని, మధ్యాహ్నం 12.45గంటలకు కార్డియాక్ అరెస్టుతో తుదిశ్వాస విడిచారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆయనకు భార్య ఇందిర, కుమారులు గిరీశ్, రోహిత్ ఉన్నారు. వీరిలో రోహిత్ సినీనటుడు కాగా, గిరీశ్ గల్ఫ్‌లో వ్యాపారం చేస్తున్నారు. సోదరుడి ఆరోగ్యం విషమించిన వార్త తెలియగానే ఢిల్లీలో ఉన్న చంద్రబాబు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వెళ్లే కార్యక్రమాన్ని రద్దు చేసుకుని హైదరాబాద్ చేరుకున్నారు. తమ్ముడి పార్థివదేహానికి నివాళులర్పించి, ఆయన కుమారులు రోహిత్, గిరీశ్‌ను ఓదార్చారు. రామ్మూర్తినాయుడు భౌతికకాయం ఆదివారం ఉదయం 8 గంటలకు విమానంలో రేణిగుంటకు చేరుకోనుంది. అక్కడి నుంచి 9గంటలకు స్వస్థలమైన చంద్రగిరి మండలం నారావారిపల్లికి తరలించనున్నారు. నారావారిపల్లిలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు జరగనున్నాయి. ఈ అంత్యక్రియలకు నారా, నందమూరి కుటుంబీకులు హాజరు కానున్నారు. అలాగే టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, ప్రజాప్రతినిధులు, తెలంగాణ నుంచి సైతం పలువురు నాయకులు హాజరయ్యే అవకాశం ఉంది.

పదిహేనేళ్లుగా అనారోగ్యంతో..

2004 ఎన్నికల అనంతరం ఆయన ఆరోగ్యం క్షీణించింది. అల్జీమర్స్ లక్షణాలతో కుటుంబసభ్యులు సహా పరిచయస్తులను గుర్తించలేకపోయేవారు. చంద్రబాబు చొరవ తీసుకుని కేరళలో ప్రత్యేకంగా ఆయుర్వేద వైద్యం కూడా ఇప్పించారు. పెద్దగా ప్రయోజనం లేకపోవడంతో ఆయన ఇంటికే పరిమితమయ్యారు. కుటుంబీకులు ఆయన్ను గత పదిహేనేళ్ల నుంచీ జాగ్రత్తగా చూసుకుంటూ వస్తున్నారు. అనారోగ్యానికి వయోభారం తోడవడంతో సమస్యలు పెరిగాయి. గత ఐదేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు.

కాణిపాకం ఆలయ అభివృద్ధికి కృషి

కాణిపాకం వినాయక ఆలయం నేడు ఈ స్థాయిలో ప్రాచుర్యంతో పాటు అభివృద్ధి చెందడానికి బీజం వేసింది రామ్మూర్తినాయుడే. చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆయన 1994-99 మధ్య ఈ ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఆలయ విస్తరణకు మాస్టర్ ప్లాన్ స్వయంగా రూపొందించారు. రైతులను ఒప్పించి వారి భూములను సేకరించి ఆలయాన్ని విశాలంగా విస్తరించారు. చిత్తూరు-ఐరాల రోడ్డులోని అగరంపల్లి వద్ద ప్రధాన స్వాగత తోరణ నిర్మాణం, అక్కడి నుంచీ కాణిపాకానికి రోడ్డు విస్తరించి డివైడర్లతో కూడిన డబుల్ రోడ్డు నిర్మాణం వంటివి ఆయన చొరవ వల్ల జరిగినవే. ఆలయంలో ఆర్జిత సేవలనూ మెరుగుపరిచి భక్తులు పెరిగేందుకు కారకులయ్యారు.

బాబుకు రాహుల్‌గాంధీ పరామర్శ

కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ సీఎం చంద్రబాబును ఫోన్‌లో పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సంతాపం

రామ్మూర్తినాయుడు మరణం టీడీపీకి, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. 1994 నుంచి 1999 వరకు చంద్రగిరి శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ విశేష సేవలందించారని గుర్తు చేశారు. మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారథి, అనిత, నారాయణ, సత్యప్రసాద్, జనార్దన్‌రెడ్డి, బాలవీరాంజనేయస్వామి, సవిత, దుర్గేశ్, రాంప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కోండ్రు మురళి, జయనాగేశ్వర్‌రెడ్డి, కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ తదితరులు సంతాపాన్ని తెలియజేశారు. కాగా, శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో రామ్మూర్తినాయుడు మృతికి సంతాపం తెలియజేస్తూ, ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

రాజకీయ నేపథ్యం

తొలినాళ్లలో అన్న చంద్రబాబు వెన్నంటి నడుస్తూ రాజకీయంగా తోడునీడగా నిలిచిన రామ్మూర్తినాయుడు 1992లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 1994 ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే టికెట్ పొంది కాంగ్రెస్ అభ్యర్థి గల్లా అరుణకుమారిపై 16వేలకు పైగా మెజారిటీతో గెలిచారు. 1999లో వర్గ రాజకీయాలతో ముఖ్య నేతలు సహాయ నిరాకరణ చేయడంతో ఓటమి పాలయ్యారు. పార్టీలో ప్రాధాన్యం తగ్గడంతో 2003లో టీడీపీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే చంద్రగిరి అసెంబ్లీ టికెట్ విషయంలో కాంగ్రెస్ పెద్దలు మొండిచేయి చూపడంతో 2004 ఎన్నికల సమయంలో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే టీడీపీ అభ్యర్థి కంటే ఎక్కువ ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. రామ్మూర్తినాయుడు ఓట్లు చీల్చడం వల్లే కాంగ్రెస్ అభ్యర్థి గల్లా అరుణకుమారి సునాయాసంగా విజయం సాధించారు.

చిన్నాన్న మరణం బాధాకరం: మంత్రి లోకేశ్



చిన్నాన్న నారా రామ్మూర్తినాయుడు మరణం తీవ్ర విషాదాన్ని నింపిందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. చిన్నాన్నతో చిన్ననాటి తన అనుబంధం కళ్ల ముందు కదిలి వచ్చిన కన్నీటితో నివాళులర్పిస్తున్నానని 'ఎక్స్'లో సంతాప సందేశం పోస్టు చేశారు. 'మౌన మునిలా మారిన చిన్నాన్న ఇన్నాళ్లూ మాకు కంటికి కనిపించే ధైర్యం.. నేటి నుంచి చిరకాల జ్ఞాపకం. చిన్నాన్న ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నా. అంతులేని దుఃఖంలో ఉన్న తమ్ముళ్లు, పిన్ని ధైర్యంగా ఉండాలని కోరుతున్నా' అని లోకేశ్ పేర్కొన్నారు.

చంద్రబాబుకు ప్రగాఢ సానుభూతి: పవన్




సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. సోదర వియోగంతో బాధపడుతున్న చంద్రబాబుకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఉన్నందున అంత్యక్రియలకు హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారు.

టీ సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి



మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. రామ్మూర్తినాయుడి భౌతికకాయానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. రామ్మూర్తినాయుడు కుటుంబసభ్యులకు మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

తప్పు చేయలేదు!



(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి పని చేస్తున్నామని వివరించారు. మోదీ హయాంలో భారతదేశం అగ్రరాజ్యంగా మారి తీరుతుందన్నారు. శనివారం ఢిల్లీలో హిందూస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో చంద్రబాబు మాట్లాడారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ తల్లి, చెల్లిపై ఆ పార్టీ నాయకులే సోషల్ మీడియాలో అత్యంత దారుణంగా, వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పోస్టులు చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్‌లో తీరని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పోస్టులు పెడుతున్నవారిని నియంత్రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. హిందూస్థాన్ టైమ్స్ నేషనల్ పొలిటికల్ ఎడిటర్ సునేత్రా చౌదరి అడిగిన ప్రశ్నలకు చంద్రబాబు ఇచ్చిన సమాధానాలివి.



మీరు నెల రోజులకుపైగా జైలులో గడిపారు. జైలు జీవితం మనల్ని మార్చేస్తుందని చాలామంది అంటారు. మీరేమంటారు?

చంద్రబాబు: నా జీవిత కాలంలో మర్యాదల్ని, పద్ధతులను పాటించాను. చాలా క్రమశిక్షణతో ఉన్నాను. ఎన్నో ప్రభుత్వ విధానాలను నిర్ణయించాను. ఎవరూ నన్ను వేలెత్తి చూపలేదు. కొందరు కోర్టుకు కూడా వెళ్లాలనుకున్నా నాకు వ్యతిరేకంగా ఏమీ రుజువు చేయలేకపోయారు. కానీ... గత ప్రభుత్వంలో ఎలాంటి కేసు లేకుండా నన్ను అరెస్టు చేశారు. నోటీసు ఇచ్చారు. నా జీవితంలో ఇలాంటిది జరగకూడదని నేను అనుకున్నాను. నేనెంత జాగ్రత్తగా ఉన్నా అది జరిగింది. నేను తప్పు చేయలేదు. అందుకే పూర్తి విశ్వాసంతో నిలబడ్డాను. భయపడకూడదని, నైతికంగా కుంగిపోకూడదని అనుకున్నాను. 53 రోజుల జైలు జీవితాన్ని ధైర్యంతో, విశ్వాసంతో గడిపాను. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు 80 దేశాల్లో నాకు మద్దతుగా జనం రోడ్లపై నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజలు అండగా నిలిచారు. దీంతో మరింత శక్తి పుంజుకున్నాను. మరింత పట్టుదలతో ప్రజల కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నాను.

సోషల్ మీడియాలో బ్రౌజింగ్ చేస్తారా?

చంద్రబాబు: సోషల్ మీడియాలో ఏం జరుగుతుందో చూసే సమయం నాకు ఉండదు. కానీ గవర్నెన్స్‌కు అవసరమయ్యే వాటిని ఉపయోగించుకుంటున్నాము. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకొస్తున్నాం. దీని ద్వారా అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు, పౌర సేవలను చివరి వ్యక్తి వరకు అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ రోజుల్లో డేటా అంటే సంపద. క్వాలిటీ డేటాతో అద్భుతాలు సాధించవచ్చు. ఏఐ, డీప్ టెక్నాలజీతో వ్యవసాయం, పశువైద్యం, ఆరోగ్యం వంటి రంగాల్లో నిజమైన, కచ్చితమైన పరిష్కారాలను సాధించవచ్చు. ఏఐ, డీప్ టెక్నాలజీతో ప్రపంచంలో ఏ మూలన ఉన్నా స్మార్ట్ ఫోన్‌తో ఏ పనులైనా చేసుకోవచ్చు.

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో నిజంగా ఏమి జరిగింది?

జాతీయ స్థాయిలో మోదీ నాయకత్వం వల్ల ఎన్డీయే విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో అదనంగా మాకు తోడ్పడింది. గత ప్రభుత్వం పట్ల ప్రజలు పూర్తిగా నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఓట్లు చీలిపోకూడదని ముందుకు వచ్చారు. ఆ తర్వాత బీజేపీ కూడా చేరింది. మూడు పార్టీలు చేరడం వల్ల ప్రజలకు విశ్వాసం పెరిగింది. 93 శాతం స్ట్రైక్ రేట్, 57శాతం ఓటు శాతంతో విజయం సాధించాం. ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే వచ్చాయి. కొన్ని స్థానాల్లో మాకు బలహీనమైన అభ్యర్థులు ఉండడం వల్ల వారికి ఆ మాత్రం దక్కాయి. ప్రజలు చాలా తెలివైనవారు. అన్నీ గమనిస్తారు. వారు బయటపడరు. సరైన సమయంలో బయటకు వచ్చి నిర్ణాయక తీర్పు ప్రకటిస్తారు. ఏపీలో అదే జరిగింది.

బీజేపీ 240 సీట్లకే పరిమితమవుతుందని ఊహించారా?

బీజేపీకి పూర్తి మెజారిటీ వస్తుందని అనుకున్నాం. ఆంధ్రప్రదేశ్ గురించి మాకు పూర్తి స్పష్టత ఉన్నది. ఏకపక్ష ఎన్నికలు జరుగుతాయని అందరూ ఊహించారు. కొన్ని సర్వేలు వక్రీకరించి చూపాయి. హేతుబద్ధత అవసరం.

మీ మంత్రుల్లో ఒకరిపై, పరిస్థితులపై పవన్‌కల్యాణ్ కొంత విమర్శనాత్మకంగా మాట్లాడుతున్నట్లుంది! సంకీర్ణ ధర్మం అంటే ఏమిటి?

ఒక కుటుంబంలో ఎప్పుడూ ఇలాంటివి ఉంటాయి. ఏకాభిప్రాయ సాధన ఎలా తేవడం అనేది ఎంతో ముఖ్యం. ఒకరు మరొకరిని ఎలా గౌరవించుకుంటారన్నది ముఖ్యం. రాజకీయాల్లో కూడా ఇవే సూత్రాలు వర్తిస్తాయి. కొన్నిసార్లు కొందరు వేరుగా స్పందిస్తారు. ఏదో ఒక సమాచారం ఆధారంగా మాట్లాడతారు. కానీ మాట్లాడుకుంటే అన్నీ పరిష్కారమవుతాయి. అదే మేము చేస్తున్నాం. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకున్నంత వరకూ మేము కలిసి ఉంటాం, కలిసి పనిచేస్తామన్న విశ్వాసం మాకుంది.

తమిళనాడు సీఎం స్టాలిన్‌లాగే మీరు కూడా మరింతమంది పిల్లలను కనాలని పిలుపునిచ్చారు. దక్షిణాదిన ఎంత మంది పిల్లలుండాలి?

గతంలో నేను బ్రేక్ సైలెన్స్- టాక్ ఎబౌట్ ఎయిడ్స్ అనే నినాదాన్ని ఇచ్చాను. ఇప్పుడు బ్రేక్ సైలెన్స్-టాక్ ఎబౌట్ పాపులేషన్ మేనేజ్మెంట్ అని పిలుపునిస్తున్నాను. యూరప్, చైనా, జపాన్ సహా అనేక దేశాల్లో వయోధికులు ఎక్కువై పోయారు. ప్రస్తుతం దక్షిణాదిన ఈ సమస్య ప్రారంభమైంది. 1950లో ఫెర్టిలిటీ రేటు 5.6-6 ఉండేది. ఇప్పుడు 1.6 మాత్రమే. ఇది ఇంకా తగ్గితే సమస్య మొదలవుతుంది. అందుకే పాపులేషన్ మేనేజ్‌మెంట్‌ను ప్రమోట్ చేయాలనుకుంటున్నాను. అలా చేస్తే ప్రపంచంలో మనల్ని కొట్టేవారే ఉండరు. దేశంలో 145 కోట్ల జనాభా ఉంది. సరిగా ప్లాన్ చేస్తే 30-40 కోట్ల మంది భారతీయులు ప్రపంచంలో అన్ని మూలలకు వెళ్లి పనులు చేస్తారు. దేశానికి ఆదాయం తీసుకొస్తారు. బ్రిటీష్ వాళ్లు ఎలాగైతే మనదగ్గరికి వచ్చి పరిపాలించారో, మనం కూడా అలాగే ప్రపంచ దేశాలకు వెళ్లి ఆ దేశాలను ఏలవచ్చు.

దేశ సమగ్రాభివృద్ధికి సూచనలివీ

- 'జీరో పావర్టీ'ని సాధించాలి
- ఉన్నతస్థాయి జనాభాలో మొదటి 10శాతం మంది అట్టడుగున ఉన్న 10-15 శాతం మందిని దత్తత తీసుకుని వారిని ముందుకు నడిపించాలి.
- దేశంలో ఉద్యోగాల కల్పన జరగాలి. మానవ వనరుల అభివృద్ధితో పాటు నైపుణ్యాలను కాలానుగుణంగా పెంపొందించుకోవాలి.
- రాబోయే 20 ఏళ్లలో దేశానికి అవసరమయ్యే మానవ వనరులు, నైపుణ్యాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.
- దేశంలో నీటి భద్రత కోసం నదులను అనుసంధానించాలి. వ్యవసాయంపై దృష్టి కేంద్రీకరించాలి.
- లాజిస్టిక్స్ వ్యయం తగ్గించాలి. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌పై దృష్టిపెట్టాలి.

ఎన్డీయే 3.0 ప్రత్యేకత ఏమిటి?

చంద్రబాబు: ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్డీయే హయాంలో భారతదేశానికి అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. గత పదేళ్లుగా ఆయన భారత్ ప్రాధాన్యం పెంచారు. ఇప్పుడు ప్రపంచంలో భారత్ ముద్ర బలంగా ఉన్నది. 2047 కల్లా వికసిత్ భారత్ ఏర్పడాలని మోదీ కృషి చేస్తున్నారు. ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో మొదటి లేదా రెండో స్థానాన్ని సాధించగలదనే పూర్తి విశ్వాసం నాకుంది. ఇప్పటికే భారత్ మూడో స్థానాన్ని సాధించడం ఖాయమైంది.

దేశ ప్రగతికి ఇవీ సూచనలు...

దైనందిన జీవితంలో అన్ని పనులలో డీప్ టెక్నాలజీని ప్రవేశపెట్టాలని, అప్పుడే దేశం గొప్పగా ఎదుగుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఈ లక్ష్యాల సాధన దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు.



కాకినాడలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల ఉద్యమబాట

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): అంగన్‌వాడీ కార్యకర్తలు రోడ్డెక్కారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ పోరుబాట పట్టారు. గతంలో నిరవధిక సమ్మె సందర్భంగా సాధించుకున్న డిమాండ్లను నెరవేర్చాలని ధర్నాలు, ర్యాలీలు నిర్వహించి, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, మెయిన్ వర్కర్లతో సమానంగా మినీ వర్కర్లకు వేతనాలు చెల్లించాలని, అర్హులైన వారందరికీ ప్రమోషన్లు కల్పించాలని, వేసవి సెలవులు మంజూరు చేయాలని నినదించారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు హెచ్చరించారు.



వజ్రాల హారంతో డీఎస్వీ ప్రసాద్ కుటుంబ సభ్యులు

భాష్యకార్లకు వజ్రాల హారం కానుక

తిరుమల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో కొలువై ఉన్న శ్రీభాష్యకార-రామానుజాచార్యులకు వజ్రాలు పొదిగిన బంగారు హారం శనివారం కానుకగా అందింది. హైదరాబాద్‌లో 216 అడుగుల ఎత్తైన సమతామూర్తి శ్రీరామానుజాచార్యుల విగ్రహ రూపశిల్పి డీఎస్వీ ప్రసాద్ స్థపతి తన కుటుంబంతో కలిసి శ్రీవారిని దర్శించి ఈ కానుక సమర్పించారు. ఈహారం దాదాపు రూ.11 లక్షల విలువ ఉంటుందని, ఇందులో 132 వజ్రాలు, 57 కెంపులు పొదిగారని దాత డీఎస్వీ ప్రసాద్ స్థపతి తెలిపారు. తిరుమల శ్రీవారితో విడదీయరాని అనుబంధం కలిగించిన శ్రీ రామానుజాచార్యుల వారికి ఏదో ఒక కైంకర్యం చేయాలనే సంకల్పంతో హారం సమర్పించినట్లు తెలిపారు. ప్రసాద్ తిరుపతిలోని టీటీడీ శిల్పకళాశాల పూర్వవిద్యార్థి కావడం గమనార్హం.

శ్రీవారి సేవలో ఏపీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు





తిరుమల ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో జస్టిస్ హరినాథ్, కుటుంబ సభ్యులతో జస్టిస్ నగేష్

తిరుమల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం ఏపీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హరినాథ్, జస్టిస్ నగేష్ దర్శించుకున్నారు. వీరు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వేర్వేరుగా ఆలయంలోకి వెళ్లి శ్రీవారి సేవలో పాల్గొన్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

మల్లేశ్వరుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తులు





పెదకాకాని మల్లన్న సన్నిధిలో జస్టిస్ సురేష్ రెడ్డి దంపతులు, జస్టిస్ మల్లికార్జునరావు దంపతులు

పెదకాకాని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకాని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టీ. మల్లికార్జునరావు దంపతులు, జస్టిస్ కే. సురేష్ రెడ్డి దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యేక అభిషేక పూజలు జరిపారు. అధికారులు, అర్చకులు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలతో న్యాయమూర్తులను సత్కరించారు. అర్చకులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

స్టీల్‌ప్లాంట్‌లో భారీ ప్రమాదం!

- రూ. 300 కోట్లకు పైగా నష్టం
- జరిగి రెండు వారాలవుతున్నా నోరు మెదపని యాజమాన్యం
- షార్ట్ సర్క్యూట్‌తో కేబుళ్లు దగ్ధం
- ఎస్ఎంఎస్-2లో ఘటన
- వ్యయం తగ్గింపు పేరుతో ముఖ్యమైన పనులు కాంట్రాక్టుకు ఇవ్వడంతో సమస్య
- యాజమాన్యం తీరుతో భారీ మూల్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగా రూ.300 కోట్ల నష్టం వాటిల్లింది. స్టీల్ మెల్టింగ్ షాప్ (ఎస్ఎంఎస్)-2లో ఈ నెల మూడో తేదీన భారీ ప్రమాదం సంభవించింది. ఇది ఇటీవల పునఃప్రారంభించిన రెండో బ్లాస్ట్ ఫర్నేసుకు సంబంధించిన ఎస్ఎంఎస్ కావడం గమనార్హం. విద్యుత్ కేబుళ్లలో షార్ట్ సర్క్యూట్ జరగడం వల్ల మంటలు చెలరేగాయి. వాటిని సకాలంలో అదుపు చేయలేకపోయారు. అక్కడ యంత్ర పరికరాలపై పూర్తి అవగాహన లేని కాంట్రాక్టు సిబ్బంది ఉండడం వల్ల ఏమి చేయాలో తెలియక మిన్నకుండిపోయారు. పొదుపు, వ్యయం తగ్గింపు పేరుతో పనులను కాంట్రాక్టుకు ఇచ్చిన ఫలితం ఇది. అయితే ప్రమాదం జరిగి రెండు వారాలు కావస్తున్నా యాజమాన్యం నోరు మెదపకపోవడం గమనార్హం. ప్రమాదం సమయంలో యంత్ర పరికరాలపై పూర్తి అవగాహన లేని కాంట్రాక్టు సిబ్బంది ఉన్నారు. వారికి ఆ సమయంలో ఏమి చేయాలో తోచలేదు. కొందరు ధైర్యం చేసి ముందుకువెళ్లినా అక్కడ తలుపులు తీయడానికి వీల్లేకుండా తాళాలు వేయాల్సిన చోట వెల్డింగ్ చేసేశారు. అవి తీయడానికి కుదరకపోవడంతో అత్యంత శక్తివంతమైన కేబుళ్లు కాలిపోయాయి. వాటిని మళ్లీ పునరుద్ధరించాలంటే తిరిగి మొదట్నించి పనులు చేపట్టాలి. దీనికి సుమారు రూ.300 కోట్ల వ్యయం, మూడు నెలల సమయం పడుతుంది. బ్లాస్ట్ ఫర్నేస్-2 ప్రారంభించడం వల్ల అదనపు ఉత్పత్తి వస్తుందనుకుంటే ఈ ప్రమాదం వల్ల ఆ ఆశ నీరుగారిపోయింది.



స్టీల్ ప్లాంట్‌లో ప్రమాద సమయంలో బయటకు వస్తున్న పొగ (ఫైల్)

స్వయంకృతాపరాధమే..

స్టీల్‌ప్లాంటులో మెకానికల్, ఎలక్ట్రికల్ నిర్వహణ పనులు చూడడానికి గతంలో రెగ్యులర్ సిబ్బంది ఉండేవారు. ఉత్పత్తి వ్యయం తగ్గించాలని యాజమాన్యం ఆయా పనులను కాంట్రాక్టుకు ఇచ్చింది. కాంట్రాక్టర్లు మారినప్పుడల్లా సిబ్బంది మారడం వల్ల ఇక్కడ ఏ పనులు ఎలా చేయాలో తెలియని వారు విధులకు వస్తున్నారు. నైపుణ్యం లేనివారికి కార్డులు ఇచ్చి విధులకు పంపుతున్నారు. వాటి ఫలితంగా ఎస్ఎంఎస్-2లో ప్రమాదం జరిగిందని అంటున్నారు. సైరన్ గంటన్నర సేపు మోగినా దానిని ఆపలేకపోయారు. దాని తీవ్రత తెలియకపోవడం, సరైన అవగాహన లేకపోవడం వల్ల కేబుళ్లు మొత్తం కాలిపోయాయి. దీని ఫలితంగా ఎల్‌డీ కన్వర్టర్లు పనిచేయని పరిస్థితి ఏర్పడింది. ఎస్ఎంఎస్-2లో మూడు ఎల్‌డీ కన్వర్టర్లు ఉన్నాయి. ఈ పది రోజులు కష్టపడి ఒక దానిని ప్రారంభించగలిగారు. రెండో కన్వర్టర్‌ను 15 రోజుల్లో అందుబాటులోకి తెస్తామని చెబుతున్నారు. మూడో కన్వర్టర్ పరిస్థితి ఏమిటో చెప్పలేకపోతున్నారు. ఎస్ఎంఎస్-1లో మూడు కన్వర్టర్ల ద్వారా రోజుకు తొమ్మిది వేలు నుంచి పది వేల టన్నుల స్టీల్ ఉత్పత్తి చేస్తున్నారు. ఎస్ఎంఎస్-2 ద్వారా మరో ఆరు వేల టన్నులు అయినా తీయాలని భావించారు. ఇప్పుడు ఒక్క కన్వర్టరే ఉండడంతో దానిపై రోజుకు 2 వేలకు మించి ఉత్పత్తి రాదని అంటున్నారు.

నైపుణ్యం కలిగిన వారిని నియమించాలి

అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

యాజమాన్యం ఖర్చు తగ్గించుకోవడానికి తీసుకున్న నిర్ణయం వల్ల భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వచ్చింది. ఎలక్ట్రికల్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటల్ పనులను కాంట్రాక్టుకు ఇవ్వకుండా నైపుణ్యం కలిగిన క్వాలిఫైడ్ సిబ్బందిని అక్కడ నియమించాలి. సేఫ్టీ ఆడిట్ చేయకుండా గదిలో కూర్చొని నివేదికలు ఇస్తున్నారు. సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) సిబ్బందిని తగ్గించేశారు. ఇవన్నీ సరిచేయాలి. సరైన యాజమాన్యం లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగింది.

మెప్మాలో ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్

- మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్

అమరావతి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలు, సమాఖ్యల కార్యకలాపాలు పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించి, తద్వారా సంఘ సభ్యుల ఆర్థిక వికాసానికి తోడ్పడేందుకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ అనే ప్రక్రియను చేపట్టినట్లు మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఎస్‌హెచ్‌జీ, సంఘ సభ్యుల సమాచారాన్ని ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా సేకరించి, దానిని నాలుగు స్థాయిలలో తనిఖీ చేసి వాస్తవ సమాచారాన్ని సేకరించేలా ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. సభ్యుల ఆదాయ స్థితిగతుల ఆధారంగా ప్రతి సభ్యురాలి కుటుంబం మరింత మెరుగైన ఆదాయం సముపార్జించేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.

మెగా డీఎస్సీకి సిద్ధం: మంత్రి సవిత

- వైసీపీలా దగా చేయమని స్పష్టీకరణ
- బీసీ స్టడీ సర్కిల్స్ ఆధ్వర్యంలో డీఎస్సీకి ఉచిత శిక్షణ
- గుంటూరులో లాంఛనంగా ప్రారంభించిన మంత్రి

గుంటూరు(విద్య), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం మాదిరి దగా డీఎస్సీని అమలు చేయం.. సూపర్‌సిక్స్‌లో భాగమైన మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు భర్తీకి సిద్ధంగా ఉన్నాం' అని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. గుంటూరు రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్‌ను శనివారం సందర్శించి డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణను ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు సమర్థవంతమైన శిక్షణ ఇచ్చే బృహత్తర కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందన్నారు. తాజా డీఎస్సీ శిక్షణ కోసం రూ.4.50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి 220 మంది చొప్పున మొత్తం 5720 మంది బీసీ, ఎస్సీ ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు 60 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. త్వరలో ఆన్‌లైన్ ద్వారా మరింత మందికి డీఎస్సీ శిక్షణకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో బీసీ స్టడీసర్కిల్స్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేస్తామన్నారు. స్టడీసర్కిల్స్ ద్వారా సివిల్స్ కోచింగ్, ఎస్ఎస్‌సీ, రైల్వే ఉద్యోగాలకు, గ్రూపు పరీక్షలకు శిక్షణ ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఏసురత్నం, బీసీ సంక్షేమశాఖ కమిషనర్ పోలా భాస్కర్ పాల్గొన్నారు.



గుంటూరు రాజాగారితోట బీసీ స్టడీసర్కిల్‌లో శిక్షణ తరగతిని ప్రారంభిస్తున్న మంత్రి సవిత



ఆలయంలో తాంత్రిక పూజలు చేస్తున్న వజ్ర భాస్కర్‌రెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి

గుప్త నిధుల కోసం వైసీపీ నాయకుల తాంత్రిక పూజలు

గ్రామస్థుల సమాచారంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు

మదనపల్లె అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం తాంత్రిక పూజలు చేస్తున్న ఇద్దరు వైసీపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలంలోని అటవీ ప్రాంతంలో ఉన్న పురాతనమైన బిరుద నారాయణి ఆలయంలో తాంత్రిక పూజలు చేస్తూ వీరు పట్టుబడ్డారు. మదనపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి, సత్యసాయి జిల్లా కదిరికి చెందిన వైసీపీ నేత వజ్ర భాస్కర్‌రెడ్డి కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి బిరుద నారాయణి స్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ గుప్త నిధులు ఉన్నాయనే నమ్మకంతో, వాటి కోసం పౌర్ణమి సందర్భంగా రాత్రంతా వారిద్దరూ తాంత్రిక పూజలు చేస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్న గ్రామస్థులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు ఆదేశాల మేరకు బి.కొత్తకోట పోలీసులు తాంత్రిక పూజలు చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఆ ఇద్దరినీ శనివారం మదనపల్లె డీఎస్పీ కార్యాలయానికి తరలించగా కేసు నమోదు చేసి, 41ఏ నోటీసు ఇచ్చి వదిలేశారు. కదిరికి చెందిన వజ్ర భాస్కర్ రెడ్డి గత ఎన్నికల్లో వైసీపీకి కీలకంగా పనిచేశారు. ఈయన రెండుసార్లు వైసీపీ టిక్కెట్ ఆశించారు. అదేవిధంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి గత ఎన్నికలకు ముందు బీజేపీకి రాజీనామా చేసి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైసీపీలో చేరి కీలకంగా వ్యవహరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

అహంకారం.. హాహాకారం!

ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రజాగ్రహం కారణంగా అధికారం కోల్పోయి ప్రతిపక్షంలోకి నెట్టివేయబడిన భారత రాష్ట్ర సమితి, వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకుల హాహాకారాలు మిన్నంటుతున్నాయి. తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో కొనసాగిన కేసీఆర్ అండ్ కోలో అహంకారం పరాకాష్ఠకు చేరడంతో తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉండిన జిల్లాల ప్రజానీకం భారత రాష్ట్ర సమితికి గట్టి గుణపాఠం చెప్పింది. అధికారంలో ఉన్నప్పుడు కన్నూమిన్నూ కానకుండా అహంకార పూరితంగా వ్యవహరించిన వారు ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని గుర్తు చేసుకుంటున్నారు. దీన్నే కాల మహిమ అంటారు. ధర్మో రక్షతి రక్షితః అంటారు. అధికారంలో ఉన్నప్పుడు తాము ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామన్న వాస్తవాన్ని విస్మరించి నియంతలా వ్యవహరించిన వారు ఇప్పుడు 'ఇదెక్కడి ప్రజాస్వామ్యం?' అంటూ గతం మరచిపోయి మాట్లాడుతున్నారు. తాము

> జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఆయనతో పరోక్షంగా అంటకాగిన సీపీఎం నాయకులు ఇప్పుడు జెండాలను బయటకు తీసి ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు. మరోవైపు జగన్‌రెడ్డి పార్టీతో పరోక్షంగా స్నేహం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సమాజంలో స్వేచ్ఛాయుత వాతావరణం ఉందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి? సోషల్ మీడియా సైకోలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ అంశంపై జగన్‌రెడ్డి మాత్రమే గుండెలు బాదుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు రహస్యంగా అండదండలు అందించిన సీపీఎం కూడా ఈ విషయంలో జగన్‌తో గొంతు కలపలేని పరిస్థితి. సోషల్ మీడియా సైకోలు చేసిన అరాచకాలను తెలుసుకున్న కొద్దీ ప్రజల్లో ఏవగింపు పెరుగుతోంది. ప్రాథమిక హక్కులు అంటే ఇళ్లలోని ఆడవాళ్లకు రంకులు అంటకట్టడం కాదు కదా?


శాశ్వతంగా అధికారంలో కొనసాగుతామని నమ్మి విర్రవీగిన బీఆర్ఎస్, వైసీపీ నాయకులు ఇప్పుడు 'అధికారం శాశ్వతం కాదు' అని సూక్తులు చెబుతున్నారు. రాజకీయాలలో వ్యక్తిగత కక్షలకు తావు ఉండకూడదు. కానీ.. ఇటు తెలంగాణలో, అటు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందేమిటి? రాజకీయ ప్రత్యర్థులను వ్యక్తిగత శత్రువులుగా ప్రకటించుకొని వేటాడారు. ఈ క్రమంలో వ్యవస్థలను, ముఖ్యంగా పోలీసు వ్యవస్థను భ్రష్టుపట్టించారు. ఇప్పుడు పోలీసులు అధికార పక్షానికి తొత్తులుగా మారారని సుద్దులు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

మారిన కాలం...

గడచిన పదేళ్లలో దేశ రాజకీయాల స్వరూప స్వభావాలు మారిపోయాయి. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి అధికారాన్ని వాడటం పరిపాటిగా మారింది. ఈ విషయంలో ఇటు కేసీఆర్, అటు జగన్‌రెడ్డి సరికొత్త రికార్డులను నెలకొల్పారు. ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చోవలసి రావడంతో 'అధర్మం రాజ్యమేలుతోంది' అని గుండెలు బాదుకుంటున్నారు. తెలుగునాట ఎంతో మంది ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పటికీ సొంత మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నది కేసీఆర్, జగన్‌రెడ్డి మాత్రమే. వారిరువురూ అధికారంలో ఉన్నప్పుడు వారి మీడియాకు అంతా పచ్చగా కనబడేది. ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చోవలసి రావడంతో సదరు మీడియాకు సర్వత్రా విధ్వంసమే కనిపిస్తోంది. కొత్త ప్రభుత్వాల పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నట్టు చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయాలలో వ్యక్తిగత కక్షలు తగవు అని మంచి మాటలు చెబితే చెవికి ఎక్కించుకోని వారు ఇప్పుడు గగ్గోలుపెడుతున్నారు. ముందుగా కేసీఆర్ విషయమే తీసుకుందాం! ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ రాజ్యానికి తాను ఒక చక్రవర్తిని అని భావించారు. ప్రతిపక్షాల ముఖం చూడ్డానికి కూడా ఇష్టపడేవారు కారు. ప్రధాన అంశాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించడం అటుంచితే ప్రతిపక్షాలకు చెందిన వారికి వ్యక్తిగత అపాయింట్మెంట్లు కూడా ఇచ్చేవారు కారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కమ్యూనిస్టులు విలక్షణ పాత్ర పోషించేవారు. రాష్ట్ర విభజన తర్వాత వారి ప్రాధాన్యం తగ్గిపోయింది. కమ్యూనిస్టులకు కేసీఆర్ కనీస గౌరవం కూడా ఇవ్వలేదు. ప్రజా సమస్యల గురించి వివరించడానికి సమయం కోరినా నిరాకరించారు. అదే కేసీఆర్‌కు మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా కమ్యూనిస్టుల అవసరం ఏర్పడింది. అంతే.. వారిని ఆహ్వానించి భోజనాలు పెట్టారు. ఆ ఉప ఎన్నికల్లో కమ్యూనిస్టుల సహకారంతో బయటపడ్డారు. ఆ తర్వాత సాధారణ ఎన్నికల వరకు వారి ముఖం చూడలేదు. మునుగోడులో అవగాహన కుదుర్చుకున్నట్టుగానే సాధారణ ఎన్నికల్లోనూ కేసీఆర్ తమతో పొత్తు కుదుర్చుకుంటారని కమ్యూనిస్టులు భావించారు. అయితే, తనకు కమ్యూనిస్టుల అవసరం లేదని భావించిన కేసీఆర్ వారిని కనీసం కలుసుకోవడానికి కూడా ఇష్టపడలేదు. దీంతో సీపీఐ నాయకులు కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టారు. సీట్ల పంపకంలో పేచీ ఏర్పడటంతో సీపీఎం విడిగా పోటీచేసింది. తెలంగాణ ఉద్యమంలో తనతో కలసి నడిచిన, తన ఎదుగుదలకు కారకులైన కోదండరాం వంటి వారందరినీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ దూరం పెట్టారు. అధికారం శాశ్వతమని భావించి అందరినీ వదులుకొని, తానే ఒంటరివారు అయ్యారు. మీడియాను నయానో భయానో లొంగదీసుకునే ప్రయత్నం చేశారు. తనకు నచ్చని అధికారుల ముఖం చూడ్డానికి కూడా ఇష్టపడేవారు కారు. తండ్రి బాటలో కేటీఆర్, కవిత అధికారాన్ని గరిష్ఠంగా అనుభవించారు. ఈ క్రమంలో తాము ప్రజలకు దూరమవుతున్నామని గ్రహించలేకపోయారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వ్యక్తిగత శత్రువుగా ప్రకటించుకున్నారు. పొరపాటున తాము ఓడినా, కాంగ్రెస్ పార్టీ గెలిచినా రేవంత్‌రెడ్డి మాత్రం ముఖ్యమంత్రి కాకూడదని భావించారు. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచినట్టుగా కాంగ్రెస్ గెలవడం, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం జరిగిపోయాయి. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తనను వెంటాడి వేధించిన కేసీఆర్ కుటుంబంపై ప్రతీకారం తీర్చుకొనే అవకాశం రేవంత్‌రెడ్డికి లభించింది. దీంతో తెలంగాణ రాజకీయాల్లో వ్యక్తిగత కక్షలు ప్రధాన అజెండా అయ్యాయి. అటు కేసీఆర్ అండ్ కో, ఇటు రేవంత్ అండ్ కో కత్తులు దూసుకోవడం మొదలైంది. ఫలితంగా తెలంగాణ రాజకీయాల్లో వేడి రాజుకుంది. ఎన్నికలు జరిగి ఏడాది కూడా పూర్తి కాకముందే తెలంగాణ రాజకీయాలు ఇంతలా మండటానికి కారణం.. రాజకీయ వైరం స్థానంలో వ్యక్తిగత వైరం ప్రవేశించడమే.

ఆందోళన... అయోమయం...

ఢిల్లీ లిక్కర్ కేసులో తన బిడ్డ కవిత తీహార్ జైలుకు వెళ్లాల్సి రావడంతో కేసీఆర్ కుంగిపోయారు. ఇప్పుడు ఫార్ములా వన్ రేసు వ్యవహారంలో కుమారుడు కేటీఆర్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏ క్షణాన్నయినా అరెస్టు చేయవచ్చునన్న వార్తలు రావడంతో ఆయన కలవరం చెందుతున్నారు. కేటీఆర్‌ను నిజంగా అరెస్టు చేస్తారా? చేస్తే ఎంతకాలం జైల్లో ఉండవలసి వస్తుంది? అని బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. అరెస్టుల పర్వం అంతటితో ఆగుతుందా? కేసీఆర్ వరకూ వెళుతుందా? అని బీఆర్ఎస్ ముఖ్యులు ఆరా తీస్తున్నారు. ఇటు రేవంత్‌రెడ్డి, అటు కేసీఆర్ కుటుంబం మధ్య వైరం ముదురుతున్నప్పటికీ, ఇది తగదు అని చెప్పే రాజకీయ పార్టీగానీ, వ్యక్తులుగానీ, వ్యవస్థలుగానీ తెలంగాణలో కనిపించడం లేదు. ఈ పరిస్థితికి కేసీఆర్ స్వయంకృతాపరాధమే కారణం. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంఘాలను, ప్రజాస్వామ్య ప్రియులను కేసీఆర్ నిర్లక్ష్యం చేశారు. గతంలో అధికార, ప్రతిపక్షాల మధ్య కీలక సందర్భాలలో మధ్యవర్తిత్వం నడిపిన కమ్యూనిస్టులను కూడా ఆయన అవమానించారు. దీంతో కేసీఆర్‌కు అండగా నిలబడేవారు కరువయ్యారు. విచిత్రం ఏమిటంటే, కేసీఆర్ కుటుంబానికి అరెస్టుల ముప్పు పొంచి ఉందని వార్తలు వెలువడుతున్నా ప్రజల్లో కూడా సానుభూతి ఏర్పడటం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబును అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు ఆయన పట్ల ప్రజల్లో సానుభూతి ఏర్పడింది. ఈ పరిస్థితి తెలంగాణలో కనిపించడం లేదు. కవిత నెలల తరబడి తీహార్ జైల్లో ఉన్నప్పుడు కూడా ప్రజల్లో సానుభూతి కనిపించలేదు. తెలంగాణ జాతిపితగా ప్రకటించుకున్న తన కుటుంబాన్ని కష్టాలు చుట్టుముడుతున్నా ప్రజల్లో స్పందన ఎందుకు లేదో కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. అధికారం శాశ్వతం కాదని అధికారంలో ఉన్నప్పుడు భావించి ఉన్నట్టయితే కేసీఆర్ కుటుంబానికి ఈ దుస్థితి వచ్చేది కాదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్‌గా చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా వ్యవహరించే విషయమై పునరాలోచన చేయాలి. తన ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నందున ప్రజల మనోభావాలు ఎలా ఉన్నాయి? ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడుతున్నదా? అదే నిజమైతే అందుకు కారణాలేమిటి? వంటి ప్రశ్నలు వేసుకొని సమీక్షించుకోవాలి. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల ప్రజల్లో సదభిప్రాయం ఉండేది. క్రమేపీ అది కనుమరుగవుతోందన్న వార్తలు వస్తున్నాయి. కేసీఆర్ కుటుంబం పట్ల ప్రజల్లో సానుభూతి ఏర్పడకపోయినా, ప్రభుత్వంపై సానుకూలత కొరవడటం రేవంత్‌రెడ్డికి నష్టం చేస్తుంది. ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి పనితీరుపై కొన్ని వర్గాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నందున రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు పరిస్థితులను సమీక్షించుకోవలసిన అవసరం ఉంది. తప్పొప్పులను సరిదిద్దుకోవడానికి ఇదే సరైన తరుణం. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వద్దాం!



ఐదు నెలలకే అంత రచ్చ

చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలే అయింది. అయినప్పటికీ రాష్ట్రం అన్ని రంగాల్లో అధోగతి పాలవుతోందని జగన్ అండ్ కో గగ్గోలుపెడుతున్నారు. చంద్రబాబు పాలనలో దమనకాండ పెచ్చరిల్లుతోందని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. సోషల్ మీడియా ఉన్మాదులపై చర్యలు తీసుకోవాలన్న విషయాన్ని ప్రభుత్వం మరచిపోయినా ప్రజలు మాత్రం మరచిపోలేదు. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా హరించిన జగన్‌రెడ్డి పాలనను ఎవరు మాత్రం ఎలా మరచిపోగలరు? 'ప్రశ్నించే గొంతులను నొక్కేస్తారా?' అని ఇప్పుడు నీతి వాక్యాలు వల్లెవేస్తున్న జగన్ అండ్ కో మొన్నటిదాకా చేసిందేమిటి? ఈ ఐదు నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం ఏం సాధించింది? ఏం సాధించలేదు? అన్న విషయం పక్కన పెడితే ప్రజలు మాత్రం స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. నీలి మీడియా, కూలి మీడియాకు ఇది కనిపించకపోవచ్చు. తెలంగాణలో వలె ఆంధ్రప్రదేశ్‌లో కూడా కమ్యూనిస్టులకు పెద్దగా ప్రాధాన్యం లేకుండా పోయింది. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఆయనతో పరోక్షంగా అంటకాగిన సీపీఎం నాయకులు ఇప్పుడు జెండాలను బయటకు తీసి ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు. మరోవైపు జగన్‌రెడ్డి పార్టీతో పరోక్షంగా స్నేహం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సమాజంలో స్వేచ్ఛాయుత వాతావరణం ఉందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి? సోషల్ మీడియా సైకోలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ అంశంపై జగన్‌రెడ్డి మాత్రమే గుండెలు బాదుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు రహస్యంగా అండదండలు అందించిన సీపీఎం కూడా ఈ విషయంలో జగన్‌తో గొంతు కలపలేని పరిస్థితి. సోషల్ మీడియా సైకోలు చేసిన అరాచకాలను తెలుసుకున్న కొద్దీ ప్రజల్లో ఏవగింపు పెరుగుతోంది. ప్రాథమిక హక్కులు అంటే ఇళ్లలోని ఆడవాళ్లకు రంకులు అంటకట్టడం కాదు కదా? ఇతరుల మనోభావాలను గాయపరచడం ప్రాథమిక హక్కు కాబోదని తమిళనాడు హైకోర్టు మదురై బెంచ్ తాజాగా వ్యాఖ్యానించింది. పండు వృద్ధులని కూడా చూడకుండా ప్రముఖుల తల్లుల వ్యక్తిత్వ హననానికి పాల్పడిన వారికి ప్రాథమిక హక్కులు ఉండాలని జగన్‌రెడ్డి చెప్పగలరా? తన భార్య భారతిరెడ్డి వ్యక్తిత్వ హననానికి ఎవరైనా పాల్పడితే ఆయన సహించగలరా? ఇతరుల తల్లులు, భార్యలను అవమానించినప్పుడు వారికి కూడా అంతే బాధ కలుగుతుంది కదా? ఈ నేపథ్యంలో జగన్‌రెడ్డికి మద్దతుగా ఒక జర్నలిస్టు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు తీవ్రంగా స్పందించింది. హైకోర్టు న్యాయమూర్తులనూ వదలకుండా వేధించిన సోషల్ మీడియా సైకోలపై చర్యలు తీసుకోవద్దా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కారణంగానే జగన్ రోత మీడియా పేజీలకు పేజీలు అభూత కల్పనలతో కథనాలు వండి వార్చినా జగన్‌రెడ్డితో గొంతు కలిపేవారే కరువయ్యారు. అనాగరిక పాలన చేసిన జగన్‌రెడ్డి ఇప్పుడు ఎంతో కొంత ఫలితం అనుభవించాలి కదా?

> గడచిన పదేళ్లలో దేశ రాజకీయాల స్వరూప స్వభావాలు మారిపోయాయి. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి అధికారాన్ని వాడటం పరిపాటిగా మారింది. ఈ విషయంలో ఇటు కేసీఆర్, అటు జగన్‌రెడ్డి సరికొత్త రికార్డులను నెలకొల్పారు.

'హోదా' కోసం బాధ

తాను 30 ఏళ్ల పాటు అధికారంలో కొనసాగుతానని జగన్‌రెడ్డి నమ్మడమే కాకుండా, అలా అనేక కలలు కన్నారు. కానీ, ప్రజలు ఈ ఎన్నికల్లో ఆయనకు ప్రతిపక్ష నేత హోదా కూడా ఇవ్వలేదు. అయినప్పటికీ తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే శాసనసభకు హాజరు కాబోనని అంటున్న జగన్‌రెడ్డిని ఎలా అర్థం చేసుకోవాలి? 1994లో ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా లభించకపోయినా అప్పుడు సీఎల్పీ నాయకుడిగా ఉన్న దివంగత పి.జనార్దన్‌రెడ్డి ప్రభుత్వంపై పోరాటం చేశారు. "నేను అంత.. నేను ఇంత" అని చెప్పుకొనే జగన్‌రెడ్డికి ఆ మాత్రం నైతిక ధైర్యం కూడా లేదే? శాసనసభలో చంద్రబాబును ఎదుర్కోలేరా? సభకు ముఖం చాటేయడం పిరికితనమే అవుతుంది. కుటుంబ సభ్యులను కూడా దూరం చేసుకున్న జగన్‌రెడ్డితో కేసీఆర్‌ను పోల్చలేము. కాకపోతే ఇద్దరు నాయకులూ నియంతృత్వ పోకడలతో ఒకరితో ఒకరు పోటీ పడి ప్రజలకు దూరమయ్యారు. ఇతర పక్షాల నుంచి నైతిక మద్దతు కూడా పొందలేని స్థితిలో ప్రస్తుతం ఉన్నారు. 30 ఏళ్లు అధికారంలో ఉంటామని ప్రగల్భాలు పలికిన జగన్ అండ్ కో ఇప్పుడు అధికారం శాశ్వతం కాదని సుద్దులు చెప్పడం కొసమెరుపు!

సాయిరెడ్డికి సవాల్...

రాజకీయాలలో అప్పుడప్పుడూ నీచత్వానికి పరాకాష్ఠ అనదగిన నికృష్టులు తారసపడుతుంటారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ప్రస్తుతం అటువంటి నికృష్టుడిని విజయసాయిరెడ్డి రూపంలో చూడవచ్చు. కావ్య నాయిక చింతామణి మంచం కింద ఒకరిని, తలుపు చాటున మరొకరిని దాచిపెట్టేది. అలాగే విజయసాయి రెడ్డి కూడా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వైసీపీకి, నాయకుడు జగన్‌రెడ్డికి విధేయుడినని చెప్పుకుంటూనే.. చీకటి మాటున ఇతర పార్టీల నాయకులను కలుసుకుంటుంటారు. ఏబీఎన్ చానల్‌లో ఏదో ఒక కార్యక్రమం ప్రసారమైందని, అందులో తనను విమర్శించారంటూ ఈ నికృష్టుడు నన్ను తిడుతూ సుదీర్ఘ ట్వీట్ చేశాడు. ఆ ట్వీట్‌లో నాపై చేసిన ఆరోపణలకు స్పందించాల్సిన పని లేదు. ఎందుకంటే నేనేమిటో, నా ప్రస్థానం ఎలా మొదలైందో గతంలో ఓపెన్‌గా చెప్పాను. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. సాధారణ జర్నలిస్టు మీడియాకు అధిపతి అవడం ఏమిటి? అని ఆశ్చర్యపోతున్నాడు మన ఏ2 విజయసాయిరెడ్డి. ఈ ప్రశ్నకు నేను గతంలోనే జవాబిచ్చాను. మా నాన్న ముఖ్యమంత్రి కాదు– జగన్‌రెడ్డివలే దొంగ ఆడిటర్ విజయసాయిరెడ్డి వంటి వారి సహకారంతో తెల్లారే సరికి మా వ్యాపార సామ్రాజ్యాన్ని నెలకొల్పలేదు. ఒక్కో ఇటుకా పేర్చుకుంటూ 'ఆంధ్రజ్యోతి'ని విస్తరించాం. విజయసాయి వంటి నీచ నికృష్టుడికి ఉన్న తెలివితేటలు నాకు ఉన్నట్టయితే రోత మీడియా వలె ఒకేసారి 23 ఎడిషన్లు ప్రారంభించి ఉండేవాడిని. నేను బ్లాక్ మెయిల్ చేస్తాను, డీల్ మేకర్‌ని అని కూడా ఈ నీచుడు నన్ను నిందించాడు. బ్లాక్ మెయిల్ చేసి డబ్బు సంపాదించే బుద్ధి ఉంటే ఇటు తెలంగాణలో, అటు ఆంధ్రప్రదేశ్‌లో కేసీఆర్, జగన్‌రెడ్డితో ఏకకాలంలో పోరాడాల్సిన అవసరం ఏమిటి నాకు? ఎవరినో బ్లాక్ మెయిల్ చేసే బదులు ముఖ్యమంత్రులతోనే రాజీపడిపోవచ్చు కదా! ఆ ఇద్దరు ముఖ్యమంత్రుల అహంకార ధోరణుల వల్ల ప్రజలకు నష్టం జరుగుతుందని నమ్మి పోరాడి ఆర్థికంగా ఎంతో నష్టపోయాం. అయినా చలించలేదు. నాతో సయోధ్య కుదుర్చుకోవడానికి జగన్‌రెడ్డి కూడా రాయబారాలను పంపిన విషయం విజయసాయిరెడ్డికి తెలియదా? 'ఎంత కావాలి?' అని అడిగితే 'మీరు ప్రజాస్వామ్యబద్ధంగా పాలించండి చాలు' అని నేను చెప్పిన విషయం మరిచావా? నన్ను డీల్ మేకర్‌గా అభివర్ణించారు కదా! జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు, అధికారం కోల్పోయిన తర్వాత కూడా నన్ను అనేక పర్యాయాలు కలిశావు కదా? ఏ డీల్ కోసం కలిశావో చెప్పు? ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ప్రైవేట్ సంభాషణలను బహిర్గతం చేయడం అనైతికం కనుక విజయసాయిరెడ్డి నా వద్ద ప్రస్తావించిన అంశాలను ఇప్పుడు నేను వెల్లడించడం లేదు. నెల రోజుల క్రితం కూడా ఈ రాజకీయ వికృత జీవి నన్ను కలిశాడు. ఎందుకు కలిశాడో చెప్పే దమ్ముందా అతగాడికి? 'తెలుగు రాష్ట్రాల వెలుపల ఎక్కడైనా తనతో బహిరంగ చర్చకు వచ్చే ధైర్యం ఉందా?' అని సవాలు కూడా విసిరాడు. విజయసాయిరెడ్డి వంటి నీచుడు కూడా చర్చకు ఆహ్వానిస్తే వెళ్లకుండా ఉంటానా? నువ్వూ నేనూ కలసి ఢిల్లీలో 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే' కార్యక్రమం పెట్టుకుందాం. నీ సంగతీ నా సంగతీ ఏంటో తేల్చుకుందాం. ముందుగా ట్వీట్స్ పెట్టడం, ఆ తర్వాత రహస్యంగా కలుసుకొని పైవాళ్ల ఒత్తిడితో చేశాను– నన్ను అపార్థం చేసుకోవద్దని వేడుకోవడం వెన్నెముక లేని ఈ నికృష్టుడికి అలవాటే. ముఖాముఖి చర్చకు సిద్ధం అన్నావు కనుక తాజా ట్వీట్‌లో వాగిన చెత్తకు ఇక్కడ సమాధానం చెప్పడం లేదు. మన ఇద్దరి మధ్య సాగే చర్చను ఏబీఎన్‌లో లైవ్ టెలీకాస్ట్ చేద్దాం. మీ రోత చానల్‌లో కూడా లైవ్ టెలికాస్ట్ చేసుకోవడానికి అనుమతిస్తాను. కండీషన్స్ కూడా ఏమీ లేవు. నువ్వు ఆరోపించినట్టుగా నేను వెధవ పనులు చేసి ఉన్నా, ప్రభుత్వం నుంచి అనుచిత లబ్ధి పొంది ఉన్నా జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు నన్ను వదిలిపెట్టేవారా? ఎంతగా రంధ్రాన్వేషణ జరిపినా ఏమీ దొరకనందునే కదా నా మీద ఒక్క కేసూ పెట్టలేకపోయారు. ప్రభుత్వాలకు ఎదురు వెళ్లడానికి నైతిక బలం ఉండాలి. అది నాకు పుష్కలంగా ఉంది. నీకు ఆ నైతిక బలం లేనందునే కేంద్రంలో అధికారంలో ఎవరుంటే వాళ్ల కాళ్లు పట్టుకుంటావు. నీచ్ కమీన్ విజయసాయికి తెలియనిది

> ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కమ్యూనిస్టులు విలక్షణ పాత్ర పోషించే వారు. రాష్ట్ర విభజన తర్వాత వారి ప్రాధాన్యం తగ్గిపోయింది. కమ్యూనిస్టులకు కేసీఆర్ కనీస గౌరవం కూడా ఇవ్వలేదు. ప్రజా సమస్యల గురించి వివరించడానికి సమయం కోరినా నిరాకరించారు. అదే కేసీఆర్‌కు మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా కమ్యూనిస్టుల అవసరం ఏర్పడింది. అంతే... వారిని ఆహ్వానించి భోజనాలు పెట్టారు. ఆ ఉప ఎన్నికల్లో కమ్యూనిస్టుల సహకారంతో బయటపడ్డారు. ఆ తర్వాత సాధారణ ఎన్నికల వరకు వారి ముఖం చూడలేదు. మునుగోడులో అవగాహన కుదుర్చుకున్నట్టుగానే సాధారణ ఎన్నికల్లోనూ కేసీఆర్ తమతో పొత్తు కుదుర్చుకుంటారని కమ్యూనిస్టులు భావించారు. అయితే, తనకు కమ్యూనిస్టుల అవసరం లేదని భావించిన కేసీఆర్ వారిని కనీసం కలుసుకోవడానికి కూడా ఇష్టపడలేదు. దీంతో సీపీఐ నాయకులు కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టారు. సీట్ల పంపకంలో పేచీ ఏర్పడటంతో సీపీఎం విడిగా పోటీచేసింది.

ఏమిటంటే 'ఆంధ్రజ్యోతి' పత్రికను నేను ప్రారంభించాలనుకున్నప్పుడు ఆ విషయం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియనే తెలియదు. మూతపడిన పత్రిక కార్యాలయాలను తెరిచిన తర్వాత మాత్రమే రాజశేఖరరెడ్డితోపాటు చంద్రబాబును కలసి విషయం చెప్పాను. విజయవాడ వద్ద ఏర్పాటు చేసిన మినీ హైడల్ ప్రాజెక్టు విషయం కూడా చంద్రబాబుకు తెలియదు. ముఖ్యమంత్రుల మోచేతి నీళ్లు తాగే అలవాటు లేదు కనుకనే తల ఎత్తుకొని తిరుగుతున్నాను. ఇప్పటివరకు నువ్వే నా ఇంటికి వచ్చావు కానీ నేను నీ ఇంటికి రాలేదే? 'జగన్‌రెడ్డి నన్ను నమ్మడం లేదు, దూరం పెట్టాడు' అని కనిపించిన వారందరి దగ్గరా ఏడ్చే నువ్వో రాజకీయ వ్యభిచారివి. రాజ్యసభలో పార్టీ ఎంపీలను చేర్పిస్తానని భారతీయ జనతా పార్టీ పెద్దలకు చెప్పి ముఖం చాటేస్తున్నదెవరు? 'నువ్వు నమ్మదగిన వ్యక్తివి కావు– మోసగాడివి' అని కేంద్ర హోం మంత్రి నిన్ను ఉద్దేశించి అనడం నిజం కాదా? అయినా 'ఓపెన్ హార్ట్' ప్రోగ్రాంకు సిద్ధంగా ఉండు. అన్ని విషయాలూ అక్కడే తేల్చుకుందాం. నిజంగా నీది మనిషి పుట్టుకే అయితే నీవు విసిరిన సవాలుకైనా సిద్ధపడు. లేని పక్షంలో 'నీచ మానవుడిని' అని బహిరంగంగా అంగీకరించు... నీచ నికృష్ట విజయసాయిరెడ్డీ! బెస్టాఫ్ లక్!!

> విజయసాయీ, నువ్వు ఆరోపించినట్టుగా నేను వెధవ పనులు చేసి ఉన్నా, ప్రభుత్వం నుంచి అనుచిత లబ్ధి పొంది ఉన్నా జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు నన్ను వదిలిపెట్టేవారా? ఎంతగా రంధ్రాన్వేషణ జరిపినా ఏమీ దొరకనందునే కదా నా మీద ఒక్క కేసూ పెట్టలేక పోయారు. ప్రభుత్వాలకు ఎదురు వెళ్లడానికి నైతిక బలం ఉండాలి. అది నాకు పుష్కలంగా ఉంది. నీకు ఆ నైతిక బలం లేనందునే కేంద్రంలో అధికారంలో ఎవరుంటే వాళ్ల కాళ్లు పట్టుకుంటావు. నీచ్ కమీన్ విజయసాయికి తెలియనిది ఏమిటంటే 'ఆంధ్రజ్యోతి' దినపత్రికను నేను ప్రారంభించాలనుకున్నప్పుడు ఆ విషయం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియనే తెలియదు. మూతపడిన పత్రిక కార్యాలయాలను తెరిచిన తర్వాత మాత్రమే రాజశేఖరరెడ్డితోపాటు చంద్రబాబును కలిసి విషయం చెప్పాను. 'జగన్‌రెడ్డి నన్ను నమ్మడం లేదు, దూరం పెట్టాడు' అని కనిపించిన వారందరి దగ్గరా ఏడ్చే నువ్వో రాజకీయ వ్యభిచారివి. 'నువ్వు నమ్మదగిన వ్యక్తివి కావు– మోసగాడివి' అని కేంద్ర హోం మంత్రి నిన్ను ఉద్దేశించి అనడం నిజం కాదా? అయినా 'ఓపెన్ హార్ట్' ప్రోగ్రాంకు సిద్ధంగా ఉండు. అన్ని విషయాలూ అక్కడే తేల్చుకుందాం.

కృష్ణాతీరంలో సాహితీ తపస్వి

> పోలవరపు కోటేశ్వరరావు (1929–2008) కవి, కథకుడు, నవలా రచయిత, నాటకకర్త, వ్యాసకర్త, గేయకర్త, పరిశోధకుడు, భాషా సైనికుడు, సాహిత్య సంస్కృతీ వికాస శ్రామికుడు, స్వాతంత్ర్యోద్యమకారుడు, ఆదర్శ రైతు, పారిశ్రామికవేత్త, వితరణశీలి, వెరసి 'మంచి మనిషి'. కృష్ణానదిపై ఆయన వ్రాసిన 'కృష్ణవేణి' సంగీత రూపకానికి అఖిలభారత స్థాయిలో ఆకాశవాణి ప్రథమ బహుమతి లభించింది. స్వీయచరిత్ర 'నా రచనా మార్గం – అక్షరాన్వేషణ', ఆ కీర్తిశేషుడి సాహితీమూర్తిని సంపూర్ణంగా ఆవిష్కరించింది.



తెలుగు నేల నాలుగు చెరగులా వివిధ మాండలికాల్లో రచనలు చేసిన రచయితలు, కవులు ఎందరో ఉన్నారు. అన్ని మాండలికాలు మధురమైనవే. 'వచ్చిండన్నా, వచ్చాడన్నా వరాల తెలుగు ఒకటేనన్నా' అని జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సి. నారాయణరెడ్డి ఎలుగెత్తారు. వివిధ మాండలికాలలో రచనలు చేసిన వారిలో కృష్ణా జిల్లా గ్రామీణ మాండలికంలో రచనలు చేసి 'నేటి శ్రీనాథుడు', 'కథాహాలిక', 'కథా కథన సవ్యసాచి'గా బిరుదాంకితుడైన సాహితీ తపస్వి పోలవరపు కోటేశ్వరరావు.

ఈ కీర్తిశేషుడు (1929–2008) కవి, కథకుడు, నవలా రచయిత, నాటకకర్త, వ్యాసకర్త, గేయకర్త, పరిశోధకుడు, సాంఘిక ఉద్యమాల నాయకుడు, భాషా సైనికుడు, సాహిత్య సంస్కృతీ వికాస శ్రామికుడు, పర్యాటకుడు, స్వాతంత్ర్యోద్యమకారుడు, ఆదర్శ రైతు, పారిశ్రామికవేత్త, సినీ నిర్మాత, వితరణశీలి, వెరసి 'మంచి మనిషి'. ముగ్గురు పద్మశ్రీలు ఉన్న సభలో యిచ్చిన 'సాహిత్య తపస్వి', ఆయనకు చక్కగా అతికిన బిరుదు.

తెలుగు సాహిత్యంలో ఉన్న అన్ని ప్రక్రియలలోను 'వాసి' ప్రధానంగా, సుమారు 50 సంవత్సరాల అక్షర సేద్యంలో '55'కు పైగా సృజనాత్మక రచనలు చేసారు. అయన కృతులు 3 వేల పేజీల పర్యంతం విస్తరించాయి.

1929లో కృష్ణానదికి పడమరగా ఉన్న గుంటూరు జిల్లా, అనంతవరంలో లక్ష్మయ్య – శ్రీవేణమ్మలకు కోటేశ్వరరావు జన్మించారు. నదికి తూర్పున ఉన్న కృష్ణాజిల్లా, వీరమాచనేనివారి పాలెంలో ఆయన బాల్యం అంతా గడిచింది. అలా కృష్ణా నదికి ఇరువైపులా, ఆ నదితో పెనవేసుకుపోయిన జనన – బాల్యాల వల్ల, కమ్మని కృష్ణమ్మ నీరు త్రాగుతూ, అందాలను ఆస్వాదిస్తూ, ప్రేమిస్తూ, పరవశిస్తూ, తన చదువు, వ్యవసాయం సాగించారు.

చిన్ననాడే మహాత్మాగాంధీని దర్శించుకున్న ప్రభావంతో, 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. గోడలపై నినాదాలు వ్రాసి, వ్రాయించారు. తన 21వ ఏటనే ఆంధ్రోద్యమం, నందికొండ ప్రాజెక్టు ఉద్యమాలలో, నాయకత్వం వహించారు. చుట్టూ ఉన్న గ్రామాలలోని విద్యార్థులను, యువకులను తాను వ్రాసిన 'ఎన్నికల పోరాటం' వంటి పాటలతో, 'ఆంధ్రభాగోతం' అనే యక్షగానంతో సమీకరించి, రాత్రి పాఠశాలలు – గ్రామీణ ఆటల నిర్వహణ – గ్రామసేవ శిక్షణ – దళిత జనోద్ధరణలలో పాల్గొనేలా చేసారు. 'దీపిక' పేరుతో వ్రాత పత్రిక నిర్వహించారు. ద్వితీయ ప్రపంచ సంగ్రామంపై పరిశోధన వ్యాసాలు, కథలు వ్రాసారు. 'సీతమ్మ', 'రిక్షావాలా' మొదలైన నవలలు వ్రాసారు. యువజనోత్సవాలు నిర్వహించి, జానపదగేయాలు, దేశభక్తిని పెంపొందించే నాటకాలు స్వయంగా వ్రాసి, ప్రదర్శించారు. స్వాతంత్ర్యానంతరం తన ఆలోచనలు – ఆచరణలు, యువజన వికాసానికి, గ్రామ అభ్యుదయానికి వినియోగించారు.

సహకారోద్యమ స్ఫూర్తితో 'ఆంధ్రనాయక విశాల పరపతి సంఘం' స్థాపించారు. వివిధ విషయాలలో జిజ్ఞాస, క్రమశిక్షణ, అధ్యయనాలు ఆయన ఆలోచనా పరిధిని, అవగాహనా విస్తృతిని పెంచాయి. స్థానిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ మార్పుల పట్ల ప్రశంసనీయమైన పరిజ్ఞానం సంపాదించారు. విశాలాంధ్ర రాష్ట్ర పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు.

తదనంతరం, విజయవాడ వచ్చి ఆటోమొబైల్ వ్యాపారం చేస్తూ, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమికి సారథ్యం వహిస్తూ, వందలాది సాహిత్య – సాంస్కృతిక కార్యక్రమాలు రూపొందించి, నిర్వహించి, కళారంగానికి తలమానికమైన సేవ చేసారు. కృష్ణా – గోదావరీ బేసిన్ ఓఎన్‌జీసీ ప్రాంతీయ కార్యాలయం ఆంధ్రలోనే ఉండాలనే ఉద్యమంలో ప్రధాన భూమిక వహించారు.

కృష్ణానదిపై వ్రాసిన 'కృష్ణవేణి' సంగీత రూపకానికి అఖిలభారత స్థాయిలో ఆకాశవాణి ప్రథమ బహుమతి అందుకున్నారు. గత మూడు కృష్ణా పుష్కరాల సందర్భంగా ఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాలలోనే కాక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పట్టణాలలో ప్రదర్శిస్తున్నారు. 'దక్షిణ గంగ గోదావరి' అనే టీవీ సీరియల్ రచన – నిర్మాణం చేసి దూరదర్శన్‌లో ప్రసారం చేశారు. ఆయన రేడియో నాటికలు, ప్రసంగాలు అసంఖ్యాకం.

1980లో వ్యాపార వ్యాపకాలకు విరామం ప్రకటించి, పూర్తి స్థాయిలో రచనా వ్యాసంగంలో, సాంస్కృతిక – సామాజిక సేవలో నిమగ్నమయ్యారు. సి. ధర్మారావు గారి స్నేహంతో తెలుగు భాషోద్యమ సమాఖ్యలో ప్రవేశించి, ఇబ్బడిముబ్బడిగా అద్భుతమైన 100కు పైగా కథలు (లచ్చుమయ్య కథలు, కృష్ణా తరంగాలు కాకుళయ్య కథలు మా ఊరి మనుషులు); మహాత్మా జిందాబాద్, శ్రీనాథుల వారొచ్చారు, రాయలు రంగన్న, రథయాత్ర వంటి నాటికలు; మనము– మన నృత్యాలు, నృత్య పూజ వంటి పరిశోధనాత్మక రచనలు; నృత్యారాధన, గౌతమబుద్ధ, యయాతి, విశాలాంధ్ర వైభవం వంటి నృత్య రూపకాలు; చినబాబు – రాజముద్రిక వంటి బాలల నవలలు; భర్తృహరి – గాథాసప్తశతి – చాటువులపై కథలు; మొదలైనవి పోలవరపు కలం నుండి జాలువారాయి. స్వీయచరిత్ర 'నా రచనా మార్గం – అక్షరాన్వేషణ', పోలవరపు కోటేశ్వరరావు సాహితీమూర్తిని సంపూర్ణంగా ఆవిష్కరించింది.


పోలవరపు కుటుంబసభ్యులు తెలుగు భాషను పల్లకీలో మోస్తున్న ఉత్తమ కవులు, రచయితలకు 'సాహితీ తపస్వి పోలవరపు కోటేశ్వరరావు' పురస్కారం ఏర్పాటు చేసారు. అందుకున్న వారిలో శ్రీ విరించి, విహారి, ఆచార్య కొలకలూరి ఇనాక్, శ్రీమతి జలంధర, కన్నెగంటి అనసూయ, శ్రీమతి వాడ్రేవు వీరలక్ష్మీదేవి, వివినమూర్తి, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, పతంజలి శాస్త్రి, సింగమనేని నారాయణ మొదలైన ప్రముఖులు ఉన్నారు.

విజయవాడ, తుమ్మలపల్లి కళాక్షేత్రంలో త్రిపురనేని రామస్వామి, చలం వంటి ఎందరో వైతాళికుల, మార్గదర్శకుల విగ్రహాలను పోలవరపు ప్రతిష్ఠింపచేసారు. 2008లో ఆయన తిరిగిరాని ప్రయాణం పెట్టుకున్నారు. నేనాయనకు పెద్ద అల్లుడినని, నా భార్య మొదటి కుమార్తె అని మనఃస్ఫూర్తిగా నన్ను ప్రేమిస్తూ ఉండేవారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వున్న ఆయన కాంస్య విగ్రహాన్ని ఎప్పుడూ తలుచుకుంటూ వుంటాను.

పోలవరపు రచనల సంకలనం మూడు భాగాలుగా మా 'లోకనాయక్ ఫౌండేషన్' ద్వారా తీసుకురావడం నా అదృష్టం. మొదటి, రెండవ భాగాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. మూడవ భాగాన్ని మిత్రులు వేమూరి రాధాకృష్ణ ఆవిష్కరించడం ఎంతో ఆనందదాయకం.

• ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
జాతీయ అధ్యక్షులు, విశ్వ హిందీ పరిషత్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
ఆదివారం 17 నవంబరు 2024




బ్రహ్మా కైలాసం

సండే స్పెషల్

- ఆధ్యాత్మిక, పర్యాటక నగరి శివలింగాలపురం కొండ
- అపర కైలాసం బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి ఆలయం
- బ్రహ్మయ్యలింగం చెరువు ఓ మహా పుణ్యతీర్థం

- గన్నవరం నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్షేత్రం
- ఐదో శతాబ్దం నాటి ఆనవాళ్లతో ఎంతో ప్రాశస్త్యం
- పల్లవరాజులు, కృష్ణదేవరాయలు సందర్శించిన ప్రాంతం
- కైలాసగిరి, యాదగిరిగుట్టను తలపించే సోయగం
- అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు అవకాశాలెక్కువ
- ప్రత్యేక దృష్టిపెట్టిన సీఎం చంద్రబాబు



బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి

బ్రహ్మయ్యలింగం చెరువు

అక్కడి ప్రకృతి ప్రణవనాదం.. నీరు బ్రహ్మజలం.. మన్ను మహిమాన్వితం.. మిన్ను మహోన్నతం.. ఇక్కడ నడిచే ప్రతి అడుగూ ఓ ప్రదక్షిణే. ప్రతి దృశ్యమూ శివతేజమే. శతాబ్దాల కిందట మొదలైన ఈ పౌరాణిక శివలింగాలపురం ప్రాశస్త్యం, ఇక్కడి బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి ఆలయ వైశిష్ట్యాన్ని గ్రహించి ఎంతోమంది రాజులు, పల్లవరాజులు, శ్రీకృష్ణదేవరాయలు పునఃప్రతిష్ఠ చేశారు. పచ్చటి ప్రకృతి రమణీయతకు దగ్గరగా అపర కైలాసాన్ని తలపించే ఈ క్షేత్రం.. అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలో ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అభివృద్ధికి బాటలు వేసినా.. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టేసింది. తిరిగి టీడీపీ కూటమి ప్రభుత్వం రావడం, సీఎం చంద్రబాబు దీనిపై ప్రత్యేక ఆసక్తి చూపిస్తుండటంతో భవిష్యత్తులో ఈ శివలింగాలపురం కొండ గొప్ప పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా పరిఢవిల్లుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అటు విశాఖలో కైలాసగిరి, ఇటు తెలంగాణలో యాదగిరిగుట్టను తలపించేలా ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తే బాగుంటుందంటున్నారు. విశాలమైన ప్రాంగణం ఉండటం వల్ల పర్యాటక సౌకర్యాలు కల్పిస్తే ఈ ప్రాంతం ముందుముందు ముక్తిధామంగా మారుతుందనేది భక్తుల అభీష్టం.

8లో

బ్రహ్మయ్య లింగేశ్వరస్వామి ఆలయం

వేడుకల వివరాలు ముందే చెప్పండి

ఫంక్షన్ హాళ్లు, హోటళ్ల ప్రతినిధులతో సమావేశంలో సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు, బాంక్వెట్‌లలో నిర్వహించే కార్యక్రమాల వివరాలను ముందుగా పోలీసులకు తెలియజేయాలని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు సూచించారు. నగరంలోని ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలు, హోటళ్ల ప్రతినిధులతో ఎంజీ రోడ్డులోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ సమాచారం కోసం ఒక దరఖాస్తును రూపొందించామన్నారు. ఇప్పటికే కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అస్త్రం యాప్ ద్వారా ట్రాఫిక్ పర్యవేక్షణ జరుగుతోందన్నారు. హోటళ్లు, కల్యాణ మండపాలు, బాంకెట్స్‌లో జరిగే పెళ్లిళ్లు, నిశ్చితార్థాలు, పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన సమాచారాన్ని ఈ దరఖాస్తులో పొందుపరచాలన్నారు. ఆ సంస్థల ప్రతినిధులతో ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశామన్నారు. ఈ దరఖాస్తును ఆ గ్రూపులో పోస్టు చేయాలని చెప్పారు. ఎంతమంది హాజరవుతారు, ఎన్ని వాహనాలు వస్తాయి.. అనే వివరాలను తెలియజేయాలని స్పష్టం చేశారు. దీనిప్రకారం ఆయా రోజుల్లో, ఆ పరిసర ప్రాంతాల్లో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం యువర్ కాంట్రిబ్యూషన్ ఫర్ ట్రాఫిక్ ఎక్స్‌పీరియన్స్ అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీసీపీలు గౌతమీ షాలీ, కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



● భళా.. నాట్యకళ

8లో

అమరావతి బాలోత్సవం రెండోరోజు శనివారం కూడా సందడిగా సాగింది. పీబీ సిద్దార్థ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో 9వేల మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కారు బీభత్సం చిరువ్యాపారి మృతి

8లో

ఆంజనేయుడి భూమి మాయం





రికార్డుల నుంచి మాయమైన భూవిఎలో వేసిన షెడ్లు (ఇన్‌సెట్‌లో) అంబాపురంలోని ఆంజనేయస్వామి ఆలయం

అంబాపురంలో సర్పంచ్ సీతయ్య స్వాహాపర్వం

- ఆలయానికి చెందిన 4.92 ఎకరాల భూమి లీజుకు..
- రికార్డులు మాయం చేసి.. 1.10 ఎకరాలు హాంఫట్
- రూ.5 కోట్ల భూమికి రికార్డులు సృష్టించే పన్నాగం
- వైసీపీ నేతగా భూమిని కాజేసి..
- ప్రభుత్వం మారడంతో టీడీపీలోకి జంప్
- ఆయన హస్తం ఉందంటున్న ఆలయ కమిటీ

సామాన్యుల ఆస్తులకే కాదు దేవుడి ఆస్తులకూ రక్షణ లేకుండాపోతోంది. విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన సుమారు ఎకరం భూమి ఆక్రమణకు గురైంది. ప్రభుత్వ రికార్డుల నుంచి తొలగించేసి ఆ భూమిని కబ్జా చేసేందుకు పావులు కదుపుతున్నారు. దీని విలువ సుమారు రూ.5 కోట్లు పైచిలుకు ఉంటుంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : అంబాపురంలోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో దూపదీప నైవేద్యాల కోసం దశాబ్దాల క్రితం దాతలు సుమారు 4.92 ఎకరాలు రాసిచ్చారు. ఈ భూమిని కౌలుకు ఇవ్వడం ద్వారా కమిటీ ఆలయ నిర్వహణ చేస్తూ వస్తోంది. అయితే, 2018 వరకు ప్రభుత్వ రికార్డుల్లో 4.92 ఎకరాలు ఉన్న భూమి 2024కు వచ్చేసరికి 3.82 ఎకరాలే మిగిలింది. అంబాపురంలోని సర్వే నెంబరు 47-5లో 4.92 ఎకరాల్లో 1.10 ఎకరాలు మాయమైంది. 2019లో ఈ భూమిని అంబాపురానికి చెందిన గండికోట సీతయ్యకు లీజుకు ఇచ్చినట్లు పాత ఆలయ కమిటీ చెబుతోంది. ఆ తర్వాత ప్రభుత్వ రికార్డుల్లో 1.10 ఎకరాలు ఎందుకు తగ్గిందో తమకు తెలియదంటోంది. కొత్త కమిటీ సభ్యులు మాత్రం ఆ భూమిని పకడ్బందీగా కబ్జా చేసేందుకే రికార్డుల్లో నుంచి తొలగించారని ఆరోపిస్తున్నారు. 2019లో ఈ భూమిని లీజుకు తీసుకున్న సీతయ్య ఏడాదికి రూ.60 వేలు కౌలు చెల్లిస్తానని అగ్రిమెంట్ రాసుకున్నారు. అయితే, రెండేళ్లుగా లీజు చెల్లించడం లేదని ప్రస్తుత కమిటీ సభ్యుల ఆరోపణ.

ఏం జరిగింది..?

ఆలయ భూమి 2018 వరకు 4.92 ఎకరాలుండగా, ఆ తర్వాత 1.10 ఎకరాలు మాయమై కేవలం 3.82 ఎకరాలే రికార్డుల్లో ఉండటం అనుమానాలకు తావిస్తోంది. ఇన్నర్ రింగ్‌రోడ్డు చెంతనే ఉన్న ఈ భూమి విలువ ప్రస్తుతం రూ.5కోట్ల పైచిలుకు. ఇంత ఖరీదైన భూమిని రికార్డుల్లో నుంచి తొలగించి వేరే సర్వే నెంబరుతో ప్రైవేట్ వ్యక్తుల పేరుతో పట్టా సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. భూరికార్డుల్లో నుంచి ఎకరం మాయం

మిగతా 8లో..

సమగ్ర విచారణ జరపాలి

'ఆంజనేయస్వామి ఆలయ భూములపై సమగ్ర విచారణ జరపాలి. ఆలయానికి చెందిన భూమిని ప్రభుత్వ రికార్డుల్లోకి ఎక్కించాలి' అని ఆలయ కమిటీ అధ్యక్షుడు నక్కబోయిన రాఘవులు కోరుతున్నారు. ఆలయాన్ని దేవదాయ శాఖలో విలీనం చేయాలని కమిటీ తీర్మానం చేసి, త్వరలో దేవదాయ శాఖ అధికారులకు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

లాయరే అయినా.. క్రిమినల్ మైండ్



హత్యాయత్నం కేసులో వైసీపీ నేత గౌతంరెడ్డి క్రైం గేమ్

- బీబీఏ న్యాయవాదులను పావులుగా చేసి కుట్ర
- ఈనెల 6న ఉమామహేశ్వరశాస్త్రిపై హత్యాయత్నం
- పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని 7న బీబీఏకు లేఖ
- 'ఐక్యం' పేరుతో న్యాయవాదులను రెచ్చగొట్టే యత్నం

దాడి నిర్ధారణతో పరార్

విజయవాడ, ఆంధ్రజ్యోతి : పూనూరు గౌతంరెడ్డి.. అందరికీ తెలిసి ఆయన వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు, ఫైబర్‌నెట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్. న్యాయవాది కూడా అయినా.. ఎవరికీ తెలియని క్రిమినల్ ఆలోచనలు చేయడంలో ఆయన దిట్ట. ఆది నుంచి నేరస్వభావం కలిగిన గౌతంరెడ్డి సత్యనారాయణపురంలోని గండూరి ఉమామహేశ్వరశాస్త్రిపై హత్యాయత్న పన్నాగంలో ఎన్నో క్రిమినల్ స్కెచ్‌లు వేశాడు. పోలీసులు తన జోలికి వెళ్లకుండా న్యాయవాదులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడు.

బీబీఏకు లేఖ

జూనియర్ న్యాయవాది పృథ్వీరాజ్, చిల్లకల్లుకు చెందిన అనిల్ కనుసన్నల్లోని సుపారీ గ్యాంగ్ ఈనెల 6న ఉమామహేశ్వరశాస్త్రిపై దాడి చేసింది. బాధితుడి ఫిర్యాదుతో సత్యనారాయణపురం పోలీసులు రంగప్రవేశం చేశారు. పట్టపగలు నిందితులు ఉమామహేశ్వరశాస్త్రి ఇంటి ప్రహరీ దాటడం సీసీ కెమెరాల్లో కనిపించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్న విషయం గౌతంరెడ్డి చెవిన పడింది. ఈ సమయంలోనే తన క్రిమినల్ బుర్రకు పదును పెట్టాడు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా నమోదైన గౌతంరెడ్డి సహచర న్యాయవాదులను రెచ్చగొట్టి రోడ్డుపైకి తీసుకొచ్చే స్కెచ్ వేశాడు. ఆయన వద్ద జూనియర్‌గా ఉన్న సాయిరాం అనే న్యాయవాదితో బీబీఏకు ఈనెల 7న లేఖ రాయించాడు. ఉమామహేశ్వరశాస్త్రిపై జరిగిన దాడితో ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ పోలీసులు దర్యాప్తు పేరుతో హై హ్యాండిల్ చేస్తున్నారని లేఖలో పేర్కొన్నాడు. ఒక న్యాయవాది విషయంలో పోలీసులు పరిమితులు దాటి వ్యవహరిస్తున్నారని వివరించాడు. న్యాయవాదులంతా అండగా నిలవాలని పిలుపునిచ్చాడు. ఈ లేఖను ఆ మర్నాడు బీబీఏకు అందజేశాడు. ఉమామహేశ్వరశాస్త్రిపై జరిగిన దాడి విషయం ఈనెల 12వ తేదీన మీడియాకు తెలిసింది. గౌతంరెడ్డి మాత్రం దాడి జరిగిన వెంటనే లేఖ రాయించి న్యాయవాదుల మద్దతును కూడగట్టుకుని రాద్ధాంతం

మిగతా 8లో..

నివాళి



చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ రజతోత్సవ సభ గాంధీనగర్‌లోని శ్రీరామా ఫంక్షన్ హాల్లో శనివారం ఘనంగా జరిగింది. ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి, ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె.నారాయణ తదితరులు పాల్గొని చంద్ర చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

6లో

ఎమ్మెల్సీ ఓటు నమోదులో గందరగోళం

- ఈనెల 6వ తేదీకే పూర్తయిన గడువు
- తాజాగా ఓటీపీలు చెప్పాలంటూ ఫోన్లు
- గడువు పెంచారో లేదో తెలియని తికమక
- గతంతో సర్వర్ సమస్యతో రిజిస్టర్ కాని దరఖాస్తులెన్నో..
- ఆందోళనలో పట్టభద్రులు.. గడువు పెంచాలని డిమాండ్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్ర నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు అపహాస్యంగా మారింది. పట్టభద్రుల ఓటరు నమోదుపై ఎన్నికల యంత్రాంగం సరైన ప్రచారం కల్పించకపోవటం ఒక సమస్య అయితే, కేవలం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ప్రచారం ద్వారా మాత్రమే చాలామంది పట్టభద్రులు ఆలస్యంగా ఓటుహక్కు నమోదు విషయాన్ని తెలుసుకోవడం మరో సమస్య అయితే, అప్పటికే సమయం మించిపోయింది.

సర్వర్ సమస్యతో..

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వందల సంఖ్యలో పట్టభద్రులు ఓటుహక్కు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయారు. తుది గడువు ఈనెల 6నే ముగియగా, 4, 5, 6 తేదీల్లో ఆన్‌లైన్ పోర్టల్ సర్వర్ పనిచేయలేదు. దీంతో ఆన్‌లైన్ సెంటర్లు, మీ సేవా కేంద్రాలు, ఏపీఎన్జీజీవో సంఘం, ఉపాధ్యాయ సంఘాలు ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు ఉండిపోయాయి. సర్వర్ పనిచేసినపుడు కొన్నింటికి మాత్రమే రిజిస్టర్ చేశారు. సమయం ముగియడంతో మిగిలిన వాటిని రిజిస్టర్ చేయలేకపోయారు. విజయవాడ నగరంలో ఏపీఎన్జీజీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓటు నమోదు చేపట్టినా, సర్వర్ సమస్య కారణంగా పూర్తిగా రిజిస్ట్రేషన్ చేయలేని పరిస్థితి ఏర్పడింది. చాలా దరఖాస్తులను ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఏర్పాటు చేయించిన కార్యాలయానికి పంపించి, అక్కడి నుంచి ఓటు నమోదు చేపట్టారు.

గడువు పెంచారా..?

ఎమ్మెల్సీ అశోక్‌బాబు కార్యాలయం వద్ద ఓటు నమోదు చేయించుకున్న చాలామందికి శనివారం ఓటీపీ చెప్పమని ఫోన్లు వచ్చాయి. దీంతో గందరగోళం నెలకొంది. గడువు ముగిశాక ఓట్ల నమోదుకు ఎలా అవకాశం ఉంటుందని చాలామంది ప్రశ్నించారు. అలాగే, ఏపీఎన్జీవో కార్యాలయంలో దరఖాస్తులు ఇస్తే, ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఆఫీసుకు ఎందుకు వెళ్లాయో తెలియక పట్టభద్రులు గందరగోళానికి గురయ్యారు. చాలామంది ఓటీపీ చెప్పలేదు. గడువు ముగిసినా సైట్ ఓపెన్ అయ్యిందని, అందుకే పెండింగ్‌లో ఉన్న వాటిని రిజిస్టర్ చేస్తున్నామని సమాధానం ఇచ్చారు. అయితే, అధికారికంగా

మిగతా 6లో..

మాయాజూదం

* అవనిగడ్డ నియోజకవర్గంలో జోరుగా సింగిల్ నంబర్ల ఆట
* 100 రూపాయలకు రూ.6,200 అంటూ ఆశ పెడుతున్న బుకీలు
* రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులే లక్ష్యంగా దందా!
* చల్లపల్లిలో మొదలై నియోజకవర్గవ్యాప్తంగా విస్తరణ
* దశాబ్దం కిందట ఆగిన ఈ జూదం వైసీపీ హయాంలో మళ్లీ పురుడు పోసుకుంది

"ఒక వంద రూపాయలు మీది కాదనుకుంటే రూ.6,200 చేజిక్కించుకునే సువర్ణ అవకాశం మీదే. ఎన్నాళ్లు కష్టపడితే ఇంత డబ్బు చూడగల్గుతారు" అంటూ రెక్కాడితే గానీ డొక్కాడని రోజు వారి కూలీలు, ఏ పూట లాభంతో ఆ పూట కుటుంబాన్ని నడుపుకునే చిరు వ్యాపారులు, చేతి వృత్తిదారులే లక్ష్యంగా చేసుకుని వారి కష్టాన్ని నిలువునా దోచుకుంటున్నారు సింగిల్ నంబర్ల ఆట జూదగాళ్లు. నియోజకవర్గవ్యాప్తంగా తమ కార్యకలాపాలను విస్తరించిన వీరు రోజుకు రూ.4 లక్షలపైనే వసూళ్లకు పాల్పడుతున్నారు. దశాబ్దం కిందట ఆగిన ఈ జూదం వైసీపీ హయాంలో మళ్లీ పురుడు పోసుకుంది.



యార్లగడ్డలో బుకర్లకు బెట్టింగ్ డబ్బు చెల్లిస్తున్న కూలీలు (ఫైల్)

అవనిగడ్డ-ఆంధ్రజ్యోతి: చల్లపల్లి కేంద్రంగా రెండేళ్ల కిందట సింగిల్ నంబర్ జూదం ప్రారంభమైంది. మొదట్లో చల్లపల్లి, ఘంటసాల మండలాలకే ఈ జూదం పరిమితం కాగా, పోలీసుల నిఘా పెరగటంతో నిర్వాహకులు తమ జూదాన్ని మిగిలిన మండలాలకు కూడా విస్తరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 100 మందికి ఒకరు చొప్పున ప్రజల నుంచి రోజు వారీ బెట్టింగ్ మొత్తాన్ని కలెక్ట్ చేసి నిర్వాహకులకు అందజేస్తున్నారు. తాము కలెక్ట్ చేసిన మొత్తానికి పది శాతం కమీషన్ పొందుతున్నారు. ఎలాంటి కష్టం లేకుండా పది శాతం కమీషన్ చేతిలోకి వచ్చిపడుతుండటంతో గడిచిన కొద్ది నెలలుగా అవనిగడ్డ మండలంలోని పలు గ్రామాల్లో సైతం సింగిల్ నంబర్ జూదం జోరుగా సాగుతోంది. ఇప్పటికే అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డ, పాత ఎడ్లంక, అవనిగడ్డ, సీతాయిలంక ప్రాంతాల్లో కొందరు బుకీలు ఈ జూదాన్ని ఇక్కడి వారికి అలవాటు చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

విష వలయంలోకి లాగుతున్నారు

గతంలో బుకీలు చార్టులు పట్టుకుని గ్రామాల్లో బెట్టింగ్ కాసిన వారి పేరు, వారు ఏ నంబర్‌పై కాసారో, ఎంత మొత్తం కాసారో వివరాలు నమోదు చేసుకునే వారు. అయితే టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో బూకర్లు చార్టులు పక్కన పెట్టి సెల్‌ఫోన్ ద్వారానే బెట్టింగ్ రాకెట్‌ను నిర్వహించేస్తున్నారు. గ్రామాల్లో చిన్న చిన్న పనులు చేసుకునే వారి దగ్గరకు వెళ్లి వారి వద్ద నుంచి రూ.50 మొదలు రూ.1000 వరకు వారు ఎంత బెట్టింగ్ కాయదల్చుకున్నారో ఆ మొత్తాన్ని తీసుకుని వాట్సాప్‌లో వారి వివరాలను నిర్వాహకులకు పంపుతున్నారు. పది నుంచి 99 అంకెల నడుమ ఏదైనా ఒక నంబర్‌పై బెట్టింగ్ కాయిస్తున్నారు. బెట్టింగ్ కాసిన వారు గెలుపొందితే సాయంత్రానికే వారు బెట్టింగ్ కాసిన మొత్తానికి 62 రెట్ల మొత్తాన్ని ఇస్తూ పలువురిని ఈ విష వలయంలోకి లాగుతున్నారు.

ఆన్‌లైన్ లాటరీ యాప్‌ల్లో వచ్చే ఫలితాలే ప్రామాణికం

సింగిల్ నంబర్ జూదంలో పదవ అంకె నుంచి 99వ అంకె నడుమ ఏదైనా తమకు నచ్చిన అంకెపై బెట్టింగ్ కాస్తే ఆ రోజు సాయంత్రానికి ఆన్‌లైన్ లాటరీ యాప్‌ల్లో ప్రైజ్ తగిలిన 10 లేదా 14 నంబర్ల అంకెల్లో మొదటి, చివరి అంకెను గెలుపొందిన అంకెలా నిర్ణయిస్తారు. ఇందుకోసం ఏరోజుకారోజు ఆన్‌లైన్ లాటరీ యాప్‌ల్లో వచ్చే ఫలితాలను బెట్టింగ్ కాసే వారు పరిశీలిస్తుంటారు. తమ నంబర్‌కు లాటరీ తగిలిందో లేదో తెలుసుకునేందుకు తమ వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్‌లో ఈ యాప్‌లను డౌన్ లోడ్ చేసుకునే వారు కేవలం ఇది సింగిల్ నంబర్ ఆటకు మాత్రమే బెట్టింగ్ కట్టి ఆగకుండా యాప్‌లో కూడా జూదం ఆడుతూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు.

అధికారుల తీరుపై విమర్శలు

సింగిల్ నంబర్ లాటరీ వ్యవహారంలో అధికారులు తీసుకుంటున్న చర్యలపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చల్లపల్లికి చెందిన కొంతమంది నిర్వాహకులపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేయగా, వారి భాగస్వాములు సింగిల్ నంబర్ జూదం యథావిధిగా కొనసాగిస్తున్నారు. పోలీసులు హడావుడి చేసే రోజుల్లో సైలెంట్‌గా ఉంటూ ఆ తర్వాత మళ్లీ తమ వ్యవహారాలు కొనసాగిస్తున్నారు. వివిధ స్థాయిల్లో అధికారులకు తమ వంతు సమర్పించుకుని తమ జోలికి రాకుండా చూసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోజుకు రూ.4 లక్షలకు పైగా కలెక్షన్

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బుకీలు ఒక్కొక్కరూ రోజుకు రూ.4వేల నుంచి రూ.5 వేలకు తక్కువ కాకుండా వసూలు చేయడం ద్వారా రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల మేర బెట్టింగ్ మొత్తం సమకూరుతోంది. దీనిలో బుకీలకు కమీషన్ కిందే రోజుకు రూ.40 వేల నుంచి 50 వేల వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. చల్లపల్లి మండలంలో పోలీసులు బెట్టింగ్ నిర్వాహకులపై బైండోవర్ కేసులు పెట్టడంతోపాటు గడిచిన కొద్ది రోజులుగా కఠినంగా వ్యవహరించటంతో వారు ఇతర ప్రాంతాలకు సింగిల్ నంబర్ లాటరీని విస్తరించే ప్రయత్నాలు చేస్తున్నట్లుగా సమాచారం.

కఠిన చర్యలు తీసుకుంటాం

చల్లపల్లి కేంద్రంగా సింగిల్ నంబర్ లాటరీని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ముగ్గురు నిర్వాహకులపైన, కొందరు బుకీలపైన బైండోవర్ కేసులను నమోదు చేశాం. వారిపై గట్టి నిఘా కొనసాగుతోంది. గడిచిన రెండు నెలల కాలంలో సింగిల్ నంబర్ లాటరీకి డబ్బు కట్టించుకునే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. గ్రామాల్లో ఎవరైనా సింగిల్ నంబర్ లాటరీని ప్రోత్సహిస్తూ బెట్టింగ్ అమౌంట్ కలెక్ట్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి. నిందితులపై బైండోవర్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటాం.

-ఈశ్వరరావు, సీఐ, చల్లపల్లి

అసెంబ్లీ వాయిస్

మల్లవల్లి పార్క్‌కు రతన్ టాటా పేరు పెట్టాలి



గన్నవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మల్లవల్లి మోడల్ ఇండస్ట్రీయల్ పార్క్‌కు రతన్‌టాటా మోడల్ ఇండస్ట్రీయల్ పార్క్‌గా నామకరణం చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికే తలమానికంగా మల్లవల్లి పారిశ్రామికవాడ మారుతుందన్నారు. ఫేస్-2కు తగిన భూమిని కేటాయించాలని కోరారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో శనివారం ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో పరిశ్రమలకు రూ.4,370 కోట్లకు పైగా విధులు కేటాయించటం పట్ల సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో పారిశ్రామిక వేత్తలకు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో 16.50 లక్షలకు ఎకరం కేటాయిస్తే గత వైసీపీ ప్రభుత్వం రూ.89.50 లక్షలకు పెంచిందని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ తీరు కారణంగా పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ప్రముఖ దిగ్గజ కంపెనీ అయిన అశోక్ లేల్యాండ్ కంపెనీ ప్రారంభానికి సిద్ధంగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వ తీరు వలన వెనక్కి వెళ్లిందని తెలిపారు. పారిశ్రామికవాడ సెకండ్ ఫేజ్ కోసం జిల్లా అధికారులతో సంప్రదించి తగిన భూమిని గుర్తించాలని కోరారు. రానున్న రోజుల్లో మరిన్ని పరిశ్రమలు మల్లవల్లికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. తాను నియోజకవర్గంలో 15వేల ఉద్యోగాలు కల్పించలేకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటు అడగనని చెప్పానని పేర్కొన్నారు. పారిశ్రామికవాడ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని, తగిన భూమిని కేటాయించాలని సీఎం చంద్రబాబును, సంబంధిత మంత్రిని ఎమ్మెల్యే యార్లగడ్డ కోరారు.

అధికారుల నిర్లక్ష్యం కుందేరు వాసులకు శాపం



కంకిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కుందేరు గ్రామ ప్రజల పాలిట శాపంగా మారిందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 - 19 మధ్యలో కంకిపాడు మండలంలోని కుందేరు గ్రామంలో రైవస్ కాలువపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. సుమారు 70 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం వల్ల వంతెన అప్రోజ్ రోడ్డులో ప్రైవేటు ల్యాండ్ ఉండటంతో స్థల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. దీంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. తమ ద్వారా అర్‌అండ్‌బీ మంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్తున్నానని స్పీకర్ అయ్యన్న పాత్రుడుకు తెలియజేశారు. ఐదారు గ్రామాల ప్రజలకు రాకపోకలు సాగించేందుకు ఈ వంతెన ప్రధాన మార్గమన్నారు. తక్షణం బ్రిడ్జి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

టిడ్కో గృహాల అభివృద్ధికి నిధులు కేటాయించండి



గుడివాడ, నవంబరు16 (ఆంధ్రజ్యోతి) : గుడివాడలో టిడ్కో కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అసెంబ్లీలో కోరారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు వెనిగండ్లకు మాట్లాడే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధికంగా టీడీపీ ప్రభుత్వ హయాంలో 8,912 టిడ్కో గృహాల నిర్మాణ పనులు 80శాతం మేర పూర్తైయ్యాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మిగిలిన 20శాతం పనులను పూర్తి చేయడంలో విఫలమైందన్నారు. కనీసం మౌలిక వసతులను కల్పించకుండా హడావుడిగా లబ్దిదారులకు ఇళ్లను కేటాయించారని, దీంతో టిడ్కోకాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లబ్ధిదారుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలని, అదే విధంగా కాలనీలో అవసరమైన కార్యాలయాలు, విద్యాలయాలు, వైద్యశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల కోరారు.

ముంపు పొలాల్లో ఇసుక మేట తొలగించాలి



జగ్గయ్యపేట, నవంబరు 16: గత సెప్టెంబరులో వచ్చిన వరదలకు పొలాల్లో పేరుకుపోయిన ఇసుక మేట తొలగింపును జాతీయ ఉపాధి హామీ పథకంలో చేర్చి రైతులకు తోడుగా నిలవాలని శాసనసభలో శనివారం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోరారు. రైతులు ఇసుక, మట్టిని తొలగించుకోవటం వ్యయప్రయాసలతో కూడుకుందని, రైతులు అవి చేయించుకోలేక సాగు మానేస్తున్నారని తాతయ్య ప్రభుత్వ దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు టిడ్కో ఇళ్లను నిర్లక్ష్యం చేయటం వల్ల లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హడ్కో ద్వారా అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. తదుపరి వారి నుంచి రికవరీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

కట్టలేరు వంతెనపై బ్రిడ్జి నిర్మించాలి



తిరువూరు, నవంబరు 16:(ఆంధ్రజ్యోతి): గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం అవశ్యకతపై శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రస్తావించారు. వినగడప వద్ద సుమారు ఆరు సంవత్సరాల క్రితం బ్రిడ్జి కొట్టుకు పోవడంతో, రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాట్లు వివరించారు. రెండు మండలాలతో పాటుగా, రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు వారధి అని, బ్రిడ్జి కూలీ పోవడంతో రాకపోకలకు తాత్కాలికంగా వేసిన రోడ్డు కొద్దిపాటి వర్షాలకే కొట్టుకుపోతుందన్నారు. రాకపోకలు నిలిచిపోతున్నాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం విస్మరించిందని, ఎన్నికల ముందు ఒక మోసపూరిత శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించి ప్రజల్ని మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వినగడప వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు.

దళిత శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలి



పామర్రు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా శ్మశాన వాటికలు లేక ఇబ్బందులెదుర్కొంటున్న దళితవర్గాలకు అవసరమైన శ్మశాన వాటికలకు స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరారు. దళితులు ఆఖరి మజిలీ కోసం తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంగ్లీషు బోధనలో మెలకువలు అవసరం

కలెక్టర్ డీకే బాలాజీ



టీచర్లకు ఆంగ్లభాష బోధనపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ , నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించేందుకు ఉపాధ్యాయులు బోధనలో మెలకువలు పాటించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. కృష్ణావిశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బ్లాకులో శనివారం జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 400 మంది ఉపాధ్యాయులకు ఆంగ్లభాష బోధనలో మెళకువలపై కలెక్టర్ మూడు గంటల సేపు శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులకు ఉపాధ్యాయుడిగా కలెక్టర్ వ్యవహరించారు. గ్రీన్ బల్లపై వాక్య నిర్మాణ క్రమాన్ని రాస్తూ ఉపాధ్యాయులకు బోధనాభ్యసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంగ్లీషు బాషపై విద్యార్థులు పట్టు సాధించేందుకు వ్యాకరణంతో పాటు భాషా నైపుణ్యాలు నేర్పాలన్నారు. వాక్యాలు, క్రియా రూపాలు, యాక్టివ్ వాయిస్, పాసివ్ వాయిస్‌పై అభ్యాసాలు చేయించాలన్నారు. ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులు ఇంగ్లీషు న్యూస్ పేపర్లు చదవటల్లేదన్నారు. ఇంగ్లీషు న్యూస్ పేపర్లు చదవడం వల్ల సులభమైన వాక్యాలు ఎలా రాయాలో తేలిగ్గా అర్థమవుతుందన్నారు. విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే, తన కుటుంబం, తనకు నచ్చిన వ్యక్తి వంటి అంశాలపై రాయించాలన్నారు. డీఈవో పి.వి.జె. రామారావు, కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ ఎం.వి.బసవేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలాజీని బసవేశ్వరరావు, డీఈవో రామారావు ఘనంగా సత్కరించారు.

ధాన్యం కొనుగోలులో పూర్తి భరోసా

* విజయవాడ డివిజన్ పరిధిలో 45 కేంద్రాలు
* ధాన్యం సేకరణపై రైతులకు పూర్తి అవగాహన
* విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య



-సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కావూరి చైతన్య

కృష్ణలంక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో రైతులకు పూర్తి భరోసా కల్పిస్తున్నట్లు విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య అన్నారు. విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఖరీఫ్ (2024-25) ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాలు, వ్యవసాయం, రెవెన్యూ, మార్కెటింగ్, రవాణా తదితర శాఖల అధికారులతో ఆర్డీవో చైతన్య సమన్వయ సమావేశం శనివారం నిర్వహించారు. పంట కోతలు, ధాన్యం దిగుబడులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సిబ్బందికి శిక్షణ, ధాన్యం రవాణా, మిల్లులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది లేకుండా సేవలందించాలన్నారు. ఒకవేళ ఆర్ఎస్‌కే ద్వారా కాకుండా ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్మాలనుకొంటే రైతులు ఆ వివరాలను ఆర్ఎస్‌కేలో తప్పనిసరిగా నమోదు చేయాలని చెప్పారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు విజయవాడ డివిజన్ పరిధిలో 45 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇబ్రహీంపట్నం మండలంలో ఏడు, విజయవాడ రూరల్‌లో 15, మైలవరంలో 12, జి.కొండూరులో 10, విజయవాడ నార్త్‌లో ఒక కేంద్రం ఉన్నట్లు వివరించారు. ఈ కేంద్రాల్లో సిబ్బందితో పాటు ఎక్విప్‌మెంట్, గోనెసంచులు అన్నీ సిద్ధంగా ఉన్నాయన్నారు. సాధారణ రకం (కామన్) క్వింటాకు రూ.2,300, 75 కిలోలకు రూ.1,725, అదేవిధంగా గ్రేడ్-ఎ రకం క్వింటాకు రూ.2,320, 75 కిలోలకు రూ.1,740 కనీస మద్దతు ధరగా ఉందని వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసిన 48 గంటల్లో రైతు ఖాతాకి సొమ్ము జమ అవుతుందని చెప్పారు. రైతుల సహాయార్థం జిల్లాస్థాయిలో కంట్రోల్ రూం నంబరు (7702003571) అందుబాటులో ఉందని తెలిపారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ తోట వెంకట సతీష్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఎంవీ ఇన్‌స్పెక్టర్ ఆర్.ప్రవీణ్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుకు కృషి

ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ, పీఎన్‌డీటీ) చట్టం పటిష్టంగా అమలయ్యేలా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అల్ట్రాసౌండ్ స్కానింగ్ ప్రక్రియ దుర్వినియోగం కాకుండా నిఘా కొనసాగించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా అధ్యక్షతన లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుపై జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సలహా కమిటీ సమావేశంతో పాటు ఏఆర్‌టీ, సరోగసీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు, ఆపరేషన్లపై సమీక్షించి, కార్యక్రమాలను పటిష్టంగా కొనసాగించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని, వాసవ్య స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి రేష్మి, ఐబీఎఫ్ స్పెషలిస్టు డాక్టర్ పద్మజ, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు గొప్ప మానవతావాది

ఫౌండేషన్ రజతోత్సవ సభలో వక్తలు



ప్రసంగిస్తున్న విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి

ధర్నాచౌక్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : చంద్ర రాజేశ్వరరావు గొప్ప మానవతావాది, దేశ సమైక్యత కోసం నిరంతరం కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. చంద్ర రాజేశ్వరరావు (సీఆర్) ఫౌండేషన్ రజతోత్సవ సభ గాంధీ నగర్‌లోని శ్రీ రామా ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి మాట్లాడుతూ పార్టీలు, సిద్ధాంతాలు వేరైనా అంతా భారతీయులమంటూ దేశ సమైక్యతను తన నడవడిక ద్వారా నిరూపించిన గొప్ప నాయకుడు సీఆర్ అన్నారు. దేశభక్తులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను పాఠ్యాంశాలుగా చేర్చాలని సూచించారు. ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ, సీఆర్ అంతర్జాతీయ విప్లవ ఉద్యమాన్ని గుర్తించిన నేత, వామపక్ష ఉద్యమానికి లెజెంబరీ అని అన్నారు. ఆయన కృషితోనే భూమి సమస్యలు జాతీయ స్థాయి అజెండాగా మారాయన్నారు. సీఆర్ ఫౌండేషన్ సేవలను ఏపీలో కూడా విస్తరిస్తామన్నారు. కమ్యూనిస్టు ప్రభావం లేకుండా సీఆర్ ఫౌండేషన్ పేరుతో చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. మహిళా సాధికారత, గ్రంథాలయం, కళాకేంద్రం ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు ధైర్యంగా నిలబడిన వ్యక్తి సీఆర్ అని అన్నారు. జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సీఆర్ త్యాగాలు, నిడారంబరతను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ, భూస్వామ్య కుటుంబంలో పుట్టి ఉన్నత విద్యను అభ్యసించిన సీఆర్ పేదల కోసం, దేశ సమైక్యత కోసం కృషి చేశారన్నారు. తొలుత సీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ సమరం, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు జల్లి విల్సన్, కంభంపాటి అజయ్, కార్యదర్శి పిడికిడి సంధ్యాకుమారి, పీజే.చంద్రశేఖరరావు, కోశాధికారి చెన్నకేశవరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర చైర్మన్ ప్రమాణ స్వీకారం వాయిదా

- కొమ్మారెడ్డి పట్టాభిరామ్

వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు రామ్మూర్తి నాయుడు అకాల మరణం కారణంగా ఆదివారం తుమ్మలపల్లిలో జరగనున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారం వాయిదా పడినట్లు ఆ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రామ్మూర్తి నాయుడు మరణం పట్ల ఆయన సంతాపం తెలియజేసి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రామ్మూర్తి నాయుడు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. సోమవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్ర పండుగగా శ్రీగురు కనకదాస జయంతి

సీఎం చంద్రబాబుకు బీసీ వర్గాల ధన్యవాదాలు

అమరావతి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న శ్రీగురు కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా అనంతపురంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లా, మండల, పంచాయతీ స్థాయిలోనూ శ్రీ గురు కనదాస జయంతి నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కర్ణాటకలో జన్మించిన కనకదాస.. రాయలసీమలోనూ కులవ్యవస్థ, అసమానతలపై చైతన్యం తీసుకొచ్చిన సామాజిక తత్వవేత్త. తన కీర్తనలు, సాహిత్యంతో సమాజ అసమానతలపై గొంతెత్తిన సాహిత్యకారుడు, సంఘ సంస్కర్త. కాగా, ఇటీవల వాల్మీకి జయంతిని, విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగలుగా నిర్వహించుకోగా.. ఇప్పుడు కనకదాస జయంతిని కూడా ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు బీసీ వర్గాలు ధన్యవాదాలు తెలుపుతున్నాయి.

వరి కోత మిషన్ కింద పడి రైతు మృతి



వెంకటరెడ్డి(ఫైల్)

గంపలగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరి కోత మిషన్ కింద పడి రైతు మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం గంపలగూడెం మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కనుమూరు గ్రామానికి చెందిన చిలుకూరు వెంకట రెడ్డి (65) తన పొలంలో పండిన వరి పంటను వరి కోత మిషన్‌తో కోయిస్తున్నాడు. మిషన్ బురదలో దిగబడటంతో దాన్ని బయటకు తీసేందుకు మిషన్ టైర్ల కింద గడ్డి వేసి బయటకు లాగించే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు మిషన్ కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన వెంకటరెడ్డిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలున్నారు.

నకిలీ బంగారం తనఖా పెట్టి రూ.6.76 లక్షలు స్వాహా

ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో ఖాతాదారులతో ఉద్యోగుల కుమ్మక్కు

విద్యాధరపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాము పని చేస్తున్న సంస్థకే నష్టం కలిగించే విధంగా ఖాతాదారులతో కలిసి కుమ్మక్కైన ఉద్యోగుల వైనం వెలుగులోకి వచ్చింది. భవానీపురంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగులు కొంతమంది బ్యాంకుకు పంగనామాలు పెట్టారు. ఆడిటింగ్‌లో వాస్తవాలు బయటకు రావటంతో ఉద్యోగులు ఖంగుతిన్నారు. చివరికి తాము తప్పుచేసినట్టు అంగీకరించారు. డబ్బు చెల్లిస్తామని చెప్పారు కానీ, ఆ మేరకు అమలు చేయలేదు. ఆ తరువాత కొద్దిరోజులకు ఒక్కొక్కరుగా ఉద్యోగం మానివేశారు. ఇప్పుడు వారు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి. దీంతో బ్యాంకు మేనేజర్ భవానీపురం పోలీస్ స్టేషన్‌లో సంబంధిత ఉద్యోగులపై ఫిర్యాదు చేశారు. భవానీపురం కాంబే రోడ్డులో కెఎల్‌ఎం ఆక్సివా ఫిన్‌వెస్ట్ లిమిటెడ్ కంపెనీ శాఖ ఉంది. దీని ప్రధాన కార్యాలయం కేరళలోని ఎర్నాకుళం. భవానీపురం బ్రాంచిలో గంగిరెడ్డి సుబ్బారెడ్డి, కొక్కిలిగడ్డ హిమబిందు, మానస, రాళ్లబండి శివకుమార్, అప్రైజర్‌గా రాము మౌనిక పనిచేశారు. గత ఏడాది నుంచి గంగిరెడ్డి, కొక్కిలిగడ్డ హిమబిందు, మానస భవానీపురానికి చెందిన ఊటుకూరు అన్నపూర్ణ, కబేళా ప్రాంతానికి జలగం ధనలక్ష్మి, కానూరుకు చెందిన కొల్లి కృష్ణవేణిలతో కలిసి దొంగ బంగారం తనఖా పెట్టి సుమారు ఒక అకౌంట్‌లో రూ.5,66,118 రుణం తీసుకున్నారు. అలాగే రాళ్లబండి శివకుమార్, రాము మౌనిక, వన్‌టౌన్‌కు చెందిన శివకుమార్‌మణి కలిసి నకిలీ బంగారం తనఖా పెట్టి మరో అకౌంట్‌లో లక్షా పది వేల రూపాయలు రుణాలు తీసుకున్నారు. ఈ వ్యవహారం అంతా ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన ఆడిట్ అధికారులు రికార్డులను తనిఖీ చేయగా మోసం బయటపడింది. సంస్థ నిర్వాహకుల ఆదేశాల మేరకు అధికారులు అక్రమాలకు పాల్పడిన వారిని విచారించగా నేరం చేసినట్టు ఒప్పుకొని, తిరిగి సంస్థకు డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కొద్ది నెలల తరువాత గంగిరెడ్డి సుబ్బారెడ్డి, కొక్కిలిగడ్డ హిమబిందు, మానస, రాళ్లబండి శివకుమార్, రాము మౌనికలు ఒక్కొక్కరు ఉద్యోగం మానివేశారు. బ్రాంచి అధికారులు పలుసార్లు వారిని సంస్థకు చెల్లించవలసిన డబ్బులు గురించి అడగ్గా, రేపు, మాపు అంటూ కాలయాపన చేశారు. ఆ తరువాత నుంచి వారు కనిపించకుండా తిరుగుతున్నారు. పై స్థాయి అధికారుల సూచనల మేరకు ప్రస్తుత బ్రాంచ్ మేనేజర్ షేక్ లాల్ సాహెబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులతో పాటు ఖాతాదారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామ్మూర్తినాయుడు కబడ్డీకి మంచి ప్రోత్సాహకుడు : కేపీరావు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ క్రీడ ప్రోత్సాహంలో నారా రామ్మూర్తినాయుడు అందివేసిన చేయిగా నిలిచారని, ఆయన ఆకస్మిక మరణం కబడ్డీ క్రీడాకారులకు తీరని నష్టం అని ఆంధ్రా కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి కేపీ రావు సంతాపం వ్యక్తం చేశారు. రామ్మూర్తినాయుడు అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్‌గా, భారతీయ పురుషుల కబడ్డీ టీమ్ మేనేజర్‌గా 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో బంగారు పతకాన్ని గెలుచుకున్నారన్నారు.

గందరగోళం

(5వ పేజీ తరువాయి)

గడువు పెంచకపోవటం వల్ల తాజా రిజిస్ట్రేషన్ల వల్ల ఓటుహక్కు వస్తుందన్న గ్యారెంటీ లేకుండా పోయింది. ఈనెల 6వ తేదీలోపు మాన్యువల్‌గా ఇచ్చిన వారికే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

గడువు పెంచుతారా?

ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో పట్టభద్రుల ఓటు నమోదుకు మరో పక్షం రోజులు గడువు పెంచాలనే డిమాండ్లు వస్తున్నాయి. అలాగే, పట్టభద్ర ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం ప్రొవిజినల్ సర్టిఫికెట్‌పై గజిటెడ్ అధికారి సంతకాన్ని తప్పనిసరి చేసింది. అది ఒరిజినల్లో కాదో తెలుసుకోవటానికి ధ్రువీకరణ పత్రాల యాక్సెస్‌ను తీసుకుంటే సరిపోతుంది. గజిటెడ్ ఆఫీసర్ల చుట్టూ తిరగడం ఇబ్బందిగా ఉందని కొందరు పేర్కొంటున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మాత్రం తమవద్దే గజిటెడ్ అధికారులను ఏర్పాటు చేసుకున్నాయి.

తప్పిపోయి వచ్చిన 11 గిరి జాతి గోవులు



జి.కొండూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరి జాతికి చెందిన 11 ఆవులు తప్పిపోయి హెచ్.ముత్యాలంపాడు గ్రామానికి వచ్చాయి. వాటిని పోలీసులు గ్రామ పంచాయతీ కార్యదర్శి సంరక్షణలో భద్రంగా ఉంచారు. వాటి యజమానులు ఎవరైనా ఉంటే జి.కొండూరు ఎస్సై నంబరు 9440796448కు లేదా పోలీస్‌స్టేషన్ నంబరు 0866 2802233కి కాల్ చేసి వాటిని తీసుకెళ్ల వచ్చిన పోలీసులు విజ్ఞప్తి చేశారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 565

దుర్గగుడిలో సహస్ర లింగార్చన

వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా శనివారం మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్రలింగార్చన సేవా కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. స్వామికి పుష్పాలు, బిల్వాలతో అలంకరించారు.

దుర్గగుడి కళావేదికపై సత్యకృష్ణ కూచిపూడి కళానిలయం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది.అధికారులు కళాకారులను అభినందించి లడ్డూ ప్రసాదం అందజేశారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరీ సమస్య అయి ఉండాలి.

మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు

9985411602

సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి



వెటర్నరీ కాలనీ సర్వీస్ రోడ్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్ రోడ్డు మధ్యలోకి వచ్చి ప్రమాదకరంగా మారింది. అంతే కాకుండా రోడ్డు మీద చెత్త పేరుకుపోయింది.

-కోనేరు శ్రీధర్ (ద్విచక్ర వాహనదారుడు)

వెటర్నరీ కాలనీ సర్వీస్ రోడ్లో డంపర్ బిన్‌కు చక్రలు విరిగిపోయాయి. జరపడానికి వీలులేక నిలిచిపోయింది. వెంటనే సిబ్బందిని పంపించి పక్కకు జరిపిస్తాను.

-జానకీ రామ్(నాల్గో డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్)



ఫిలింకాలనీ రెండో క్రాస్ రోడ్డులో సూమారు నెల రోజుల నుంచి మున్సిపల్ వాటర్ వృధాగా పోతున్నాయి. -చెన్నుపాటి సత్యనారాయణ ప్రసాద్ (స్థానికుడు)

ఇటీవల మా దృష్టికి వచ్చింది. వెంటనే సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తాను.

-రారాజు (వీఎంసీ వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారి)

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

ఫుట్‌పాత్‌లు.. దళారులకు కాసులు

- ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు
- వ్యాపారుల నుంచి ఇంటి యజమానులు నగదు వసూలు
- వీఎంసీ చర్యలు లేవు





ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తున్న హాకర్లు

(గుణదల, ఆంధ్రజ్యోతి)

కోట్ల రూపాయలు వెచ్చించి పాదచారుల కోసం వీఎంసీ రోడ్డుకిరువైపులా నిర్మించిన ఫుట్‌పాత్‌లను కొందరు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. వీరి వద్ద నుంచి ఆయా ప్రాంత ఇంటి యజమానులు నెలవారీ మామూళ్లు, రోజువారీ మామూళ్లు వసూలు చేస్తున్న వైనం.

కోట్ల రూపాయలు ఖర్చు చేసి నగరంలోని ప్రధాన రహదారుల వెంబడి రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను సుందరీకరణ చేసిన విషయం తెలిసిందే. నగర పాలకసంస్థ గడచిన 6నెలల క్రితం ఏలూరు రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌లను సుందరీకరణ చేసేందుకు కోట్లు ఖర్చు చేశారు. ఫుట్‌పాత్‌లను సుందరీకరణ చేసింది పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడవాలని తద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గాలన్నది ప్రభుత్వ ఆలోచన. ప్రభుత్వ ఆలోచన ఒకటైతే దానికి తూట్లు పొడవడానికి దళారులు బయలు దేరారు.

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే వారిని ఆప్రాంత రౌడీలు గతంలో దౌర్జన్యం చేసి డబ్బులు తీసుకునే వారు. ఇప్పుడు ఇంటి యజమానులే దళారుల అవతారం ఎత్తారనడంలో ఎంతమాత్రం అతిశయోక్తిలేదు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే వారి వద్దనుంచి ఆయా ప్రాంతాల్లోని ఇంటి యజమానులు ఒక్కో హాకర్ నుంచి రోజుకు 150 రూపాయల మొదలు రెండు వందల వరకు వసూలు చేస్తున్నారు. దీని వల్ల హాకర్లు ఎంచక్కా వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అద్దె వసూలు చేస్తుంటారు కనీసం వారికి కరెంటు సౌకర్యం కూడా కల్పించరు. దీంతో వారు లాంతర్లమీద ఆధారపడి వ్యాపారాలు చేసుకుంటారు. హాకర్లు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకోవడం వల్ల పాదచారులు రోడ్లమీద నడవక తప్పని పరిస్థితి. పాదచారులు రోడ్లమీద నడుస్తుండటం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసే వారిపై చర్యలు ఏవీ ?

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసే వారిపై వీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవనే చెప్పాలి. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసేవారి వద్దనుంచి జరిమానా వసూలు చేస్తే కొంతమేరకు నియంత్రించడానికి సాధ్యపడుతుంది. జరిమానాలు లేవు చర్యలు లేవు దీంతో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసే వారు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు.

హాకర్ల నుంచి నగదు వసూలు చేస్తున్న వారి సంగతేంటి !

రోడ్ల వెంబడి తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేసేవారు...ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే వారి వద్ద నుంచి నెలవారీ మామూళ్లు, రోజువారీ మామూళ్లు వసూలు చేసేవారికి వీఎంసీ అధికారులు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కోట్లు ఖర్చు చేసి వీఎంసీ ఫుట్‌పాత్‌లను సుందరీకరణ చేస్తే ఇంటి యజమానులు సొమ్ము చేసుకుంటుంటే అధికారులు చోద్యం చూస్తుండటంలో ఆంతర్యం ఏమిటో అర్థం కాకుండా ఉంది. దళారులకు చెక్ పెట్టి రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

జోనల్ కో-ఆర్డినేటర్ ఎస్కే నజ్మాహెబ్‌తుల్లా



వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న నవజీవన్ బాలభవన్ ప్రతినిధులు

పటమట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల మత్తులో జీవితాలు పాడుచేసుకోవద్దని, నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నీ తోడు మానసిక కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ ఎస్కే నజ్మాహెబ్‌తుల్లా తెలిపారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పటమటలంకలోని వల్లూరి సరోజినీ దేవి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'మాదక ద్రవ్యాలు-ఆరోగ్యంపై ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో 50 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 14 నుంచి 20 వరకు ఉపన్యాసం, చిత్రలేఖనం వ్యాసరచన, పాటలు, నాటిక ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వాడినా, రవాణా చేసినా చట్టం ప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ట్రోల్‌ఫ్రీ నెంబర్ 14500కు ఫోన్ చేసి అక్రమ మద్యం, నాటుసారా, మాదక ద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం పోలీస్ శాఖకు అందించాలని కోరారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం వి. జ్యోతి, ఎం. అనురాధ, విద్యారినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

లయోలాలో కైరోస్- 2కే 24 సదస్సు



జ్యోతి వెలిగిస్తున్న వ్యాపారవేత్త సీలం శ్రీకృష్ణ, ఫాదర్ జోజిరెడ్డి

భారతీనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ కైరోస్- 2కె24 సదస్సు కళాశాల ప్రాంగణంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త సీలం శ్రీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఫాదర్ జోజిరెడ్డి పాల్గొన్నారు. సీలం శ్రీకృష్ణ మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు సమయపాలన, సాంకేతికతపై పట్టు సాధించాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్ మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు తరగతి పాఠాలతో పాటు ప్రాక్టికల్ అనుభవం ఉన్నట్లయితే ఉద్యోగాలలో రాణిస్తారని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి మేనేజ్‌మెంట్ మీట్ కైరోస్ కార్యక్రమం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్,హెచ్‌వోడీ కన్వీనర్ డాక్టర్ ఎం.విజయకుమార్, విభాగాధిపతులు, వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన



చిన్నారులు ప్రదర్శించిన ప్రాజెక్టులు

కృష్ణలంక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంకలోని సుధాకర్స్ ఐడియల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్సు (సైన్స్ ఎగ్జిబిషన్) జరిగింది. ఈ ప్రదర్శనలో మూడు నుంచి ఐదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనను స్కూల్ చైర్మన్ జామి సుధాకరరెడ్డి ప్రారంభించారు. ఈ ప్రదరన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్‌ల వల్ల పిల్లల్లో సృజనాత్మకత పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్ర మంలో స్కూల్ కరస్పాండెంట్ దేవినేని వరలక్ష్మి, ప్రిన్సిపాల్ మారం రామకోటేశ్వరరావు, ఇన్‌చార్జి కనకదుర్గ, 3,4, 5వ తరగతుల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

భక్తికి పరమార్థం సమాజహితం

ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు

వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గాదేవి అనుగ్రహం లభించాలంటే సమాజహితాన్ని కాంక్షించాలని ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం, ఎస్కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నరసింహారావు ప్రవచన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. తొలి రోజైన శనివారం కేబీఎన్ కళాశాలలోని వేదికపై ప్రారంభమైంది. జ్యోతి వెలిగించిన అనంతరం ప్రారంభమైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ విశ్వంలో అమ్మవారి సౌందర్యం మాత్రమే శాశ్వతంగా ఉంటుందని, మిగిలినవన్నీ ఎప్పటికైనా రూపుమాసిపోతాయని చెప్పారు. భక్తికి పరమార్థం సమాజహితమేనని, నిస్వార్థంతో సమాజానికి సేవ చేయటంతోనే దుర్గాదేవి అనుగ్రహం లభిస్తుందని ఆయన వివరించారు. మహాభారత యుద్ధంలో కీలకంగా నిలిచిన అర్జునుడికి శక్తిని ఇచ్చిన తల్లి కనకదుర్గాదేవియేనని గమనించాలన్నారు. కనకదుర్గాదేవి శక్తి వలనే పరమేశ్వరుడు కూడా తన కర్తవ్యాన్ని నిర్వహించగలుగుతున్నాడని తెలిపారు. జగద్గురు ఆదిశంకరాచార్యులు రచించిన కనకదుర్గానంద లహరిలో శ్లోకాలను రాగ, భావ యుక్తంగా ఆయన గానం చేసి ప్రేక్షకుల హర్షధ్వానాలను అందుకున్నారు. దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో కేఎస్ రామరావు, హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు టి. శేషయ్య, కేబీఎన్ కళాశాల కార్యదర్శి పి. శ్రీనివాసులు ఈ సందర్భంగా నరసింహారావును సముచితరీతిన సత్కరించారు.

కార్టూన్ల చిత్రీకరణపై అవగాహన

భవానీపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే ఉన్నతంగా ఎదిగేందుకు ఏదో ఒక రంగాన్ని ఎంచుకోవాలని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ కె.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బాలల వారోత్సవాలు సందర్భంగా శనివారం కబేళా సమీపంలోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహంలో విద్యార్థులకు కార్టూన్ల చిత్రీకరణంపై రిటైర్డు ఉద్యోగి, కార్టూనిస్ట్ బ్రహ్మం(బొమ్మన్) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కొద్ది రోజుల శిక్షణతో మక్కువ పెంచుకుంటే కార్టూన్ వేయడం కూడా సునాయాసంగా ఉంటుందన్నారు.

చిత్రకారుడు జగన్మోహనరావుకు డ్రీమ్ పెయింట్ బ్రష్ అవార్డు



వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): చిత్రకారుడు బొండా జగన్మోహనరావుకు డ్రీమ్ పెయింట్ బ్రష్ అవార్డు లభించింది. సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ ఆర్ట్, ఫొటోగ్రఫీ పోటీల్లో గిరిజన గీత శిల్పిగా పేరొందిన జగన్మోహనరావుకు ప్రతిష్ఠాత్మకమైన అవార్డు లభించింది. శనివారం కొరియర్ ద్వారా అవార్డును అందుకున్న ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల కోల్‌కతాలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరుకాలేకపోయినట్లు తెలిపారు. నాలుగు పోటీల్లోనూ తాను అవార్డులు గెలుచుకున్నట్లు ఆయన తెలిపారు.

బ్రహ్మకైలాసం

రమణీయమైన ఆధ్యాత్మికతకు నెలవైన బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయం

- చుట్టూ వలయంగా పర్వత శ్రేణులు.. మధ్యలో శివలింగాలపురం కొండ
- ఆకర్షిస్తున్న కొండల దిగువన బ్రహ్మయ్యలింగం చెరువు
- ఆధ్యాత్మిక, పర్యాటకానికి రాష్ట్రంలోనే అత్యద్భుతమైన ప్రాంతం
- 5వ శతాబ్దం కంటే ముందునాటి చారిత్రక ఆనవాళ్లు
- పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు అడుగులు





తవ్వకాల్లో బయటపడిన 2వ శతాబ్దపు దేవతా విగ్రహాలు

బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంతం బ్రహ్మ కైలాసంగా ప్రసిద్ధి చెందింది. బ్రహ్మలింగేశ్వరుడు కొలువైన శివలింగాలపురం కొండ చుట్టూ ఒక గుండ్రటి ఆకారంలో చుట్టూ కొండలున్నాయి. ఈ కొండ పైనుంచి ఎటు చూసినా వలయాకారంలో కొండలే కనిపిస్తాయి. తర్వాత ప్రపంచం కనిపించదు. ఏదో ఒక కొత్తలోకంలో ఉన్నట్టుగా కనిపిస్తుంది. మరో గ్రహంలో ఉన్నామా అన్న భ్రాంత కలుగుతుంది. అందుకే దీన్ని బ్రహ్మ కైలాసంగా భావిస్తారు. ఎంతో ఘనమైన చారిత్రక నేపథ్యం ఉన్న ఈ ఆలయం చరిత్రలో మరుగున పడిపోయింది. ఈ పురాతన ఆలయం ఎప్పుడో శిథిలమైంది. శతాబ్దాల పరంపరలో ఎందరో రాజులు ఈ ఆలయాన్ని పునఃప్రతిష్ఠ చేస్తూ వచ్చారు. చివరగా పల్లవరాజైన నాగదేవరాజు పునఃప్రతిష్ఠ చేశారని తెలుస్తోంది. శ్రీకృష్ణ దేవరాయులు సేనాని తన సైన్యంతో వెళ్లేటపుడు దారి తప్పి ఈ ప్రాంతానికి వచ్చారు. దీని గురించి శ్రీకృష్ణదేవరాయలుకు చెప్పడంతో ఆయన కూడా ఇక్కడికి వచ్చారు. పల్లవరాజుల అంతంతో గుడి ఆలనాపాలనా తగ్గింది. కాలక్రమంలో శిథిలమైంది. ఈ ఆలయం వద్దకు వెళ్లటానికి వీల్లేకుండా కొండపై చెట్టు మూసుకుపోయాయి. ఈ దేవస్థానంపై పారంపర్య హక్కులు పొందిన చిక్కవరం గ్రామానికి చెందిన అన్నే లక్ష్మణరావు ధర్మకర్తగా పునర్నిర్మాణానికి పూనుకున్నారు. సొంత డబ్బులు, దాతల సాయంతో శివలింగాలపురం కొండపైనే గ్రానైట్‌తో బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి గుడి నిర్మించారు. అంతకు ముందు ఇదే కొండపై శిథిలాలయంలోని శివలింగాన్ని కిందకు తెచ్చి దేవాలయం కట్టించి అందులో ప్రతిష్ఠించారు. కంచి కామకోటి పీఠం వారు తిరిగి కొండపైనే ప్రతిష్ఠించాలని సూచించటంతో ఈ అద్భుతమైన ఆలయంగా రూపుదిద్దుకుంది.

బ్రహ్మసూత్రం కలిగిన శివలింగం

పురాతన చరిత్ర కలిగిన బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి ఆలయానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ఈ లింగం సాధారణమైనది కాదు బ్రహ్మసూత్ర లింగం ఇది. శివాలయాలు చాలానే ఉంటాయి కానీ బ్రహ్మసూత్ర లింగం అరుదు. బ్రహ్మ, విష్ణు, శక్తితో మూడు అంచెలుగా ఉండే ఈ పీఠంపై బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి కొలువై ఉన్నారు. ఈ ఆలయం 11 అడుగులు ఉంటుందని తెలుస్తోంది. పైకి కనిపించే దాని కంటే 3 రెట్లు భూగర్భంలో ఉంటుంది. బ్రహ్మసూత్రం కలిగిన శివలింగాన్ని సాలగ్రామ రాయితో తయారు చేయటం మరో ప్రత్యేకత.

పర్వత పంక్తుల వలయం మధ్యన శివలింగాలపురం కొండపై 5వ శతాబ్దం కిందటే వెలసిన బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి ఆలయం ఇది! కొండల దిగువున అతిపెద్ద బ్రహ్మయ్యలింగం చెరువుతో అత్యద్భుతమైన ఆధ్యాత్మిక, ప్రకృతి రమణీయతతో ఉట్టిపడే ప్రాంతంగా పేరొందింది. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో దీన్ని అద్భుతమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనుకున్నారు. దీనికి సంబంధించి అడుగులు పడినా నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు కదల్లేదు. ప్రస్తుతం పర్యాటకాభివృద్ధిపై దృష్టి పెట్టిన ప్రభుత్వం బ్రహ్మలింగం క్షేత్రాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దటానికి అద్భుతమైన అవకాశాలున్నాయి. ఆ క్షణం కోసం బ్రహ్మయ్యలింగేశ్వర క్షేత్రం ఎదురుచూస్తోంది.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ









పంచభూతాలు. అష్టదిక్పాలకులు

ప్రాచీన బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి ఆలయాన్ని చేరుకోవాలంటే ఘాట్ మార్గంలో 3 కొండల మీదుగా వాహనాల్లో చేరుకోవాలి. ఈ క్షేతానికి ప్రారంభమయ్యే ప్రధానమార్గం కుడివైపున క్షేత్రపాలకుడిగా వీరభద్రస్వామి ఉంటారు. ముందుగా వీరభద్రస్వామిని దర్శించుకున్న తర్వాతనే బయలుదేరాలి. తర్వాత మొదటి కొండ ఘాట్‌మార్గంలో శక్తి ఆలయం ఉంది. శక్తిని దర్శించుకున్న తర్వాత ముందుకు సాగాలి. ఈ క్షేత్రానికి పంచభూతాలున్నాయి. అష్ట దిక్పాలకులను కూడా ప్రతిష్ఠించారు. కొండపైకి వెళ్లాక ఆలయం చుట్టూ సాక్షి గణపతి, భ్రమరాంబ అమ్మవారు, సత్యనారాయణ స్వామి, సూర్యనారాయణ స్వామి 4 ఉపాలయాలతో పాటు నవగ్రహాలను సందర్శించుకుని అంతిమంగా పంచాయతనే సమేత బ్రహ్మయ్యలింగేశ్వరుడిని దర్శించుకోవాలి.



2వ శతాబ్దపు శాసనాలు

వాహ్.. బ్రహ్మలింగం చెరువు


శతాబ్దాల చరిత్ర గలిగిన బ్రహ్మయ్యలింగం క్షేత్రం పర్యాటకంగా అలరాలటానికి ప్రత్యేక ఆకర్షణలున్నాయి. దాదాపుగా 2500 ఎకరాల విస్తీర్ణం కలిగిన బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి చెరువు ఇక్కడుంది. ప్రస్తుతం ఆక్రమణలు పోను 1200 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువుంది. కొండల దిగువున ఈ చెరువు ఉండటంతో అత్యద్భుతంగా ఉంటుంది. ఈ చెరువులో బోటింగ్ నడిపితే పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుంది. హరిత కొండసాణువులు ఈ ప్రాంతానికి వన్నె తెస్తాయి. బ్రహ్మ కైలాసం నుంచి చూస్తే ఇక్కడే గంటలకొద్దీ గడిపేయాలనిపిస్తోంది.

ఎమ్మెల్యే యార్లగడ్డ సహకారం

ఈ క్షేత్ర అభివృద్ధికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సిద్ధంగా ఉన్నారు. ధర్మకర్తలు ఎమ్మెల్యే యార్లగడ్డను కలిసి అభివృద్ధికి సహకరించమని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో ప్రభుత్వం నుంచి భారీగా నిధులు మంజూరయ్యే పరిస్థితి నెలకొంది. అలాగే పర్యాటకంగా అభివృద్ధి చేయటానికి అవకాశం ఏర్పడబోతోంది. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే ఆ ఘనత యార్లగడ్డకు దక్కుతుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

బ్రహ్మకైలాసానికి ఎలా చేరుకోవాలి ?

ఈ క్షేత్రాన్ని సందర్శించుకోవాలనుకునేవారు ముందుగా గన్నవరం రావాలి. బస్సులు, కార్లలో వచ్చేవారంతా ముందుగా గన్నవరం ప్రధాన సెంటర్‌కు రావాలి. అక్కడి నుంచి ఆగిరిపల్లి - నూజివీడు ప్రధాన రోడ్డు ఉంటుంది. కార్లలో వచ్చేవారు ఈ మార్గంలో స్ట్రెయిట్‌గా వెళ్లాలి. బాహు బాలేంద్రునిగూడెం (బీబీగూడెం) గ్రామం దాటిన తర్వాత గొల్లనపల్లి గ్రామం వస్తుంది. ఈ గ్రామం దాటగానే తోటపల్లి గ్రామ సరిహద్దు ప్రాంతంలో రోడ్డు వెంబడే ఆర్చ్ కనిపిస్తుంది. కార్లు, ఆటోలు నేరుగా బ్రహ్మయ్యలింగం చెరువు వెంబడే వెళుతూ ఘాట్ మార్గం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ ఘాట్ మార్గం మీదుగా 4.6 కిలోమీటర్లు ప్రయాణిస్తే బ్రహ్మ కైలాసాన్ని చేరుకోవచ్చు.



రామ్మూర్తినాయుడు మృతికి ఎంపీ శివనాథ్ సంతాపం

వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు మృతి పట్ల విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సంతాపం ప్రకటించారు. శనివారం రామ్మూర్తినాయుడు మృతి సమాచారం తెలుసుకున్న కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రామ్మూర్తి నాయుడు మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. తన నియోజకవర్గానికి ఆయన ఎనలేని సేవలు చేసినట్టు కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, రామ్మూర్తి నాయుడు మృతి పట్ల టీడీపీ నేత గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేసి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కబడ్డీ అసోసియేషన్ దిగ్భ్రాంతి

విజయవాడ స్పోర్ట్సు: ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మరణం కబడ్డీకి తీరని లోటని ఏపీ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు వెంకటరెడ్డి, యలమంచిలి శ్రీకాంత్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఉన్నత భావాలు కలిగిన మహోన్నత వ్యక్తి రామ్మూర్తినాయుడని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

19న ఎన్టీఆర్ వర్శిటీ చెస్ ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చినవుటుపల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ మహిళా చెస్ ఎంపికలను నిర్వహిస్తున్నట్టు వర్శిటీ స్పోర్ట్సుబోర్డు సెక్రటరీ ఇ.త్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను విశాఖపట్నం గీతం డీమ్డ్ వర్శిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 5 నుంచి జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్శిటీ చెస్ ఉమెన్ టోర్నీకి పంపుతామన్నారు. వర్శిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు, ఫిజికల్ డైరెక్టర్ ఎంపిక జరిగే ప్రాంతంలో ఆ రోజు రిపోర్టు చేయాలన్నారు.





తొండెపు, జీవీకి సన్మానం చేస్తున్న బుద్ధప్రసాద్, ఠాగూర్ గ్రంథాలయంలో మాదకద్రవ్యాల వాడకం నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగవాణి

జాతీయ ఉద్యమంతో అనుబంధం

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

గవర్నర్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీకి, స్వాతంత్ర్య ఉద్యమానికి నగరంలోని రామ్మోహన గ్రంథాలయం అనుబంధంతో ఉందని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎంజీ రోడ్డులోని రామ్మోహన్ గ్రంథాలయంలో వ్యాపారవేత్త, వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తొండపు హనుమంతరావు, పారిశ్రామికవేత్త, రోటరీ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జీవీ రామారావుకు సన్మానం జరిగింది. కమిటీ నిర్వాహకుల సమక్షంలో సన్మాన గ్రహీతలకు బుద్ధప్రసాద్ శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్దకాలంగా రామ్మోహన గ్రంథాలయం భాషా సాంస్కృతిక ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జాతీయ ఉద్యమ కాలంలో గ్రంథాలయ ప్రాంగణం ఒక ఉద్యమ వేదికగా ఉపయోగపడిందన్నారు. గ్రంథాలయ కమిటీ ఛైర్మన్ చింతలపూడి కోటేశ్వరరావు, కార్యదర్శి వేములపల్లి కేశవరావు, ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, సభ్యులు కోట కృష్ణభగవాన్, తంగిరాల రఘురాం, పద్మజ, పి. చిదంబరం, రోటరీ శ్యామ్ ముఠ్వ, డాక్టర్ ఎంసీ దాస్, దత్త సుబ్బారావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి కృషి జరగాలి: ఎక్సైజ్ సీఐ

మాదక ద్రవ్యాల వాడకాన్ని నిరోధించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు తోడ్పాటునందించాలని ఎక్సైజ్ సీఐ టి.నాగవాణి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక పౌర గ్రంథాలయంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయోద్యమానికి విశేష కృషి చేసిన అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరు నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్ గురించి వివరించారు. అమరావతి బోట్ క్లబ్ సీఈవో కాకాని తరుణ్, ప్రముఖ రచయిత గుమ్మా సాంబశివరావులు గ్రంథాలయ ఉద్యమం గురించి ఉపన్యసించారు. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి పర్యవేక్షించారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు

- ధర్నాలో రవీంద్రనాథ్ డిమాండ్
- శాసనసభ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలి



గవర్నర్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆటో కార్మికులు లెనిన్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ఆటో మిత్ర పథకం కింద రూ.15వేలు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చిన నేతలు ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. జరిమానాల పేరుతో కార్మికులపై భారాలు మోపే జీవో 21, 31 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు, వరద సాయం పెంపు కోరుతూ డిసెంబరు 16న ఎమ్మెల్యేల కార్యాలయాల ఎదుట ధర్నాచేసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షుడు దోనేపూడి శంకర్, ఉప ప్రధాన కార్యదర్శి మల్లిఖార్జున్, నగరాధ్యక్షుడు ఎర్ర రాము, ప్రధాన కార్యదర్శి గూడెల జనార్ధన్, సహాయ కార్యదర్శి పెండ్ర సుబ్రమణ్యం, కార్యనిర్వాహక కార్యదర్శి వెంకన్న, ఫెడరేషన్ నేతలు సంగుల పేరయ్య, మంగం శ్రీనివాస్, ఈశ్వర్, ప్రమీల, శివహసన్, చారి, రాజేష్, పచ్చల శ్రీను, నాగేశ్వరరావు, కొండ పాల్గొన్నారు.

నగరంలో స్మార్ట్ రోడ్లు.. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నగరంలో స్మార్ట్ రోడ్ల కోసం నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం డ్రోన్ల ద్వారా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎంసీ పరిధిలోని మూడు సర్కిళ్లలో పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో స్మార్ట్ రోడ్లను ఆయా ప్రాంతాల్లో నిర్మించేందుకు 11 కిలోమీటర్ల రోడ్ సర్వేను డ్రోన్ ద్వారా నిర్వహించామన్నారు. ఈ సర్వేలో రోడ్డుపైనున్న గుంతలు, డివైడర్, పేవర్ బ్లాక్స్, ఫుట్‌పాత్‌లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్‌లు పరిగణనలోకి తీసుకుని రోడ్ సర్వేను చేస్తున్నట్టు తెలిపారు. స్మార్ట్ రోడ్ల ద్వారా కేవలం నాణ్యమైన రోడ్లనే కాకుండా పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా ఆదాయం పెంచే వనరులను కల్పించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. స్మార్ట్ రోడ్లను నిర్మించడమే కాకుండా ఒక ఏడాది పాటు వారి నిర్వహణ బాధ్యత ఏజెన్సీదేనన్నారు. స్మార్ట్ రోడ్లను సర్కిల్-1 పరిధిలో బీఆర్‌పీ రోడ్, కేటీ రోడ్, నెహ్రూ రోడ్, కుమ్మరిపాలెం సెంటర్, సితార సెంటర్లో 7.3 కిలోమీటర్లు, సర్కిల్-2 పరిధిలో బీఆర్‌టీఎస్ రోడ్, సాంబమూర్తి రోడ్, జీఎస్‌రాజు రోడ్, కండ్రిక జంక్షన్‌లో 6.2 కిలోమీటర్లు, సర్కిల్ 3 పరిధిలో హెచ్‌టీ లైన్, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో 4.14 కిలోమీటర్లు మొత్తంగా వీఎంసీ పరిధిలో 17 కిలోమీటర్లు స్మార్ట్ రోడ్లను నిర్మిస్తున్నట్టు తెలిపారు.



మాట్లాడుతున్న డీవోపీ రామకోటేశ్వరరావు

సోషల్ మీడియా మృగాలకు కఠినశిక్షలు పడేలా చేయాలి: డీవోపీ బైరా

విజయవాడ లీగల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు, రాజ్యాంగ పదవిలో ఉన్నవారు, ప్రజాప్రతినిధులపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్న నిందితులపై రాష్ట్రంలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి నిందితులకి కఠిన శిక్షలు పడేలా చూడాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (డీవోపీ) బైరా రామకోటేశ్వరరావు తెలిపారు. శనివారం డీవోపీ కార్యాలయంలో రాష్ట్రంలోని అసిస్టెంట్, అదనపు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో బైరా వర్చువల్‌గా వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలను హేయమైన నేరాలుగా పరిగణించాలని సుప్రీంకోర్టు అనేక కేసుల్లో తీర్పులిచ్చిందన్నారు. ఏడేళ్లలోపు శిక్షలు పడే కేసులైనప్పటికీ పోలీసులు నోటీస్ ఇవ్వకుండా అరెస్టులు చేసే అధికారముందని, అలాంటి కేసులను కోర్టులు రిమాండ్ తప్పనిసరిగా తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పులిచ్చిందని బైరా స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినట్టు నేరం రుజువైతే మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు శిక్ష పడే అవకాశముందని బైరా స్పష్టం చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నిందితుల రిమాండ్ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ దర్యాప్తు అధికారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సహకరించాలని బైరా తెలిపారు. జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ విజయ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



ఇండియా మ్యాప్ ఆకారంలో నిలబడి జానపద నృత్యం చేస్తున్న విద్యార్థులు

జానపదాల్లో దాగి ఉన్న భారతీయ సంస్కృతి

- రైల్వే డీఆర్ఎం నరేంద్ర పాటిల్

గవర్నర్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పే భారతీయ సంస్కృతి జానపద నృత్యాల్లో దాగి ఉందని సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనందరావు పాటిల్ అన్నారు. ఏలూరు రోడ్డు సీతారామపురంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో శనివారం సాయంత్రం విద్యార్థులు నిర్వహించిన జానపద నృత్యం ప్రదర్శన ఆహుతుల్ని కట్టిపడేసింది. చాంపియన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, ఏషియన్ వరల్డ్ రికార్డు సంస్థల ప్రతినిధుల సమక్షంలో భారతదేశం పటం ఆకారంలో 400 మంది విద్యార్థులు 28 రాష్ట్రాలకు సంబంధించిన సంప్రదాయ జానపద నృత్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్నదని, ఎంతో క్రమశిక్షణతో నిర్వహించిన నిర్వాహకుల్ని అభినందించారు. జాయింట్ సెక్రటరీ టు గవర్నర్ జె.సూర్యప్రకాష్, ఐకాన్ విద్యాసంస్థల అధినేత కె. రాజేంద్ర, డైరెక్టర్ యడ్ల పార్థసారథి పాల్గొన్నారు.

క్రిమినల్ మైండ్

(5వ పేజీ తరువాయి)

చేయాలని భావించాడు. ఇలా చేయడం వల్ల పోలీసులు తన వద్దకు రాలేరని భావించాడు. సీసీ కెమెరాల్లో కనిపించిన నిందితుల కోసం వేటాడిన పోలీసులు వారిచ్చిన వాంగ్మూలంతో గౌతంరెడ్డిని ప్రధాన నిందితుడిగా చేర్చారు.

తప్పించుకోవాలనుకుని..

గౌతంరెడ్డి ఒకలా ఆలోచిస్తే విధి మరోలా వ్యవహరించింది. ఉమామహేశ్వరశాస్త్రి ఆయనపై తరచూ పోలీసులకు ఫిర్యాదు చేస్తుండేవాడు. ఆ ఫిర్యాదులను తీసుకున్న పోలీసులు వాటిని పరిశీలించి న్యాయపరమైన కారణాలతో పక్కన పెట్టేవారు. ఎప్పుడూ ఏదో ఒక ఫిర్యాదు చేస్తాడన్న భావన అతడిపై పోలీసులకు ఏర్పడింది. దీన్ని గౌతంరెడ్డి ఓ అవకాశంగా తీసుకున్నాడు. గౌతంరెడ్డి న్యాయవాది అయినా.. ఎన్నడూ కోర్టు మెట్లు ఎక్కలేదు. కొంతమంది జూనియర్లను పెట్టుకుని సెటిల్‌మెంట్ వ్యవహారాలను చక్కబెడుతుండేవాడు. ఉమామహేశ్వరశాస్త్రి వ్యవహారం తలనొప్పిగా మారుతుండటంతో అతడి హత్యకు కుట్ర పన్నాడు. ఆ తర్వాత న్యాయవాదులను పావులకు వాడుకోవాలనుకుని బోర్లా పడ్డాడు.

కారు బీభత్సం.. చిరువ్యాపారి మృతి

అజిత్‌సింగ్‌నగర్‌లో తోపుడు బళ్లు ధ్వంసం

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలోని ఆంధ్రప్రభకాలనీ ప్రధాన రహదారిపై శనివారం కారు బీభత్సం సృష్టించింది. వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి మీదకు దూసుకు రావడంతో రోడ్డు పక్కన చిరు వ్యాపారులు బెంబేలెత్తి పోయారు. ఈ ఘటనలో ఓ చిరు వ్యాపారి అక్కడికక్కడే మృతి చెందాడు. అజిత్ సింగ్‌నగర్ ప్లై ఓవర్ వైపు నుంచి జీ కొండూరు వెళుతున్న ఏపీ16 ఈఎస్ 4979 నెంబరు కారు ఆంధ్రప్రభ కాలనీ ప్రధాన రహదారిపై వెళుతోంది. మార్గమధ్యంలో బొమ్మరిల్లు అపార్టుమెంట్ వద్దకు రాగానే అదుపు తప్పిన కారు మొదట రోడ్డు పక్కనే ఉన్న పానీపూరీ బండిని ఢీకొంది. దీంతో అక్కడి వారంతా భయంతో పరుగులు తీశారు. అనంతరం పక్కనే ఉన్న వేరుశెనక్కాయల బండి మీదుగా దూసుకు వెళ్లి ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగింది. ఈ ఘటనలో రోడ్డు పక్కన శెనక్కాయలు అమ్మే చిరు వ్యాపారి పీకా కోటేశ్వరరావు (49) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కారుతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం.

భూమి మాయం

(5వ పేజీ తరువాయి)

కావడంపై గ్రామస్థులు ఫిర్యాదు చేయగా, అధికారులు సర్వే చేసి 3.82 ఎకరాలే ఉన్నట్టు నివేదిక ఇచ్చారు. ఆలయానికి చెందిన ఎకరా భూమిని లీజుకు తీసుకున్న సీతయ్య ఆ తర్వాత వైసీపీ మద్దతుతో పోటీచేసి సర్పంచ్ అయ్యారు. వైసీపీ నాయకుల అండతో ఆయన ఆ భూమిని కాజేసేందుకు ప్రయత్నించారు. అందులో భాగంగా రికార్డుల్లో నుంచి ఎకరా భూమిని మాయం చేసి, ఆ భూమికి కొత్తగా రికార్డులు సృష్టించే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఈలోగా ఎన్నికలు రావడం, వైసీపీ ఓడిపోయి టీడీపీ ప్రభుత్వం రావడంతో ఆయన ప్రయత్నాలకు చెక్ పడింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే, ఆయన కూడా పార్టీ మార్చేశారు. టీడీపీలో చేరిపోయారు. ఎకరా భూమికి కొత్తగా రికార్డులు సృష్టించే ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు సమాచారం. ఆలయం నుంచి లీజుకు తీసుకున్న ఎకరా భూమిలో ఆయన భారీ షెడ్లు వేసి టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను నిలుపుతున్నారు. ఆ షెడ్ల నుంచి పంచాయతీకి ఎలాంటి పన్నులు చెల్లించడం లేదు.

బాలోత్సవంతో పిల్లల్లో ఆత్మస్థైర్యం

మొగల్రాజపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలోత్సవం లాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పిల్లల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని తమలోని ప్రతిభ గుర్తించడానికి వారికిదో మంచి అవకాశమని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. అమరావతి బాలోత్సవం రెండో రోజు శనివారం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగింది. ఇందులో పాల్గొన్న హేలాపురి బాలోత్సవ్ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు తాము కూడా తమ ప్రాంతంలో త్వరలో బాలోత్సవం నిర్వహిస్తామన్నారు. మానవతా రాష్ట్ర కన్వీనర్ ఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ బాలల ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రెండోరోజు ఆవరణలో ఏర్పాటు చేసిన 61 వేదికలపై 9వేల మంది పిల్లలు వివిధ పోటీలతో పాటు శాస్త్రీయ జానపద, విచిత్ర వేషధారణ అంశాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథులతో పాటు బాలోత్సవ్ గౌరవాధ్యక్షుడు చలువాది మల్లిఖార్జునరావు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. బాలోత్సవ్ అధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి కొండలరావు, వెనిగళ్ల మురళీ మోహన్, తిరువూరు బాలోత్సవ్ కార్యదర్శి అప్పారావు, పిన్నమనేని మురళీకృష్ణ, చెరుకు లక్ష్మీనరసింహారావు, యార్లగడ్డ సుబ్బారావు, విద్యార్థులు, యాజమాన్యాలు పాల్గొన్నాయి.



రిటైర్డ్ ఐఏఎస్ నియామకాన్ని స్వాగతిస్తున్నాం

ఆటోనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాని నియమించడన్ని స్వాగతిస్తున్నామని, ఆయన నియామకం పట్ల సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అమరావతి అదనపు కార్యదర్శి కత్తి రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు రాష్ట్రాల్లో ఇప్పటికే విధాన పరమైన నిర్ణయానికి అనుగుణంగా అమలుకు సిద్ధపడుతున్న నేపథ్యంలో వాటికనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. 60రోజుల్లో రాజ్యాంగ సూత్రాలకు అనుగునంగా 2011 జనాభా లెక్కల ప్రాతిపదకతో సిఫార్సు చేయాలని ఆశిస్తున్నామన్నారు.



మీ నిజస్వరూపమేంటో తెలిసింది

హీరో ధనుష్‌పై నయనతార విమర్శలు



తన పెళ్లి డాక్యుమెంటరీలో పదేళ్లక్రితం నాటి సినిమాకు సంబంధించిన 3 సెకన్ల నిడివి దృశ్యాలను వాడుకునేందుకు రూ.10 కోట్లు అడిగిన తమిళ హీరో ధనుష్‌పై హీరోయిన్ నయనతార నిప్పులు చెరిగారు. మీ నిజస్వరూపమేంటో తెలిసిందంటూ శనివారం ఘాటైన బహిరంగ లేఖ రాశారు. తన డాక్యుమెంటరీలో పదేళ్ల క్రితం నటించిన 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని సన్నివేశాలను వాడుకునేందుకు ఎన్‌వోసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికేట్) కోసం రెండేళ్ల నుంచి ప్రయత్నిస్తున్నామని, దీనికి అనుమతి ఇవ్వకపోగా, టీజర్‌లో మూడు సెకన్ల సన్నివేశాలను వాడుకున్నందుకు రూ.10 కోట్లు చెల్లించాలంటూ ధనుష్ డిమాండ్ చేశారని నయనతార ఆరోపించారు. కాగా, నయనతార జీవిత చరిత్ర ఆధారంగా 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే పేరుతో నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీని రూపొందించగా, ఈ నెల 18 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఇందులో నయనతార జీవిత విశేషాలతో పాటు ఆమె ప్రేమ, పెళ్లి తదితర విషయాలను పొందుపరిచారు. నయనతార ఆమె భర్త సినీ దర్శకుడు విఘ్నేష్ శివన్‌తో కలిసి పనిచేసిన తొలి చిత్రమే 'నానుమ్ రౌడీ దాన్'. ధనుష్ నిర్మాత. ఈ సినిమా చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరూ ప్రేమించుకుని, పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నారు. ఈ డాక్యుమెంటరీలో ఆ సినిమా విశేషాలను చూపించాలని భావించగా, దానికి నిర్మాత ధనుష్ అనుమతి ఇవ్వలేదు.



నయన్‌కు హీరోయిన్ల మద్దతు...

నయనతారకు హీరోయిన్లు పార్వతి నాయర్, ఐశ్వర్యా రాజేష్, ఐశ్వర్య లక్ష్మి, శృతిహాసన్, అనుపమ పరమేశ్వరన్, నస్రియా, గౌరీ కిషన్, గాయత్రి శంకర్, నమిత కృష్ణమూర్తి, అభిరామి తదితరులు సోషల్ మీడియాలో మద్దతు తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా...



ఆది సాయికుమార్ 'ఎస్‌ఐ యుగంధర్' అనే ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. మేఘలేఖ హీరోయిన్. క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా యశ్వంత్ దర్శకత్వంలో ప్రదీప్ జూలూరి నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను సందీప్ కిషన్ క్లాప్ కొట్టి ప్రారంభించగా.. సాయికుమార్ దర్శకనిర్మాతలకు స్క్రిప్టు అందజేశారు. ఈ సందర్భంగా చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఆది సాయికుమార్ ఇందులో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు.


యువతను మెప్పించే చిత్రం



శ్రీ ఇంద్ర, నికిత స్వామి, యుక్త పెర్వి హీరో, హీరోయిన్లుగా నటించిన యాక్షన్ అడ్వెంచర్ సినిమా 'అనాథ'. అన్నాసెట్ కె.ఏ దర్శకుడు. ఈ చిత్రం ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత, హీరో శ్రీ ఇంద్ర మాట్లాడుతూ' ఇది ఒక మంచి కమర్షియల్ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్. చిత్రంలో యూత్‌కి కావాల్సిన అన్ని అంశాలు ఉంటాయి' అని అన్నారు.









స్పోర్ట్స్



తొలి టెస్టుకు గిల్ దూరం!

పెర్త్: ఆస్ట్రేలియాతో తొలి టెస్టుకు ముందే భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ శుబ్‌మన్ గిల్ గాయం కారణంగా పెర్త్ టెస్టుకు దూరం కానున్నాడు. ఇంట్రా స్క్వాడ్ వామప్ రెండో రోజు ఫీల్డింగ్‌లో గిల్ ఎడమ చేతి బొటనవేలికి గాయమైంది. స్కానింగ్‌లో అతడి వేలికి ఫ్రాక్చర్ అయినట్టు తేలింది. దీంతో గిల్‌కు రెండు వారాల విశ్రాంతి అవసరమని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. అయితే డిసెంబరు 6 నుంచి జరిగే రెండో టెస్టులో మాత్రం ఆడే అవకాశం ఉంది. ఇప్పటికే రాహుల్ మోచేతికి గాయమైంది. అలాగే విరాట్ కూడా గాయపడి గురువారమే స్కానింగ్ తీయించుకున్నాడని చెబుతున్నారు.

స్వదేశంలోనే రోహిత్!

ముంబై: ఆస్ట్రేలియాతో తొలి టెస్టుకు కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో ఉండడం లేదు. శుక్రవారం అతడి భార్య రితిక మగ బిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. దీంతో కుటుంబంతో మరికొన్ని రోజులు గడిపేందుకు రోహిత్ భారత్‌లోనే ఉండనున్నట్టు సమాచారం. రోహిత్ అభ్యర్థనను బోర్డు అంగీకరించింది. దీంతో ఈ నెల 22 నుంచి పెర్త్‌లో జరిగే తొలి టెస్టుకు బుమ్రా నాయకత్వం వహించే అవకాశం ఉంది.

మూడో స్థానంలో అర్జున్

కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ 18 రౌండ్ల బ్లిట్జ్ విభాగంలో తొమ్మిది రౌండ్లు ముగిసే సరికి అర్జున్ ఇరిగేసి (5.5) మూడో స్థానంలో నిలిచాడు. శనివారం జరిగిన తొమ్మిది గేముల్లో నాలుగింటిలో గెలిచిన అర్జున్ మరో మూడింటిని డ్రా చేశాడు. రెండు గేముల్లో ఓడాడు. కార్ల్‌సన్ (6.5) అగ్రస్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో తొమ్మిది రౌండ్లు ముగిసే సరికి కోనేరు హంపి (4.5) నాలుగు, ద్రోణవల్లి హారిక (4) ఐదో స్థానంలో కొనసాగుతున్నారు. ఈ విభాగంలో లగ్నో (7) టాప్‌లో ఉంది.

టైసన్‌కు పంచ్



జేక్ చేతిలో ఓటమి

విజేతకు రూ.338 కోట్లు

ఎర్లింగ్టన్ (అమెరికా): మైక్ టైసన్.. బాక్సింగ్ ప్రియులకే కాకుండా ప్రపంచవ్యాప్త క్రీడా ప్రేమికులకు పరిచయం అక్కర్లేని పేరు. కెరీర్ ఉజ్వలంగా సాగిన దశలో అజేయుడిగా పేరుతెచ్చుకున్న ఈ మాజీ హెవీవెయిట్ చాంపియన్.. 58 ఏళ్ల వయస్సులో బరిలో నిలిచి కంగుతిన్నాడు. భారతకాలమాన ప్రకారం శనివారం ఉదయం అమెరికన్ ప్రొఫెషనల్ బాక్సర్, యూట్యూబర్ జేక్ పాల్‌తో జరిగిన పోరులో ఓడిపోయాడు. ముగ్గురు జడ్జిలు 80-72, 79-73, 79-73 పాయింట్లతో ఏకగ్రీవంగా జేక్‌ను విజేతగా ప్రకటించారు. దీంతో జేక్‌కు రూ.338 కోట్ల ప్రైజ్‌మనీ దక్కగా.. ఓడిన టైసన్‌కు రూ.169 కోట్లు అందాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ఫైట్ జూలై 20నే జరగాల్సి ఉన్నా టైసన్ అనారోగ్యం కారణంగా వాయిదా పడింది. ఈ బౌట్ మొత్తం 8 రౌండ్లపాటు జరిగింది. అయితే 2005లోనే ప్రొఫెషనల్ బాక్సింగ్ నుంచి తప్పుకొన్న టైసన్‌లో మునుపటి ఉత్సాహం కనిపించలేదు. అటు 27 ఏళ్ల జేక్ మాత్రం రింగ్‌లో వేగంగా కదులుతూ టైసన్‌పై పంచ్‌ల వర్షం కురిపించాడు. వాస్తవానికి తొలి రెండు రౌండ్లలో మైక్ 10-9 స్కోర్లతో కాస్త ఆధిపత్యం చూపాడు. కానీ ఆ తర్వాత పూర్తిగా గతి తప్పాడు. పాదాల కదలికలోనూ చురుకుదనం లోపించగా.. అసలు అతడి పంచ్‌ల్లో ఎలాంటి పవర్ కనిపించకపోవడం గమనార్హం. మూడో రౌండ్ నుంచి జేక్ పంచ్‌లను కాచుకోవడం టైసన్‌కు కష్టంగా మారింది. దీంతో మిగిలిన ఆరు రౌండ్లను 10-9 స్కోర్లతో జేక్ గెలుచుకుంటూ వెళ్లాడు. ఐదో రౌండ్‌లో ముక్కుపై, 7-8వ రౌండ్లలో తలకు ఇరువైపులా ఇచ్చిన జేక్ పంచ్‌లకు టైసన్ బేలగా కనిపించాడు. అయితే బౌట్ ముగిసిన వెంటనే టైసన్ ముందు తలవంచి జేక్ తన గౌరవాన్ని ప్రకటించాడు. ఓవరాల్‌గా జేక్ 78 పంచ్‌లు విసరగా.. టైసన్ నుంచి కేవలం 18 మాత్రమే వచ్చాయి. ప్రస్తుతం టైసన్ కెరీర్‌లో 50 విజయాలు 7 ఓటములున్నాయి. కాగా ఈ ఫైట్ చూసేందుకు విశ్వవ్యాప్తంగా అభిమానులు ఆసక్తి చూపారు. దీంతో ఒక్కసారిగా రద్దీ పెరగడంతో బౌట్ ప్రసారకర్త అయిన నెట్‌ఫ్లిక్స్ యాప్ బౌట్ ఆరంభానికి ముందు యూఎస్, భారత్‌లో కాసేపు షట్‌డౌన్ అయింది.



బౌట్ ముగిశాక టైసన్‌కు పాల్ అభివాదం

ఎవరీ జేక్ పాల్?

అమెరికాకు చెందిన జేక్ మొదట యూట్యూబర్‌గా సుపరిచితుడు. ప్రాంక్ వీడియోలతోపాటు తన హిప్ హాప్ మ్యూజిక్‌తో ఆదరణ పొందాడు. అలాగే డిస్నీ చానెల్ బిజార్డ్‌వర్క్ సిరీస్‌లోనూ నటించాడు. అనంతరం 2018 నుంచి బాక్సర్‌గా మారాడు. ఇప్పటి వరకు అతను 13 బౌట్లలో 12 నెగ్గాడు. ఇక బౌట్ ముగిశాక విజేతగా నిలిచిన జేక్ ప్రత్యర్థి టైసన్‌ను కొనియాడాడు. 'అతనో దిగ్గజ బాక్సర్. రింగ్‌లో తనతో ఫైట్ చేసినందుకు గర్వంగా ఉంది. అతడిని గాయపరచాలని చూశాను. కానీ తను కూడా నన్ను దెబ్బతీస్తాడేమోనని భయపడ్డా' అని జేక్ చెప్పాడు. మరోవైపు ఇదే తన చివరి బౌట్ అనే ఊహాగానాలను టైసన్ తోసిపుచ్చాడు. పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటానని, ఇప్పుడే ఏమీ చెప్పలేనని తేల్చాడు. బహుశా జేసన్ సోదరుడు లోగన్‌తో ఫైట్ చేస్తానేమోనని చెప్పగా.. తాను టైసన్‌ను చంపేస్తానంటూ లోగన్ పాల్ సరదాగా అన్నాడు.



చైనాకు భారత్ షాక్

● 3-0తో విజయం ● సెమీస్ బెర్త్ ఖరారు

● ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ

రాజ్‌గిర్ (బిహార్): ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో వరుస విజయాలతో జోరుమీదున్న భారత మహిళల హాకీ జట్టు మరో సంచలనం సృష్టించింది. ఒలింపిక్ రజత పతక విజేత చైనాను చిత్తుచేసిన మన అమ్మాయిలు.. వరుసగా నాలుగో విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లారు. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-0తో చైనాను ఓడించింది. నాలుగు మ్యాచ్‌ల నుంచి 8 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా నిలిచింది. సంగీత కుమారి (32వ నిమిషం), కెప్టెన్ సలీమా టెటే (37వ), దీపిక (60వ) గోల్స్ సాధించారు. లీగ్ దశలో ఆదివారం జరిగే ఐదో, ఆఖరి మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ తలపడనుంది. ఆట ఆరంభం నుంచే ఎటాకింగ్ గేమ్‌తో భారత్ విరుచుకుపడడంతో.. చైనా డిఫెన్స్‌కే పరిమితమైంది. తొలి నిమిషంలో భారత్‌కు వరుసగా పెనాల్టీ కార్నర్‌లు లభించినా గోల్స్ మాత్రం చేయలేక పోయింది. తొలి క్వార్టర్‌లో చైనా కూడా పెనాల్టీ కార్నర్ సాధించినా.. భారత్ సమర్థంగా అడ్డుకొంది. ఇక, రెండో క్వార్టర్‌లో మనీషా ఫ్లిక్‌ను చైనా కీపర్ అడ్డుకోవడంతో గోల్ చేసే అవకాశం చేజారింది. దీంతో ఫస్టాఫ్ గోల్ లెస్‌గా ముగిసింది. అయితే, మూడో క్వార్టర్‌లో సమన్వయంగా ముందుకు సాగిన భారత్.. తగిన ఫలితాన్ని సాధించింది. మిగతా మ్యాచ్‌ల్లో జపాన్ 2-1తో మలేసియాను, కొరియా 4-0తో థాయ్‌లాండ్‌ను ఓడించాయి.

కోహ్లీ వారసుడిగా ధండర్ తిలక్



న్యూఢిల్లీ: టీ20 క్రికెట్‌కు విరాట్ రిటైర్మెంట్ ప్రకటించాక ఎంతో కీలకమైన వన్‌డౌన్ స్థానాన్ని భర్తీ చేసేదెవరన్నది పెద్ద ప్రశ్నగా మిగిలింది. టీ20 వరల్డ్‌కప్‌లో రిషభ్ పంత్‌తో ప్రయోగం చేసినా ఆశించినంత ఫలితం దక్కలేదు. గతంలో రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లను మూడో నెంబర్‌లో ఆడించే ప్రయత్నం చేశారు. అయితే, తాజాగా దక్షిణాఫ్రికాతో ముగిసిన టీ20 సిరీస్‌లో ఎడమచేతి వాటం బ్యాటర్ తిలక్ వర్మ రూపంలో అందుకు తగిన సమాధానం లభించింది. నాలుగో నెంబర్‌లో బ్యాటింగ్ చేసే తిలక్.. తనకు అందివచ్చిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. సెంచూరియన్‌లో జరిగిన మూడో టీ20లో తొలిసారి వన్‌డౌన్‌లో దిగిన 22 ఏళ్ల వర్మ శతకంతో దుమ్మురేపాడు. ఆ తర్వాత జొహాన్నెస్‌బర్గ్‌లో జరిగిన నాలుగో మ్యాచ్‌లో వరుసగా రెండో సెంచరీ సాధించాడు. టీమిండియాలో అసాధారణ షాట్లు ఆడే కొద్ది మందిలో సూర్య, పంత్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తాయి. ఇప్పుడు తిలక్ వారి సరసన సగర్వంగా చేరాడు. స్వీప్‌లు ఎలా ఆడగలడో.. రివర్స్ స్వీప్‌లను అదే విధంగా బౌండ్రీ ఆవలకు తరలిస్తున్నాడు. మొత్తంగా డోంట్ కేర్ ఆటతో ప్రత్యర్థుల్లో దడపుట్టించే పవర్‌ప్యాక్ క్రికెటర్‌గా తిలక్ మారాడు. ఇక, రానున్న రోజుల్లో విరాట్ క్లాస్ ఆటను చూసిన స్థానంలో అందుకు భిన్నంగా తిలక్ విధ్వంసకర విన్యాసాలు చూస్తాం.

'ఫ్లయింగ్ కిస్' అందుకే: వర్మ

'వరుసగా రెండో సెంచరీ.. అదీ దక్షిణాఫ్రికా లాంటి పెద్ద జట్టుపై అంటే ఇప్పటికీ నమ్మకం కుదరడం లేదు. వన్‌డౌన్‌లో ఆడే అవకాశం కెప్టెన్ ఇచ్చాడు. దాన్ని ఎంతో ఆస్వాదించా. జట్టు అవసరాలమేరకు ఎక్కడ ఆడమన్నా సిద్ధమే. ఇక, 'ఫ్లయింగ్ కిస్' గురించి అంటారా.. అది దేవుడికి నాదైన కృతజ్ఞతలు..!'

పాకిస్థాన్‌కు ఐసీసీ ఝలక్

చాంపియన్స్ ట్రోఫీ ప్రదర్శన వేదికల నుంచి ఆ నగరాలు అవుట్

దుబాయ్: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) గట్టి షాకిచ్చింది. తమను సంప్రదించకుండా పాకిస్థాన్‌లో చాంపియన్స్ ట్రోఫీని ప్రదర్శించే షెడ్యూల్ ప్రకటించడం..వివాదాస్పద పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని నగరాలను అందులో చేర్చడాన్ని తీవ్రంగా పరిగణించింది. శనివారం విడుదలజేసిన ట్రోఫీ ప్రదర్శన షెడ్యూల్‌నుంచి పీవోకేలోని నాలుగు నగరాలను తొలగించింది. పీసీబీ ప్రకటించిన షెడ్యూల్‌ను ఐసీసీ రద్దు చేసింది. అంతేకాదు తాజా షెడ్యూల్‌ను వెలువరించింది. చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొంటున్న ఎనిమిది జట్ల దేశాలలో ట్రోఫీని ప్రదర్శించనున్నారు. ఈ టోర్నీ ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు జరగాల్సివుంది.

తన్మయ్ చేజారిన శతకం

ఆంధ్ర-హైదరాబాద్ రంజీ డ్రా



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షేక్ రషీద్

హైదరాబాద్: ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (95) త్రుటిలో శతకం కోల్పోయాడు. ఆంధ్రతో ముగిసిన ఈ ఎలీట్ గ్రూప్ 'బి' రంజీ మ్యాచ్‌ను హైదరాబాద్ డ్రా చేసుకుంది. అయితే మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఆంధ్ర జట్టుకు మూడు పాయింట్లు లభించగా..హైదరాబాద్ ఒక పాయింటుతో సరిపెట్టుకుంది. తన్మయ్‌తోపాటు మరో ఓపెనర్ అభిరత్ రెడ్డి (70 నాటౌట్) అర్ధ శతకంతో సత్తా చాటడంతో హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో నాలుగో రోజు ఆట ఆఖరికి వికెట్ నష్టానికి 193 పరుగులు చేసింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు 148 పరుగులు జోడించారు. తన్మయ్‌ను రఫీ అవుట్ చేశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ 448/9తో శనివారం, తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర అదే స్కోరు వద్ద ఆలౌటైంది. ఇక మొదటి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 301 పరుగులు సాధించింది.

తమిళ్ తలైవాస్ చేతిలో బెంగాల్ చిత్తు

నోయిడా: డిఫెండర్లు అద్భుతంగా రాణించిన వేళ ప్రొ.కబడ్డీ లీగ్‌లో తమిళ్ తలైవాస్ ఘన విజయం అందుకుంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 46-31తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది. తలైవాస్ రైడర్ విశాల్ చాహర్ సూపర్ టెన్‌తో అదరగొట్టాడు. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 35-25తో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది.

స్పెన్సర్ 'పాంచ్'

ఆసీస్‌దే టీ20 సిరీస్



సిడ్నీ: పేసర్ స్పెన్సర్ జాన్సన్ (5/26) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో శనివారం పాకిస్థాన్‌తో జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా 13 పరుగులతో నెగ్గింది. దాంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో టీ20 మిగిలుండగానే సొంతం చేసుకుంది. టాపార్డర్‌ను జాన్సన్ కకావికలు చేయడంతో 147 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 19.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. అంతకుముందు ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 147/9 స్కోరు చేసింది. హారీస్ రౌఫ్ (4/22), అబ్బాస్ అఫ్రీది (3/17) రాణించారు.

సింహ భాగం సం'పన్ను'లవే..

పెరిగిన పెద్దోళ్ల పన్ను చెల్లింపుల వాటా

అర కోటికి పైగా ఆర్జిస్తున్న వారి నుంచే 76 శాతం ఆదాయ పన్ను వసూళ్లు

మధ్యతరగతిపై తగ్గిన ఐటీ భారం!!

- రూ.10 లక్షల వరకు వార్షికాదాయ వర్గం వాటా 10.17% నుంచి 6.22 శాతానికి..



న్యూఢిల్లీ: గత దశాబ్ద కాలంలో ఆదాయ పన్ను రిటర్నులు (ఐటీఆర్) సమర్పించే వారి సంఖ్య 120 శాతం పెరిగింది. 2014లో 3.6 కోట్ల మంది ఐటీఆర్‌లు దాఖలు చేయగా.. 2024లో ఈ సంఖ్య 7.9 కోట్లకు పెరిగింది. పన్ను చెల్లింపుదారులతో పాటు భారత ప్రభుత్వానికి సమకూరే పన్ను ఆదాయమూ పుంజుకుంది. అయితే, ఈ పదేళ్లలో రూ.20 లక్షల లోపు వార్షికాదాయం కలిగిన మధ్య తరగతి వర్గంపై ఐటీ చెల్లింపుల భారం మాత్రం గణనీయంగా తగ్గిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. సర్కారుకు సమకూరే ఆదాయం పన్నులో 76 శాతం రూ.50 లక్షలకు పైగా వార్షికాదాయం కలిగిన వారు చెల్లిస్తున్నదేనని ఆ వర్గాలు తెలిపాయి. కాగా, రూ.10 లక్షల వరకు వార్షికాదాయం కలిగిన వారి పన్ను చెల్లింపుల వాటా 2013-24 ఆర్థిక సంవత్సరంలో 10.17 శాతంగా ఉండగా.. 2023 -24లో పదేళ్ల కనిష్ఠ స్థాయి 6.22 శాతానికి తగ్గిందని పేర్కొన్నాయి.

ఐదింతలు పెరిగిన బడా బాబుల రిటర్నులు: ఐటీఆర్ ఫైలింగ్ డేటా ప్రకారం.. రూ.50 లక్షలు, అంతకు పైగా వార్షికాదాయం కలిగిన పన్ను చెల్లింపుదారులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 9.4 లక్షలు దాటారు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 1.9 లక్షల మందితో పోలిస్తే వీరి సంఖ్య ఐదింతలైంది. అంతేకాదు, 2013-14లో వారు చెల్లించిన మొత్తం పన్ను రూ.2.5 లక్షల కోట్లుగా ఉండగా.. 2023-24 నాటికి 3.2 రెట్ల వృద్ధితో రూ.9.6 లక్షల కోట్లకు పెరిగింది.

4.9 కోట్లకు జీరో ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్‌లు: 2014లో రూ.2.5 లక్షలు, అంతకు మించిన వార్షికాదాయం కలిగిన వారంతా ఆదాయం పన్ను చెల్లించాల్సి వచ్చేది. గడిచిన దశాబ్ద కాలంలో ప్రభుత్వం కల్పించిన పలు మినహాయింపులు, తగ్గింపులతో ప్రస్తుతం రూ.7 లక్షల వరకు వార్షిక ఆదాయం ఆర్జిస్తున్న వారూ పన్ను చెల్లించాల్సిన అవసరం తప్పింది. దాంతో జీరో ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్‌లు 2013-14లో 1.8 కోట్ల స్థాయిలో ఉండగా.. 2023-24లో 4.9 కోట్లకు పెరిగాయి.

మధ్యతరగతిపై పన్ను భారం తగ్గిందిలా..: పదేళ్ల క్రితం (2013-14కు ముందు) రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షల స్థాయి ఆదాయం కలిగిన వారు సుమారు రూ.20,000 వరకు పన్ను చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం పన్ను నుంచి పూర్తి మినహాయింపు లభిస్తోంది. 2023-24లో రూ.7-10 లక్షల వార్షికాదాయం కలిగిన వారు సగటున రూ.43,000 పన్ను చెల్లించాల్సి వచ్చింది. ఈ విభాగ పన్ను రిటర్నుల సంఖ్య 2.2 కోట్లుగా ఉంది. ఈ విభాగ పన్ను చెల్లింపుదారులపై పన్ను భారం వారి ఆదాయంలో కేవలం 4-5 శాతంగా ఉందని, వర్ధమాన దేశాలన్నింటిలోకెల్లా ఇదే అత్యల్పం. గడిచిన పదేళ్లలో ధరల పెరుగుదల (ద్రవ్యోల్బణం) ప్రభావాన్నీ పరిగణనలోకి తీసుకుంటే, రూ.10-15 లక్షల ఆదాయం కలిగిన వారిపై పన్ను భారం 60 శాతం తగ్గిందని, రూ.10-20 లక్షల ఆదాయ వ్యక్తులపై భారం 40 శాతం వరకు తగ్గింది. రూ.20 లక్షల లోపు ఆదాయం కలిగిన మధ్యతరగతిపై పన్ను భారం గణనీయంగా తగ్గిందనడానికిదే నిదర్శనమని తెలిపాయి.

బిజినెస్

మిల్లెట్స్ వ్యాపారంలోకి రామోజీ గ్రూప్

సబల బ్రాండ్‌తో మార్కెట్లోకి ఉత్పత్తులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రామోజీ గ్రూప్.. మిల్లెట్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. సబల మిల్లెట్స్ బ్రాండ్ పేరుతో 45 రకాలైన విల్లెట్స్ (తృణ ధాన్యాలు) ఉత్పత్తులను తీసుకువచ్చింది. శనివారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో ఈ ఉత్పత్తులను సబల మిల్లెట్స్ డైరెక్టర్ సహరి చెరుకూరి మార్కెట్లోకి విడుదల చేశారు. రామోజీ గ్రూప్ వ్యవస్థాపకుడు రామోజీ రావు జయంతి సందర్భంగా ఈ ఉత్పత్తులను తీసుకువచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఆహారోత్పత్తుల్లో మిల్లెట్ కుకీస్, హెల్త్ బార్స్, మంచ్, నూడుల్స్ సహా వివిధ రాష్ట్రాలకు తగ్గట్టుగా కిచిడీ తయారీ పదార్థాలు, ఇన్‌స్టంట్ మిక్సెస్ తదితర ఉత్పత్తులు ఉన్నాయన్నారు. మారుతున్న జీవన శైలికి అనుగుణంగా ఈ ఆహార ఉత్పత్తులను తీసుకువచ్చినట్లు ఆమె చెప్పారు. ఈ ఉత్పత్తుల ధరల శ్రేణి రూ.75 నుంచి ప్రారంభమవుతున్నాయన్నారు. ప్రస్తుతం సబల మిల్లెట్స్ వెబ్‌సైట్ ద్వారా ఈ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. రానున్న నెలల్లో ఇతర ఈ-కామర్స్ పోర్టల్స్‌లో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆమె చెప్పారు. కాగా రానున్న మూడు నెలల్లో మరో 55 ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నట్లు సహరి తెలిపారు.

● సింగపూర్‌కు చెందిన జీ3 ఎన్విరాన్‌మెంటల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను కొనుగోలు చేసినట్లు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న రీ సస్టేనబిలిటీ లిమిటెడ్ వెల్లడించింది. అనుబంధ సంస్థ రీ సస్టేనబిలిటీ ఇంటర్నేషనల్ (సింగపూర్) ద్వారా ఈ కొనుగోలును చేపట్టినట్లు తెలిపింది. అయితే డీల్ విలువ ఎంతనేది మాత్రం వెల్లడించలేదు.

వన్నె తగ్గుతున్న పసిడి



మున్ముందు మరింత తగ్గే అవకాశం.. వెడ్డింగ్ సీజన్‌కు బంపర్ ఆఫర్లు

స్టాక్ మార్కెట్టే కాదు. బులియన్ మార్కెట్ కూడా ప్రస్తుతం దిద్దుబాటు (కరెక్షన్)లో ఉంది. గత నెల రేసుగుర్రంలా పరుగెత్తిన పసిడి ధర.. ప్రస్తుతం నేలచూపులు చూస్తోంది. హైదరాబాద్ మార్కెట్లో గత నెల 30న 10 గ్రాముల మేలిమి (24 క్యారట్స్) బంగారం రికార్డు స్థాయిలో రూ.81,800 పలికింది. దాంతో డిసెంబరు నాటికి 10 గ్రాముల పుత్తడి ధర రూ.లక్షకు చేరుతుందనే అంచనాలు వినిపించాయి. అయితే అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలతో సీన్ మారిపోయింది. ప్రస్తుతం 10 గ్రాముల మేలిమి బంగారం రూ.75,650కు దిగొచ్చింది. కేవలం 17 రోజుల్లోనే 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.6,150 తగ్గడం విశేషం.

పెళ్లిళ్ల సీజన్‌కు ఊరట: అక్టోబరులో జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరిన పసిడి ధర చూసి చాలా మంది బంగారం కొనే ఆలోచన పక్కన పెట్టారు. దీంతో ఈ సంవత్సరం ధనత్రయోదశి కూడా బులియన్ మార్కెట్‌కు పెద్దగా కలిసి రాలేదు. పెళ్లిళ్ల సీజన్‌లో పసిడి ధర తగ్గుముఖం పట్టడంతో కొనుగోళ్లు మళ్లీ ఊపందుకున్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ధర తగ్గడంతో మెట్రో నగరాలతో పాటు చిన్న చిన్న నగరాలు, పట్టణాల్లోని నగల దుకాణాలకూ ప్రస్తుతం రద్దీ పెరిగింది. మరోవైపు పసిడి ధర తగ్గడంతో పెళ్లిళ్ల కోసం చేసే నగల బడ్జెట్ తగ్గిందని వధూవరుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నగల వ్యాపారులూ కొనుగోలుదార్లను ఆకర్షించేందుకు ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటిస్తున్నారు.

మరింత పతనం !

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికవడంతో బులియన్ మార్కెట్ సీన్ మారిపోయింది. అక్టోబరులో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం రికార్డు స్థాయిలో 2,790 డాలర్లు (సుమారు రూ.2.35 లక్షలు) పలికింది. ప్రస్తుతం 2,570 డాలర్లకు దిగొచ్చింది. గత 15 రోజుల్లోనే ఔన్స్ పసిడి ధర 220 డాలర్లు (సుమారు రూ.18,581) పడిపోవడం విశేషం. డిసెంబరు నాటికి ఔన్స్ పసిడి ధర మరో 60 డాలర్ల మేరకు దిగొచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. దీంతో పెళ్లిళ్ల కోసం పసిడి కొనాలనుకునే వారు మరికొద్ది రోజులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు.

కలిసి రానున్న అంశాలు

టెక్నికల్‌గా చూసినా స్వల్ప, మధ్య కాలానికి పసిడి మార్కెట్ భవిష్యత్ బేరిష్‌గానే కనిపిస్తోంది. ఇందుకు ఈ అంశాలు దోహదం చేయనున్నాయి.

- అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్ ఆర్థిక విధానాలు
- ప్రధాన కరెన్సీలతో బలపడుతున్న డాలర్ మారకం రేటు
- అమెరికాతో సహా ప్రధాన దేశాల్లో తగ్గుతున్న వడ్డీ రేటు

దీర్ఘకాలానికి ఓకే..

బులియన్ మార్కెట్ ప్రస్తుతం బేరిష్‌గా కనిపిస్తున్నా.. దీర్ఘకాలిక పెట్టుబడులకు మాత్రం ఇదే సరైన సమయమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పరిస్థితులు విషమిస్తే ఔన్స్ బంగారం 2025లో 3,000 డాలర్లని కూడా తాకే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,650 ▼	69,350 ▼	99,000 ▼
ముంబై	73,739 ▼	67,545 ▼	87,103 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	565
వరంగల్	542	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	545
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	90	విజయవాడ	109
వరంగల్	90	గుంటూరు	103
కరీంనగర్	90	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	97
కర్నూలు	90	నెల్లూరు	97
విశాఖపట్నం	103	అనంతపురం	97
గోదావరి	109		

ఇదీ GST: సెల్ఫ్ ఇన్వాయిస్ అంటే..?



రాంబాబు గొండాల

జీఎస్‌టీలో రిజిస్ట్రేషన్ పొందిన వ్యక్తులకు రివర్స్ చార్జ్ మెకానిజం గురించి అవగాహన ఉండే ఉంటుంది. సాధారణంగా వస్తువులు అమ్మే వ్యక్తులు లేదా సేవలు అందించే వ్యక్తులు తాము పొందే మొత్తాల మీద పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అంటే తాము సరఫరా చేసే వస్తువులు లేదా సేవలకు సంబంధించిన విలువ మీద పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే వస్తువులు లేదా సేవల విలువ డబ్బు రూపంలోనే ఉండాలని లేదు. ఉదాహరణకు ఒక నగల వ్యాపారి తాను అమ్మిన నగకు ఎక్స్ఛేంజ్ కింద పాత నగ తీసుకుని మిగిలింది డబ్బు రూపంలో తీసుకోవచ్చు. కార్లు అమ్మే దుకాణాలు కూడా ఇదే పద్ధతి పాటిస్తాయి. ఇలాంటప్పుడు ఈ అమ్మకందారులు కేవలం తాను పొందిన డబ్బు మీదనే పన్ను చెల్లిస్తే సరిపోదు. ప్రతిగా తాము పొందిన పాత నగలు లేదా కారు విలువను కూడా పరిగణనలోనికి తీసుకుని మొత్తం విలువ మీద పన్ను చెల్లించాలి. అందుకే పన్ను అనేది డబ్బు మీద కాకుండా సరఫరా జరిగిన వస్తు లేదా సేవల విలువ మీద కట్టాలి. దీనినే జీఎస్‌టీ పరిభాషలో 'కన్సిడరేషన్' అంటారు. సులభంగా చెప్పాలంటే కన్సిడరేషన్ పొందే వ్యక్తులు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వీరు సరఫరా విలువతో పాటు చెల్లించవలసిన పన్నును కూడా జత చేస్తూ ఇన్వాయిస్ జారీ చేస్తారు.

ఇక రివర్స్ చార్జ్ మెకానిజం విషయానికి వస్తే కన్సిడరేషన్ పొందే వ్యక్తి కాకుండా.. చెల్లించే వ్యక్తి అంటే సరఫరా చేసే వ్యక్తి కాకుండా సరఫరా పొందే వ్యక్తి పన్ను చెల్లించాలి. అయితే ఇవి అన్ని సరఫరాలకు వర్తించవు. ఉదాహరణకు అడ్వకేట్, కంపెనీ డైరెక్టర్, మ్యూజిక్ కంపోజర్, బ్యాంక్ రికవరీ ఏజెంట్, ఇన్సూరెన్స్ ఏజెంట్స్ సేవలకు గాను సేవలు పొందే సంస్థలు లేదా వ్యక్తులు. ఉదాహరణకు డైరెక్టర్‌కు చెందిన కంపెనీ, ఇన్సూరెన్స్ సంస్థ లేదా సంబంధిత బ్యాంకులే తాము చెల్లించే మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాలి. అయితే రివర్స్ చార్జ్ మెకానిజం అమలు కావటమనేది సూచించిన వస్తు సేవలకే కాకుండా అవి అందించే, పొందే వ్యక్తుల మీద కూడా ఆధారపడి ఉంది. కొన్ని సేవలకు, అందించే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ ఉన్నా, లేకున్నా రివర్స్ చార్జ్ మెకానిజం అమలు అవుతుండగా, కొన్నిటికి సేవలందించే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ లేని సందర్భంలో మాత్రమే రివర్స్ చార్జ్ మెకానిజం అమలవుతుంది. ఉదాహరణకు పైన సూచించిన సేవలు అన్నిటికీ సేవలందించే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ ఉన్నా, లేకున్నా రివర్స్ చార్జ్ మెకానిజం వర్తిస్తుంది. అయితే, వాణిజ్య అవసరాలకు భవనాలు అద్దెకు ఇచ్చే సందర్భంలో భవన యజమానికి రిజిస్ట్రేషన్ లేనప్పుడు మాత్రమే రివర్స్ చార్జ్ మెకానిజం వర్తిస్తుంది. అంటే అలాంటి సందర్భంలో మాత్రమే ఆ బిల్డింగ్‌ను అద్దెకు తీసుకున్న సంస్థలు లేదా వ్యక్తులు తాము చెల్లించే అద్దె మీద జీఎస్‌టీ చెల్లిస్తారు. ఒక వేళ భవన యజమానికి రిజిస్ట్రేషన్ ఉంటే సంబంధిత పన్నును బిల్డింగ్ ఓనరే చెల్లించాలి. అప్పుడు రివర్స్ చార్జ్ మెకానిజం వర్తించదు.

మరి రివర్స్ చార్జ్ మెకానిజం వర్తించే కేసుల్లో ఇన్వాయిస్ ఎవరు జారీ చేయాలి? ఆయా సేవలు అందించే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ ఉంటే, వారే ఇన్వాయిస్‌ను జారీ చేయాలి. అయితే వీరు జీఎస్‌టీ చెల్లించే అవసరం లేదు. కాబట్టి జీఎస్‌టీ వివరాలు వేయకుండా కేవలం సరఫరా వివరాలు, దాని విలువను చూపాలి. మరి అదే సరఫరాదారుడికి రిజిస్ట్రేషన్ లేకుంటే? అప్పుడు సరఫరా పొందిన వ్యక్తే స్వయంగా ఒక ఇన్వాయిస్ జారీ చేసుకోవాలి. దీన్నే సెల్ఫ్ ఇన్వాయిస్ అంటారు. నవంబరు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త విధానం ప్రకారం సెల్ఫ్ ఇన్వాయిస్ అనేది వస్తువులు లేదా సేవలు పొందిన తేదీ నుంచి 30 రోజుల లోపు కచ్చితంగా జారీ చేయాలి. ఈ సెల్ఫ్ ఇన్వాయిస్ సిస్టమ్ ఇంతకు ముందే ఉన్నప్పటికీ గడువు అనేది చెప్పలేదు. ఇప్పుడు కొత్త నిబంధనల ప్రకారం సెల్ఫ్ ఇన్వాయిస్ జారీ చేయటానికి గడువు ఇవ్వటంతో పాటుగా పన్ను చెల్లించటానికి గడువు నిర్ధారించే 'టైమ్ ఆఫ్ సప్లయ్' నిబంధనల్లో కూడా మార్పు చేయటం జరిగింది. కాబట్టి రివర్స్ చార్జ్ మెకానిజం వర్తిస్తూ రిజిస్ట్రేషన్ లేని వ్యక్తుల నుంచి సరఫరా పొందే ప్రతి ఒక్కరూ ఈ సెల్ఫ్ ఇన్వాయిస్ విధానాన్ని విధిగా పాటించాలి

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



మనకున్న అచ్చమైన తెలుగు దర్శకులు అతి కొద్ది మందే! వారిలో **ఇంద్రగంటి మోహనకృష్ణ** ఒకరు. 'అష్టాచెమ్మా', 'సమ్మోహనం', 'వి' లాంటి హిట్ చిత్రాలకు మోహనకృష్ణ దర్శకత్వం వహించారు. ఆయన రూపొందించిన 'సారంగపాణి జాతకం' సినిమా త్వరలో విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

దైవాంశసంభూతుడు

చాలాకాలం తర్వాత మళ్లీ హాస్య సినిమాతో ముందుకు వస్తున్నారు... కారణమేమిటి?

నా దృష్టిలో పూర్తి హాస్యం పండించే సినిమాను తీయటం చాలా కష్టం. చాలామంది హాస్యం పండించటం సులభమనుకుంటారు. కానీ కమల్‌హాసన్‌గారు అన్నట్లు- 'కామెడీ ఈజ్ సీరియస్ బిజినెస్'. నేను నా కెరీర్‌లో మొత్తం 12 సినిమాలు చేశాను. దానిలో 'అష్టాచెమ్మా' 'అమీతుమీ... ఈ రెండూ పూర్తి హాస్య రస ప్రధానమైనవి. ఇవి తీసి చాలాకాలం అయిపోయింది కాబట్టి- ఏదైనా ఒక హాస్యరస ప్రధాన సినిమా తీయాలని అనుకున్నా. 'సారంగపాణి జాతకం' కథ ఎంతోకాలంగా నా మనస్సులో నలుగుతోంది. ఈ మధ్య నేను దర్శకత్వం వహించిన 'ఆ అమ్మాయి గురించి చెప్పాలి' అనేది సీరియస్ డ్రామా. అది పెద్దగా ఆడలేదు. ఆ తర్వాత ఏం చేయాలని ఆలోచిస్తున్నప్పుడు ఈ కథ బయటకు వచ్చింది. దీనితో పాటు- 'శ్రీదేవి మూవీస్' కృష్ణప్రసాద్ గారు కూడా- "మనం 'సమ్మోహనం' తర్వాత కలిసి పని చేయలేదు. ఏదైనా చేద్దాం" అని కొద్ది కాలంగా అంటున్నారు. 'సారంగపాణి జాతకం' కథ చెబితే ఆయనకు వెంటనే నచ్చేసింది. ఇలా ఈ సినిమా మొదలైంది.

ఈ మధ్యకాలంలో పూర్తి హాస్యరస ప్రధాన సినిమాలు రావటం లేదు.. కారణమేమిటి?

ఒకప్పుడు హాస్యరస ప్రధాన సినిమాలను ప్రేక్షకులు ఎక్కువగా ఆదరించేవారు. జంధ్యాల, రేలంగి నరసింహారావు, ఈవీవీ సత్యనారాయణ- ఇలా అనేకమందికి హాస్య దర్శకులుగా ముద్ర ఉండేది. కానీ క్రమేణ యాక్షన్ సినిమాల జోరు పెరిగింది. థియేటర్‌కు వెళ్లి సినిమా చూడాలంటే అది రూ. 500 కోట్ల సినిమా అయి ఉండాలని కూడా కొందరు ప్రేక్షకులు భావిస్తున్నారు. దీనితో హాస్య సినిమాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. అయితే మరో వైపు మన జీవితాల్లో హాస్యం తగ్గిపోలేదు. రీల్స్, మీమ్స్, ట్రోల్స్‌ను కోట్ల మంది చూస్తున్నారు. ఆస్వాదిస్తున్నారు. అంటే ప్రేక్షకుల జీవితాల్లో హాస్యానికి ప్రాధాన్యత ఉన్నట్లే కదా!

నేటితరం ప్రేక్షకులకు నిజమైన హాస్యం తెలియదా?

ఈ ప్రశ్నకు అనేక కోణాలున్నాయి. ఒకప్పుడు సాహితీ పోకడలున్న హాస్యాన్ని ఆస్వాదించేవారు. ముళ్లపూడి, జంధ్యాల లాంటి వారి సినిమాలు అందుకే హిట్ అయ్యాయి. వీరు మన జీవితంలోని అనేక అసందర్భాలను తీసుకొని.. వాటిని హాస్యంగా మలచేవారు. ఊరి పేర్లను చదివే ఒక వ్యక్తి, నడకంటే ఇష్టమున్న వ్యక్తి, వంటరాకపోయినా వంట చేసి ఇబ్బంది పెట్టే గృహిణి... ఇలాంటి పాత్రలెన్నో అప్పుడు వచ్చేవి. తరం మారింది. ఇప్పటి తరం వారిలో తెలుగు సాహిత్యాన్ని చదివేవారు అతి తక్కువ మంది. వారిలో కూడా పాపులర్ సాహిత్యం అంటే యండమూరి, మల్లాది, యద్దనపూడి లాంటి వారే ఎక్కువ మందికి తెలుసు. మునిమాణిక్యం రచనల లాంటి గత వైభవాలు వారికి తెలియదు. ఉదాహరణకు ఒక చోట జంధ్యాల- 'పాండవుల సంపాదనంతా కౌరవుల తద్దినాలకే సరిపోయిందన్నట్లు' అని రాస్తారు. ఇలాంటి హాస్యం ఈ తరంలో వారికి ఎలా అర్థమవుతుంది? వీరికి తెలిసింది- రిఫరెన్స్ హ్యూమర్. అంటే ఏదో ఒక జోకు తీసుకొని, దాని మీద ఒక రీల్ చేయటం. ఒక పాపులర్ సీన్‌ను తీసుకొని స్పూఫ్ చేయటం. హాస్యరసభరిత సినిమాలు రాకపోవటానికి ఇది ఒక కారణం. ఇది కేవలం తెలుగులోనే కాదు. బాలీవుడ్‌లో కూడా పూర్తిగా హాస్యభరిత సినిమాలు రావటం లేదు.

మంచి కథలను అందించే రచయితలు లేరనే వాదన వినిపిస్తూ ఉంటుంది...

పూర్తిగా కనుమరుగయ్యారంటే ఒప్పుకోను. హాస్యరస ప్రధానంగా తీయగలిగిన వారు అతి కొద్దిమంది మాత్రమే ఉన్నారు. చాలామంది దర్శకులు సినిమాలో కొన్ని సన్నివేశాల్లో హాస్యాన్ని పెట్టి పండించగలుగుతున్నారు. ఈ మధ్యకాలంలో 'సామజవరగమన', 'మిడిల్ క్లాస్ మెలొడీస్' లాంటి సినిమాల్లో మంచి హాస్యమే ఉంది. అయితే హాస్యం- ఒక పెద్ద సినిమాలో చిన్న ప్లాట్‌గా మారిపోయింది. హాస్యం మాత్రమే కాదు. రొమాన్స్, పాటలు కూడా తగ్గిపోయాయి. ఎటు చూసినా యాక్షన్... యాక్షన్... యాక్షన్. అంతే కాకుండా సినిమా అంతా హీరో సెంట్రిక్‌గా మారిపోయింది.

కానీ తెలుగు సినిమాలు మొదటి నుంచి హీరోపై ఆధారపడినవే కదా..

ఒకప్పుడు కథానాయకుడు సామాన్యుడిగా ప్రారంభమై, కష్టాలు అధిగమించి నిజమైన హీరోగా అయ్యేవాడు. కానీ ప్రస్తుతం ఒరవడి మారిపోయింది. ప్రస్తుతం సినిమాల్లో కథానాయకుడు మొదటి నుంచి మహానుభావుడు, దైవాంశసంభూతుడు. కొన్ని సినిమాల్లో దైవాంశసంభూతుడి నుంచి దేవుడిగా కూడా మారిపోతున్నాడు. అతను అన్ని పనులు చేయగలడు. కొన్ని వందలమందిని ఒంటి చేత్తో చంపేయగలడు. ఇంగ్లీషులో చెప్పాలంటే మనది హీరో సెలబ్రేషన్. నిజానికి మన తెలుగులో ఉన్న స్టార్స్ అందరూ మంచి నటులు. వారికి ఉన్న నటనా సామర్థ్యంలో మనం పదిశాతం మాత్రమే వాడుకుంటున్నాం. సంక్లిష్టమైన పాత్రలను మనం వారికి ఇవ్వటం లేదు.

> సినిమాకు రిలాక్స్ కావటానికి వెళ్తారనేది తప్పుడు వాదన. సినిమా ఒక కళారూపం. ఇది మనలో ఏదో ఒక అనుభూతిని కలగజేస్తుంది. ఏడిపిస్తుంది, నవ్విస్తుంది, కవ్విస్తుంది.. అంతేతప్ప రిలాక్స్ కాని వ్వద్దు.

కథకు ప్రాధాన్యత ఇచ్చే మీలాంటి దర్శకుల పరిస్థితి ఏమిటి?

ఇబ్బందిగానే ఉంటుంది. 'మాస్‌గా తీయగలడా.. హీరో ఎలివేషన్ ఇవ్వగలడా..' లాంటి చర్చలు జరుగుతూనే ఉంటాయి. అందరూ హాయిగా కలిసి కూర్చుని చూసే సినిమాలు తీయాలనేది నా లక్ష్యం. చాలా ఆలోచించి తీసుకున్న నిర్ణయమిది. నా ఉద్దేశంలో ప్రేక్షకులు అందరికన్నా తెలివైన వారు. మంచి కథతో కూడిన సినిమా వచ్చినప్పుడు తప్పనిసరిగా చూస్తారు. ఈ మధ్యకాలంలో కొన్ని చిన్న సినిమాలు కూడా విజయవంతమయ్యాయి కదా! నా ఉద్దేశంలో సామాన్య ప్రేక్షకుడికి జీవితానుభవం ఉంటుంది. జీవిత సత్యాలు చెప్పేది కూడా వాళ్లే! మీకో రెండు ఉదాహరణలు చెబుతా. ఒకసారి కొవ్వూరులో ఒక రిక్షా అతన్ని- "ఫలానా చోటికి వస్తావా? ఇక్కడి నుంచి ఎంత దూరం?" అని అడిగా. నేను అడిగిన ప్రాంతం దగ్గరే! కానీ అతనికి బేరం పోగొట్టుకోవటం ఇష్టం లేదు. వెంటనే అతను- "కళ్లకు దగ్గర... కాళ్లకు దూరం" అన్నాడు. ఎంత చక్కని మాట! దీన్ని 'అష్టాచెమ్మా'లో ఒక చోట వాడా. ఇలాగే మరోసారి రాజోలు నుంచి కారులో వెళ్తున్నాం. డ్రైవర్ ఘంటసాల పాత పాటలు పెడుతున్నాడు. "మీకు ఘంటసాల అంటే ఇష్టమా?" అని అడిగా. అప్పుడతను- "అవును సార్! మనిషి జీవితంలో పాడాల్సిన పాటలన్నీ ఘంటసాల పాడేశాడు" అన్నాడు. ఇది కూడా ఎంత గొప్ప మాట! నా ఉద్దేశంలో నిజమైన మాస్ కల్చర్ వేరు. ప్రస్తుతం మనం చూస్తున్నది- సినిమా వాళ్లు సృష్టించిన మాస్ కల్చర్. దానిని కూడా ప్రేక్షకులు చూస్తారు. కానీ వారి జీవితాల నుంచి వచ్చిన కథలను కూడా ఆదరిస్తారు.



> ఒకసారి నరసరాజు గారిని విశ్వనాథ సత్యనారాయణగారు "మాస్... మాస్ అంటారు నాకు వాళ్లెక్కడా కనబడరేంటయ్యా?" అని అడిగారట. అప్పుడు నరసరాజు గారు "వారు మాలాంటి వాళ్లకు తప్ప మీలాంటి వాళ్లకు కనబడరు సార్!" అని సమాధానమిచ్చారట.

మరి అలాంటి కథలెందుకు రావటం లేదు?

రచయితలు తగ్గిపోయారు. దీనికి కారణం- సాహిత్యాన్ని చదవకపోవటం. సమకాలీన అంశాలపై విశ్లేషణ సామర్థ్యం లేకపోవటం. ప్రస్తుత తరానికి బోలెడంత సమాచారం అందుబాటులో ఉంది. కానీ విశ్లేషణ లేదు. దీనికి కారణం- 1990వ దశకం నుంచి ఎక్కువ మంది సైన్స్, ఐటీ డిగ్రీలపై దృష్టి పెట్టడం మొదలుపెట్టారు. సామాజిక శాస్త్రాలను చదివేవారే తగ్గిపోయారు. దీనితో ఎక్కువ మందికి సమకాలీన సమాజంపై అవగాహన లేదు. 2000 సంవత్సరం తర్వాత మరిన్ని మార్పులు వచ్చాయి. ప్రస్తుత తరం వారికి డబ్బులు ఉన్నాయి. కొనుగోలు శక్తి ఉంది. ఆకాంక్షలు కూడా ఉన్నాయి. కానీ తమ చుట్టూ ఉన్న సమాజంపై అవగాహన లేదు. అలాంటప్పుడు కొత్త కథలు ఎక్కడి నుంచి వస్తాయి?

> ప్రస్తుతం ఉన్న చాలామంది నటులు అన్ని యాసల్లోనూ మాట్లాడతారు. కానీ తెలుగు మాత్రం చదవటం రాదు. సీను పేపరు తెలుగులో రాసి పంపితే- "టింగ్లిష్‌లో పంపుతారా?" అని అడుగుతారు. ఎవరికైనా కథ చెప్పిన తర్వాత- స్క్రీన్‌ప్లే పంపేముందు- "మీకు తెలుగు వచ్చా?" అని అడగాల్సిన పరిస్థితి ఉంది.

> నా ఉద్దేశంలో మూడు కోట్ల సినిమా అయినా, 300 కోట్ల సినిమా అయినా చూడటానికి మనకొక కారణం కావాలి. అది మనకు ఎంత సంతృప్తి ఇస్తుందనే విషయాన్ని ఆలోచించాలి. '300 కోట్ల సినిమా కాబట్టి థియేటర్‌కు వెళ్లి చూద్దాం, మూడు కోట్ల సినిమాను ఓటీటీలో చూద్దాం' అనుకోవటం కరెక్ట్ కాదు. కానీ ఎక్కువ మంది ప్రేక్షకులు ఈ మధ్య ఇలాగే ఆలోచిస్తున్నారు.

> తెలుగు సినిమా అంటే వసూళ్ల గురించి మాట్లాడతారు. అంతే తప్ప సినిమా నిర్మాణంలో మనం ఎంత పరిణతి చెందాం? ఎంత గొప్ప కథలు వస్తున్నాయి? అనే విషయాన్ని మాట్లాడటం లేదు. నా ఉద్దేశంలో సినిమాకు కథ ఆత్మలాంటిది. టెక్నాలజీ అనేది కొత్త హంగులు అద్దుతుందంతే! నా దగ్గర పార్కర్ పెన్ను ఉన్నంత మాత్రాన మంచి కథ రాయలేను కదా ఇది కూడా అంతే!

మరి మళయాళం, తమిళ పరిశ్రమలలో సాంస్కృతిక మూలాలున్న కథలెందుకు తీస్తున్నారు?

వారు సమాజానికి, వారి సంస్కృతికి దూరంగా జరిగిపోలేదు. తమిళంలో వెట్రిమారన్ తీసే సినిమాలు చూడండి. మనకు తెలియని సంస్కృతిని పరిచయం చేస్తాయి. కన్నడ సినిమా 'కాంతార'లో కూడామూలాలు తెలుస్తాయి. 'మోర్ లోకల్.. మోర్ యూనివర్సల్' అనే సూత్రాన్ని వారు పాటిస్తున్నారు.నా ఉద్దేశంలో మొదటి నుంచి తెలుగు ప్రేక్షకులకు- 'సినిమాకు జీవితానికి సంబంధం లేదు' అనే స్పష్టత ఉందనిపిస్తుంది. అందుకే తెలుగు సినిమాల్లో హీరో సెలబ్రేషన్ చాలా ఎక్కువ.

మరి ఈ పరిస్థితి మారదా?

మారుతుంది. ఇదంతా డ్రగ్స్ వల్ల కలిగే ప్రభావం లాంటిది. సామాన్య ప్రజలకు వ్యవస్థ అంటే భయం కాబట్టి- దాన్ని ఎదిరించేవాణ్ణి ఆదరిస్తారు. కానీ అది వ్యక్తి పూజ కాకూడదు. మన జీవితంలో చేయలేని, సమాజంలో ఆచరించలేని పనులను హీరో చేస్తుంటే ఆరాధన కలగవచ్చు. కానీ 'థియేటర్ నుంచి వాస్తవ ప్రపంచానికి వచ్చిన తర్వాత మనం బతకాల్సింది ఈ సమాజంలోనే' అనే విషయం తెలిస్తే దుఃఖం కలుగుతుంది. అంటే దాని ప్రభావం తగ్గిపోతుంది. దీనిని ఇంకో కోణం నుంచి కూడా చూడచ్చు. కొత్తగా విడుదలయిన సినిమా హాలులో చూడండి.. స్క్రీన్ మీద సినిమా ప్రారంభమయిన వెంటనే వందల ఫోన్లు పైకి లేస్తాయి. స్క్రీన్ షాట్‌లను సోషల్‌మీడియాలో వెంటనే పెట్టేస్తారు. దాని ద్వారా ప్రపంచానికి తాము ఒక సినిమా చూస్తున్నామని చెప్పటానికి ప్రయత్నిస్తారు. ఎక్కువమందికి సినిమా కన్నా సెల్‌ఫోన్‌లో వచ్చే రీల్స్‌పైనో, మెసేజ్‌లపైనో దృష్టి చెదురుతూ ఉంటుంది. ప్రేక్షకులు సెల్‌ఫోన్లు చూడకుండా ఏం చేయాలనేది దర్శకులకు పెద్ద సవాలుగా మారింది. దాంతో వారు సినిమాలో కొత్త కొత్త మలుపులు పెట్టేస్తున్నారు. ప్రతి సీన్‌నూ ఒక క్లైమాక్స్‌గా మార్చటానికి ప్రయత్నిస్తున్నారు. ఒకటి పెట్టాల్సిన చోట పది, పది పెట్టాల్సిన చోట వంద- ఇలా ప్రేక్షకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. 'యాక్షన్, గ్లోబల్, స్కేల్, రీచ్' అని పరిగెడుతున్నారు. ప్రేక్షకులు ఒక సినిమాలో ఎన్ని క్లైమాక్స్‌లు చూడగలరు? నెమ్మదిగా ప్రేక్షకులకు ఇలాంటి సినిమాలు చూసి చూసి అలసట కలుగుతోంది. అన్నీ సినిమాలు ఇలాగే వస్తుంటే- ప్రేక్షకులు వీటిని చూడటం మానేసి కథాబలం ఉన్న సినిమాలను చూస్తారు. ఆ రోజు తప్పకుండా వస్తుంది.

● సివిఎల్ఎన్ ప్రసాద్

జుట్టు నెరుస్తోందా!

చిన్న వయసులోనే జుట్టు నెరవడం సర్వ సాధారణమవుతోంది. దీనికి జన్యుపరమైన కారణాలున్నప్పటికీ వాతావరణ కాలుష్యం, పోషకాహార లోపం, నిద్రలేమి వల్ల కూడా జుట్టు సహజత్వాన్ని కోల్పోయి రంగు మారుతోంది. రసాయనాలతో పని లేకుండా ఇంటి వద్ద లభించే వాటితోనే జుట్టుని నల్లగా మార్చుకొనే చిట్కాల గురించి తెలుసుకుందాం!

- **తేయాకు:** ఇందులో అధిక మొత్తంలో టానిన్లు ఉంటాయి. ఇవి వెంట్రుకలను సహజ రీతిలో నల్లబరుస్తాయి. ఒక బౌల్‌లో రెండు గ్లాసుల నీళ్లు, రెండు చెంచాల టీ పొడి వేసి బాగా మరిగించండి. ఈ తేనీటిని చల్లార్చి ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తల మొత్తం వెంట్రుకలకు పట్టేలా స్ప్రే చేయండి. ఇలా తరచూ చేస్తూ ఉంటే వెంట్రుకలు క్రమంగా నలుపు రంగులోకి మారతాయి.



- **రోజ్‌మేరీ:** ఇందులో రక్త ప్రసరణను మెరుగు పరిచే లక్షణాలు ఉన్నాయి. ఒక గిన్నెలో మూడు చెంచాల రోజ్‌మేరీ ఆయిల్ వేసి దానికి రెండు చెంచాల కొబ్బరి నూనె లేదా జోజోబా ఆయిల్ లేదా ఆముదం కలపాలి. ఆ మిశ్రమాన్ని మాడు మీద, తల చుట్టూరా రాసి వెంట్రుకల కుదుళ్లకు చేరేలా వ్రేళ్లతో మర్దన చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే వెంట్రుకల కుదుళ్లు బలంగా మారి నలుపు రంగుని ఉత్పత్తి చేస్తాయి.

- **ఉసిరి:** తెల్ల జుట్టుని నల్లగా మార్చడంలో ఉసిరిని మించిన ఔషధం లేదు. ఇందులో ఇరన్ ఎక్కువగా ఉంటుంది. ఉసిరిని ఆహారంలో చేర్చుకున్నా సౌందర్య సాధనంగా వాడినా మంచి ఫలితాలు వస్తాయి. నాలుగు చెంచాల ఉసిరి పొడికి తగినంత కొబ్బరి నూనె కలిపి పేస్టులా చేయాలి. దీనిని తలంతా పట్టించి వెంట్రుకల కుదుళ్లకు చేరేలా మర్దన చేయాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే వెంట్రుకలకు మంచి పోషణ అంది నల్లగా మారతాయి. ఇది చిన్న పిల్లల్లో కనిపించే బాల నెరుపుకు అద్భుతంగా పనిచేస్తుంది.

- **హెన్నా:** ఇది మంచి ఆయుర్వేద ఔషధం. తలలో వేడిని తగ్గిస్తుంది. వెంట్రుకలకు అందమైన రంగునిస్తుంది. ఒక బౌల్‌లో అయిదు చెంచాల గోరింటాకు పొడి, తగినంత టీ డికాషన్, రెండు చుక్కల కొబ్బరినూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వెంట్రుకలకు కుదుళ్ల నుంచి చివరి దాకా పట్టించాలి. ఇరవై నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. షాంపూ లేదా కుంకుళ్లు ఉపయోగించకూడదు. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే క్రమంగా తెల్ల వెంట్రుకలు రంగు మారతాయి.




- **మందారం:** నిర్జీవంగా ఉండి చిక్కులు పడే వెంట్రుకలకు పోషణని, మృదుత్వాన్ని, మెరుపుని ఇస్తుంది మందారం. గుప్పెడు కుంకుడు కాయలను కొన్ని మందారం ఆకులతో కలిపి రుబ్బి ఆ మిశ్రమంతో తలస్నాం చేస్తూ ఉంటే వెంట్రుకలు నల్లగా ఒత్తుగా పెరుగుతాయి. ఒక కప్పు కొబ్బరి నూనె లేదంటే ఆముదంలో అయిదు మందారం పూలు వేసి బాగా కాచి వడకట్టాలి. ఈ నూనెని చల్లార్చి గాజు సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ రాత్రి పడుకొనే ముందు కొంచెం నూనెను తీసుకొని తల వెంట్రుకలకు పట్టించాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. క్రమంగా తెల్లజుట్టు నల్లగా మారుతుంది.

నోటి పుండ్లను నివారిద్దామిలా!

నోటి పుండ్లు సాధారణంగా దవడ లోపల, పంటి చిగుళ్ల మీద, పెదాల లోపల, నాలుక చివర్లలో ఏర్పడుతుంటాయి. వీటివల్ల ఎటువంటి హాని ఉండదు. కానీ ఆహారం తీసుకోవాలన్నా, మాట్లాడాలన్నా తీవ్రమైన నొప్పి బాధిస్తుంది. నోటిని పరిశుభ్రంగా ఉంచుకోకపోవడం, మలబద్ధకం, పోషకాహార లోపం, జీర్ణాశయ సమస్యలు, హార్మోన్ మార్పుల కారణంగా నోటి పుండ్లు ఏర్పడతాయి. వీటి నివారణలో అద్భుతంగా పనిచేసే ఇంటి చిట్కాల గురించి తెలుసుకుందాం!

తులసి: నాలుక చివర్లలో పుండ్లు ఏర్పడినపు అయిదు తులసి ఆకులను నోటిలో వేసుకుని బాగా నమలాలి. అప్పుడు తులసి ఆకుల నుంచి వచ్చే రసం పుండ్ల మీదకు చేరి వాటిని తగ్గిస్తుంది. ఒక గ్లాసు మంచినీటిలో తులసి ఆకులు వేసి గంటసేపు ఉంచాలి. తరవాత ఆ నీటిని వడబోసి తాగినాకూడా మంచి ఫలితం కనిపిస్తుంది.



కొబ్బరి పాలు: కొబ్బరిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నొప్పి, వాపులను తగ్గిస్తాయి. అర చిప్ప కొబ్బరి ముక్కలకు తగినన్ని నీళ్లు చేర్చి మెత్తగా రుబ్బి సన్నని వస్త్రంతో వడకట్టాలి. ఇలా తయారుచేసుకున్న కొబ్బరి పాలను నోటి నిండా నింపుకొని ఒక నిముషం అలాగే ఉండాలి. తరవాత నోటిని పుక్కిలించాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తూ ఉంటే రెండు రోజుల్లో పుండ్లు తగ్గిపోతాయి. పుండ్ల మీద తరచూ కొబ్బరి నూనె రాస్తుంటే కూడా ఉపశమనంగా ఉంటుంది.



అతి మధురం: ఇది పేరుకు తగ్గట్టు తీయగా ఉండే ఆయుర్వేద ఔషధం. ఇందులో సహజంగానే నొప్పిని తగ్గించే గుణాలు ఉంటాయి. ఒక గిన్నెలో ఒక చెంచా అతి మధురం పొడి వేసి దానికి రెండు చెంచాల నీళ్లు కలిపి తయారుచేసిన మిశ్రమాన్ని పుండ్ల మీద రాయాలి. కనీసం పదిహేను నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. తరవాత మంచి నీటితో నోరు కడుక్కోవచ్చు. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తూ ఉంటే మూడు రోజుల్లో క్రమంగా మంట తగ్గి పుండ్లు మాయమవుతాయి. ఒక చెంచా అతి మధురం పొడిని అర చెంచా తేనెతో కలిపి తింటే నోటి పుండ్లకు కారణమైన వ్యర్థాలన్నీ బయటికి వెళ్లిపోతాయి.

కలబంద గుజ్జు: ఇది పుండ్లను గాయాలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. కలబంద ఆకును నిలువుగా కత్తిరించి అందులోని గుజ్జును తీసుకోవాలి. దీనిని దూది సహాయంతో నోటిలోని పుండ్ల మీద పట్టించాలి. పది నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో నోరు కడుక్కోవాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తే పుండ్లు మానిపోతాయి.


లవంగ నూనె: ఇది దంత సమస్యలతోపాటు పంటి చిగుళ్ల మీద ఏర్పడే పుండ్లకు కూడా మంచి ఔషధంలా పనిచేస్తుంది. నోటిలో ఉండే హానికారక క్రిములను నాశనం చేస్తుంది. ఒక గిన్నెలో మూడు చుక్కల లవంగం నూనె, రెండు చుక్కల కొబ్బరి నూనె లేదా గ్లిసరిన్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని దూది సహాయంతో పుండ్ల మీద అద్దాలి. కొద్దిసేపటి తరవాత నోటిలో ఊరిన లాలాజలాన్ని ఉమ్మివేయాలి. ఇలా రోజుకు నాలుగుసార్లు చేస్తే పుండ్ల చుట్టూ ఉన్న వాపు, నొప్పి తగ్గుతాయి.

తేనె, పసుపు: తేనె క్రిమి నాశినిగా పనిచేస్తుంది. పసుపులోని కర్క్యుమిన్ అనే పదార్థం గాయాలను త్వరగా మాన్పుతుంది. ఒక గిన్నెలో రెండు చెంచాల తేనె, రెండు చిటికెల పసుపు వేసి బాగా కలిపి ఆ విశ్రమాన్ని పుండ్ల మీద రాయాలి. పదిహేను నిమిషాలు అలాగే ఉంచుకుని తరవాత గోరువెచ్చని నీటితో కడగాలి. ఇలా రెండు రోజులు చేస్తే పుండ్లు తగ్గుముఖం పడతాయి.



త్రిఫల చూర్ణం: ఇది ఉసిరి కాయలు, కరక్కాయలు, తానికాయలు కలిపి పొడిచేసిన ఆయుర్వేద ఔషధం. ఈ పొడి వ్యాధికారక క్రిములతో పోరాడి వాటిని నాశనం చేస్తుంది. ఒక గ్లాసు నీటిలో అర చెంచా త్రిఫల చూర్ణం వేసి బాగా మరగించి కషాయంలా తయారు చేసుకోవాలి. దీనితో రోజుకి మూడు పూటలా పుక్కిలించాలి. ఇలా రెండు రోజులు చేస్తే నోరు శుభ్రపడి పుండ్లు తగ్గిపోతాయి.

అభిమానులకు బహుమతి



నయనతార వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర అంశాలతో 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీ తెరకెక్కింది. సాధారణ నటి నుంచి లేడీ సూపర్‌స్టార్‌గా ఎదిగిన ప్రస్థానాన్ని ఇందులో ఆవిష్కరించనున్నారు. హీరోయిన్‌గా రెండు దశాబ్దాల కెరీర్‌ను పూర్తి చేసుకున్న అరుదైన ఘనతను సొంతం చేసుకున్న నయనతార ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో జయాపజయాలు చవిచూశారు. ఐరన్ లెగ్ ముద్ర నుంచి సౌత్‌లో లేడీ సూపర్‌స్టార్ అనే గౌరవాన్ని అందుకున్నారు. ఆమె దక్షిణాదిన అగ్రహీరోలందరితో నటించారు. వారంతా నయనతార గురించి ఆసక్తికర విషయాలను ఇందులో పంచుకున్నారు. దర్శకుడు విఘ్నేశ్ శివన్‌తో ఆమె వివాహం వేడుకలను ఇందులో చూపించబోతున్నారు. 'ఈ డాక్యుమెంటరీ అభిమానులకు నా బహుమతి' అని నయనతార చెప్పారు. నయనతార 40వ పుట్టిన రోజు సందర్భంగా నవంబర్ 18 నుంచి ఈ డాక్యుమెంటరీ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు


ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్	డాక్యుమెంటరీ ఫిల్మ్	నవంబర్ 18
వాండరూస్ 2	యానిమేషన్ సిరీస్	నవంబర్ 18
జాంబీ వర్స్	కొరియన్ సిరీస్	నవంబర్ 19
ఎ మాన్ ఆన్‌ది ఇన్‌సైడ్	వెబ్‌సిరీస్	నవంబర్ 21
జాయ్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 22
పోకెమాన్ హొరిజాన్స్ ది సిరీస్ 4	యానిమేషన్ సిరీస్	నవంబర్ 22
స్పెల్‌బౌండ్	యానిమేషన్ సిరీస్	నవంబర్ 22
ది పియానో లెసన్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 22
యే కాలీ కాలీ ఆంఖే	హిందీ సిరీస్	నవంబర్ 22

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
జియో సినిమా		
బ్యాక్ టూ బ్లాక్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 17
డ్యూన్: ప్రొఫెసి	వెబ్‌సిరీస్	నవంబర్ 18
హరోల్డ్ అండ్ ది పర్పుల్ క్రేయాన్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 23
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ఇంటీరియర్ చైనా టౌన్	వెబ్‌సిరీస్	నవంబర్ 19
కిష్కిందకాండమ్	మలయాళ చిత్రం (తెలుగులో)	నవంబర్ 19
ఏలియన్: రోములస్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 21
అవుట్ ఆఫ్ మై మైండ్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 22
అమెజాన్ ప్రైమ్		
క్యాంపస్ బీట్స్ 2	హిందీ సిరీస్	నవంబర్ 20





ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
ఆపిల్ టీవీ ప్లస్		
బ్లిట్జ్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 22
మనోరమా మ్యాక్స్		
తెక్కువడక్కు	మలయాళ చిత్రం	నవంబర్ 19
బుక్ మై షో		
ది గర్ల్ ఇన్‌ది ట్రంక్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 22
లయన్స్ గేట్ ప్లే		
గ్రీడీ పీపుల్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 22





రూ. 5,200 కోట్లు కావాలి

జగన్ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 2,62,640 టిడ్కో ఇళ్లను పూర్తి చేయాలంటే మొత్తం రూ. 5,200 కోట్లు అవసరమవుతాయి. బ్యాంకు ద్వారా ప్రభుత్వమే రుణాలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎలాగైనా సరే టిడ్కో ఇళ్లను పూర్తి చేస్తాం. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అత్యధిక ప్రాధాన్యమిస్తాం. అడ్వాన్సులు చెల్లించిన లబ్ధిదారులకు న్యాయం చేస్తాం. వికలాంగులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటాం. వరదలు వచ్చిన ప్రాంతాల్లో రుణాల వసూళ్లను ఒక నెల వాయిదా వేయమని బ్యాంకులకు లేఖ రాశాం. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులపై కూడా ఒత్తిళ్లు ఆపమని కోరతాం" అంటూ మంత్రి నారాయణ వివరించారు.

జగన్ నిర్వాకంతోనే టిడ్కో ఇళ్లు నాశనం

- దీనివల్ల రూ. 339 కోట్ల ప్రజాధనం వృథా
- కాంట్రాక్టర్లకు రూ. 540 కోట్ల బిల్లులు పెండింగ్
- లబ్ధిదారుల పేరుతో రుణాలు తీసుకున్నారు
- అక్రమాలన్నింటిపైనా విచారణ చేస్తున్నాం
- అసంపూర్తి ఇళ్లకు రూ. 5200 కోట్లు కావాలి
- రుణం తీసుకుని ఆ ఇళ్లన్నీ పూర్తి చేస్తాం

అసెంబ్లీలో మంత్రి నారాయణ వెల్లడి

కక్షగట్టి లబ్ధిదారులను మార్చేశారు

- పాలన అనుమతి లేకుండా వైసీపీ రంగులు
- 5 లక్షల ఇళ్లలో 2.38 లక్షలు రద్దు
- 52 వేల ఇళ్లను అర్ధంతరంగా నిలిపేశారు

అమరావతి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లు మాజీ సీఎం జగన్ పిచ్చిచేష్టలతో సర్వనాశమయ్యాయని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ ధ్వజమెత్తారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులను కక్ష గట్టి మరీ మార్చేశారని మండిపడ్డారు. లబ్ధిదారులు మీద రుణాలు తీసుకుని వాడేసుకున్న గత వైసీపీ ప్రభుత్వం అడ్వాన్సులుగా కట్టిన డీడీలను కూడా బ్యాంకుల్లో ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడిందని చెప్పారు. టీడీపీ హయాంలో కట్టిన టిడ్కో ఇళ్లకు వేసిన మంచి రంగులను చెరిపేసి.. వైసీపీ రంగులు వేయించారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం అక్రమాలన్నింటిపై దర్యాప్తునకు ఆదేశిస్తామని చెప్పారు. బిల్లులు రాక ఇబ్బంది పడుతున్న కాంట్రాక్టర్ల సమస్యపై కమిటీ వేస్తామని, ఆ కమిటీ ఇచ్చే నివేదికపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. శనివారం శాసనసభలో టిడ్కో ఇళ్లపై జరిగిన స్వల్పకాలిక చర్చలో కూటమి ఎమ్మెల్యేల ప్రశ్నలకు మంత్రి నారాయణ సమాధానాలిస్తూ.. టిడ్కో ఇళ్ల వ్యవహారంలో ఇప్పటివరకు ఏం జరిగిందనేది పూసగుచ్చినట్లు సభకు వివరించారు.

కక్షసాధింపు ధోరణితో నాశనం..

"గతంలో తెలుగుదేశం ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను జగన్ పూర్తిగా నాశనం చేశాడు. 2022 కల్లా ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు ఉండాలని 2014-19 మధ్య కాలంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయించారు. అప్పుడు పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రిగా కేంద్రంలో వెంకయ్యనాయుడు ఉన్నారు. ఆయనతో కలిసి పలుమార్లు చర్చలు జరిపి దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా ఎక్కువగా 7,01,481 టిడ్కో ఇళ్లు ఏపీకి మంజూరు చేయించాం. వీటిలో తొలుత 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇచ్చాం. 4,54,704 ఇళ్ల నిర్మాణానికి 2017 జూలైలో టెండర్లు పిలిచి వెంటనే ఆ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించాం. రాష్ట్రంలో ప్రభుత్వం మారే సమయానికి అంటే 2019, మే నాటికి 77,371 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశాం. అయితే తర్వాత వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో పేదల కోసం కట్టిన ఇళ్లను సర్వనాశనం చేసేసింది. టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన 5 లక్షల ఇళ్లలో 2,38,368 ఇళ్లను రద్దు చేసేసింది. 2,62,640 ఇళ్లను మాత్రమే ఉంచారు. వాటిలో కేవలం 57 వేల ఇళ్లను మాత్రమే మౌలిక సదుపాయాలతో గత ఐదేళ్లలో పూర్తి చేశారు. అంతకుముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం వరకు పూర్తి చేసిన మరో 1.10 లక్షల ఇళ్లను పూర్తి చేసినట్లు చెబుతున్నా.. అవి పేరుకు మాత్రమే. ఇక మిగిలిన ఇళ్లన్నీ అలాగే వదిలేశారు.

ఇష్టానుసారం మార్చేశారు

టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లకు ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో చాలామందిని జగన్ ప్రభుత్వం ఇష్టానుసారం మార్చేసింది. 25 శాతం కంటే తక్కువ పనులు పూర్తయిన ఇళ్లను పూర్తిగా నిలిపివేశారు. ఇలా 52 వేల ఇళ్లను అర్ధంతరంగా నిలిపివేయడం వల్ల రూ. 339 కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది. పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ. 540 కోట్ల బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టేశారు. కరోనా సమయంలో మొబిలైజేషన్ అడ్వాన్సులపై వీవరింగ్ రూ. 110 కోట్లు పెండింగ్ ఉంది. డీవియేషన్ ఆఫ్ ఐటమ్స్ కింద రూ. 1,225 కోట్లు పెండింగ్ ఉంది. ప్రైస్ అడ్జెస్ట్‌మెంట్ రూ. 189 కోట్లు పెండింగ్ ఉంది. ఈ విధంగా టిడ్కో ఇళ్లను అన్ని విధాలుగా నాశనం చేశారు. దీనిపై అధికారులు విచారణ చేస్తున్నారు. ఇళ్లపై వైసీపీ రంగులు మార్చడానికి ప్రభుత్వం నుంచి పరిపాలనాపరమైన అనుమతి ఇవ్వలేదు. టెండర్లు పిలవలేదు. కేవలం నోటి మాటతో రూ. 300 కోట్లతో రంగులు మార్చేశారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇంతవరకు డబ్బులు చెల్లించలేదు. నిర్మాణం పూర్తికాకుండానే 40,571 టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల పేర్లతో జగన్ ప్రభుత్వం రుణాలు తీసుకుంది. ఇప్పుడు ఆ లోన్లు చెల్లించాలంటూ బ్యాంకు అధికారులు లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నారు. వారి అకౌంట్లు ఎన్‌పీఏలోకి వెళ్లిపోయాయి. దీనిపై ముఖ్యమంత్రి చర్చలు జరుపుతున్నారు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. తిక్క పనులు చేయడం వల్లే జగన్‌ను అందరూ పిచ్చితుగ్లక్ అంటున్నారు.



టిడ్కో ఇళ్లను క్వాలిటీగా కట్టించాం

ముఖ్యమంత్రి చంద్రబాబు టిడ్కో ఇళ్ల ఫైల్ నా దగ్గరకు పంపుతూ.. ప్రతి మహిళ తన భర్త, పిల్లలతో ఆనందంగా జీవించేలా ఇళ్లు కట్టించమని, ఎంత ఖర్చయినా పర్వాలేదని చెప్పారు. ముఖ్యమంత్రి నాకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదవాడికి మంచి నాణ్యతతో ఇళ్లు కట్టించాం. 365 చదరపు అడుగుల ఇళ్లకు అడ్వాన్సుగా రూ. 50 వేలు, 430 చదరపు అడుగుల ఇళ్లకు రూ. లక్ష చొప్పున లబ్ధిదారులు ముందుగానే చెల్లించాలని నిర్ణయించగా.. లబ్ధిదారులు ఆనందంగా ముందుకు వచ్చారు. కానీ జగన్ చేసిన దుర్మార్గ పనుల వల్ల లబ్ధిదారులకు ఇప్పటికీ ఇళ్లు ఇవ్వలేదు. అడ్వాన్సు తిరిగి చెల్లించకుండా నిండా ముంచేశారు. టిడ్కో ఇళ్ల సముదాయాల్లో ఆర్థిక కార్యకలాపాల కాంప్లెక్స్ కోసం 5 నుంచి 10 ఎకరాలు కేటాయించాం. వాటిని కూడా లేకుండా చేశారు.



జగన్‌కు ప్యాలెస్‌లు కావాలి: జీవీ

జగన్‌కు ప్యాలెస్‌లు కావాలి.. ప్రజలకు మాత్రం కనీసం ఇళ్లు కూడా ఉండకూడదన్న ధోరణిలో వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపించారు. అసెంబ్లీలో టిడ్కో ఇళ్లపై స్వల్పకాలిక చర్చలో పలువు సభ్యులు మాట్లాడారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ తప్పులకు ఏపీ టిడ్కో రూ. 17 కోట్లు వడ్డీ కట్టాల్సి వచ్చిందన్నారు. తన నియోజకవర్గంలో 4 వేల ఇళ్లకు గాను 2019లోగా 1200 ఇళ్ల నిర్మాణాన్ని 90 శాతం మేర పూర్తి చేశారని, ఆ 10 శాతం పూర్తి చేయకుండా జగన్ సర్కార్ గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం అత్యధికంగా విశాఖపట్నానికి 1.09 లక్షల ఇళ్లు కేటాయిస్తే.. వైసీపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదన్నారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్లపై ప్రత్యేకంగా ఒక హౌస్ కమిటీ వేయాలని, ఆనాటి ప్రభుత్వం, అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ.. 6 నుంచి 10 శాతం కమిషన్ ఇచ్చేవారికి బిల్లులు ఇచ్చారన్నారు. లక్షలమంది లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టిన వారిపై వెంటనే విచారణ చేయాలన్నారు. లబ్ధిదారులు ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. కాగా, కాకినాడ ఎమ్మెల్యే ప్రసంగం మధ్యలో జగన్ గతంలో మాట్లాడిన వీడియోను సభలో ప్రదర్శించారు. దీనిపై కొంతమంది సభ్యులు అభ్యంతరం తెలిపారు. స్పీకర్ కూడా హెచ్చరించడంతో ఆయన వీడియోను నిలిపేశారు.

ఇంటర్ విద్యలో అడ్మిషన్ల మాయ!

- కాలేజీలు లేకుండానే ప్రవేశాలు, క్లాసులు
- జూన్‌లోనే అడ్మిషన్లు.. ఇప్పుడు అనుమతులు
- నిబంధనల ఉల్లంఘనకు పరాకాష్ఠ
- ఇటీవల పలు కొత్త కాలేజీలకు అనుమతి
- ఇంకొన్ని కాలేజీలకు ఇచ్చేందుకు చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇంటర్ విద్యలో నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోంది. అసలు కాలేజీలే లేకుండా అడ్మిషన్లు తీసుకుని పాఠాలు చెబుతున్న వైనం వెలుగులోకి వచ్చింది. కాలేజీ ఏర్పాటుకు దరఖాస్తు చేశామని, అనుమతి కచ్చితంగా వస్తుందంటూ ఇప్పటికే విద్యార్థులను చేర్చుకున్న కొంత మంది.. ఇప్పుడు అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నారు. మరికొందరు విద్యాసంవత్సరం మధ్యలో విద్యార్థులను అటూ ఇటూ మార్చే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, ప్రభుత్వం కూడా ఐదు నెలలు గడిచిన తర్వాత కాలేజీలకు అనుమతులు ఇస్తుండడం గమనార్హం. అది కూడా ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు తీసుకునేందుకు అవకాశం కల్పించడం సందేహాస్పదంగా మారింది.

నిబంధనలు వర్తించవా?

ఏటా జూన్ 1 నుంచి జూనియర్ కాలేజీల విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది. అంతకంటే ముందు నుంచే ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను చేర్చుకునే ప్రక్రియ ప్రారంభిస్తాయి. జూలై, ఆగస్టు నెలల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తవుతుంది. కానీ, ఆ గడువు తర్వాత పదికి పైగా కొత్త కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. అక్టోబరు 29న కూడా ఓ కాలేజీ ఏర్పాటుకు అనుమతిస్తూ జీవో జారీ చేసింది. అనుమతులు ఇవ్వడంలో తప్పు లేకపోయినా.. ఈ విద్యా సంవత్సరం నుంచే కళాశాలలు ప్రారంభమవుతాయని జీవోలో పేర్కొన్నారు. ఇప్పటికే ఐదు నెలలు గడిచిన తర్వాత ఇప్పుడు కాలేజీలు ఎలా ప్రారంభిస్తారనే అనుమానాలు నెలకొన్నాయి. అయితే, ఆయా యాజమాన్యాలు కాలేజీ ఏర్పాటుకు అనుమతులు రాకుండానే జూన్‌లో అన్ని కాలేజీలతో పాటు అడ్మిషన్లు చేపట్టాయి. కాలేజీ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నామని, త్వరలో అనుమతి వచ్చేస్తుందని నమ్మబలికి అనధికారికంగా కళాశాలలను ప్రారంభించారు. ఆ తర్వాత ప్రభుత్వంపై ఒత్తిడి చేసి అనుమతులు తీసుకుంటున్నారు. అనుమతులు రానివారు మాత్రం తమ విద్యార్థులను ఇతర కాలేజీలకు మారుస్తున్నారు. ఇది ఇంటర్ విద్యలో గందరగోళ పరిస్థితి నెలకొనేలా చేసింది. నిబంధనలకు విరుద్ధంగా అసలు కళాశాలలే లేకుండా అడ్మిషన్లు తీసుకుంటుంటే అధికారులు ఏంచేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కాగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఐదు నెలలు దాటి ఆరో నెల రాగా ఇప్పుడు ఇంకొన్ని కాలేజీలకు అనుమతులు జారీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిసింది.

ఫోన్ చూస్తూ సాంబార్‌లో పడ్డ బాలుడు

- ఒళ్లంతా కాలిన గాయాలతో ఆస్పత్రికి తరలింపు
- మూడు రోజులు మృత్యువుతో పోరాడి మృతి
- కర్నూలు జిల్లా గోనెగండ్లలో విషాదం

గోనెగండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వ్యసనం ఐదేళ్ల బాలుడి ప్రాణాలను బలి తీసుకుంది. సెల్‌ఫోన్ చూస్తూ వేడివేడి సాంబార్ పాత్రలో పడిపోయిన చిన్నారి.. కాలిన గాయాలతో ఆస్పత్రిలో మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి మృతిచెందాడు. కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామంలో ఈ విషాదం చోటుచేసుకుంది. తెలంగాణలోని గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడు గ్రామానికి చెందిన మంగళి వీరేష్ కుటుంబం కొన్ని సంవత్సరాల క్రితం జీవనోపాధి నిమిత్తం కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామానికి వచ్చి స్థిరపడింది. వీరేష్, లక్ష్మీదేవి దంపతులకు కుమారుడు జగదీశ్ (5), ఇద్దరు కుమార్తెలు సంతానం. వీరేష్ గ్రామంలో సెలూన్ షాప్ పెట్టుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం గ్రామంలో బంధువుల ఇంట్లో జరుగుతున్న వివాహానికి వీరేష్ తన భార్య పిల్లలతో కలసి వెళ్లాడు. అక్కడ ఇంటి పక్కనే గుడిసెలో వంటలు చేసి సిద్ధంగా ఉంచారు. ఈ సమయంలో జగదీశ్ సెల్‌ఫోన్ కావాలని ఏడవడంతో వీరేష్ ఫోన్ ఇచ్చాడు. అందులో వీడియోలు చూస్తూ జగదీశ్ వంటలు వండిన గుడిసెలోకి వెళ్లాడు. అక్కడ సాంబార్ పాత్రపై కూర్చోగానే మూత పక్కకు జరిగి వేడి సాంబార్‌లో పడిపోయాడు.

ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల అక్రమాలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతంలోని సబ్‌రిజిస్ట్రార్‌కు సమాచారం మాత్రమే ఇచ్చేవారు. నివేదిక అడిగి, ఆ రిజిస్ట్రేషన్‌లో ఉన్న లోటుపాట్లను తెలుసుకునే నిబంధన ఎత్తేసి, అందుకు అనుగుణంగానే సాఫ్ట్‌వేర్‌ను కూడా పూర్తిగా మార్చేశారు. దీనివల్ల అనేక దొంగ రిజిస్ట్రేషన్లు జరిగినట్టుగా కూటమి ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని కేవలం 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు మాత్రమే అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. సీనియర్ సిటిజన్లకు, దివ్యాంగులకు మెడికల్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. సీఎం చంద్రబాబు ఆమోదిస్తే ఎనీవేర్ అక్రమాలకు చెక్ పడే అవకాశం ఉంది.

జనవరి 1 నుంచి భూముల విలువ పెంపు

జనవరి 1 నుంచి రాష్ట్రంలోని భూముల మార్కెట్ ధరలు పెరుగుతున్నాయి. ఈ రేట్లు ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రేట్లు, గతంలో ఏ ప్రాంతంలో ఎంత పెంచారనే అంశాలను పరిగణనలోకి తీసుకొని ధరలు పెంచాలని భావిస్తున్నారు. మరోవైపు, జగన్ హయాంలో రీసర్వే చేసి సర్వే నంబర్ల బదులు ల్యాండ్ పార్సిల్ నంబర్లు కేటాయించారు. ఆ భూముల రిజిస్ట్రేషన్లు ఎల్‌పీఎం నంబర్ల ఆధారంగా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే, వీటి జారీలో వివాదాలు తలెత్తాయి. పైగా అన్ని ప్రాంతాలకు ఎల్‌పీఎం నంబర్లు జారీ చేయలేదు. దీంతో ఆ భూముల రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఎల్‌పీఎం నంబర్లతోపాటు, వెబ్‌ల్యాండ్‌లో నమోదైన పాత సర్వే నంబర్ల ప్రకారం కూడా రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

గంజాయి స్మగ్లర్ల ఆస్తులు స్వాధీనం

- సహకరించే వ్యాపారులవీ జప్తు
- జగన్ హయాంలో నాడు గంజాయి రాజ్
- తిరిగి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే చర్యలు
- కేసులు, అరెస్టులతోనే చెక్ పెట్టలేం
- ఆస్తులూ జప్తు చేస్తేనే స్మగ్లర్లలో భయం
- ఈ దిశగా కార్యాచరణకు సిద్ధం కండి
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టీ ఆదేశం
- ఏజెన్సీ ప్రాంతాల సీఐలతో సమావేశం



ఐదు జిల్లాల పరిధిలోని ఏజెన్సీ ప్రాంత సీఐలతో సమావేశమైన డీఐజీ గోపీనాథ్‌జెట్టీ

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి సాగు, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. జగన్ హయాంలో గంజాయి రాజ్‌గా మారిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టే చర్యలను ప్రారంభించింది. గంజాయి సాగు, తరలింపునకు సహకరించే వ్యాపారులు, స్మగ్లర్ల ఆస్తులను స్వాధీనం చేసుకునేలా కార్యాచరణ రూపొందించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టీ ఆదేశాలు జారీచేశారు. విశాఖ రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న సీఐలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. గంజాయి సాగు, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఆశించిన ఫలితం కనిపించడం లేదని డీఐజీ అభిప్రాయపడ్డారు. గంజాయి దొరికినప్పుడు పట్టుబడిన వారిని అరెస్టు చేసి, అక్కడితో దర్యాప్తు ఆపేయకుండా మూలాలను శోధించాలని ఆయన ఆదేశించారు. ఏజెన్సీలో గంజాయి సాగుకు ఆర్థికంగా సహకరిస్తున్న వ్యాపారులు, గంజాయి రవాణాకు ప్రణాళికలు రచించి అమలు చేస్తున్న స్మగ్లర్లను గుర్తించి..వారి ఆస్తులు స్వాధీనం చేసుకోవాలన్నారు. అలా చేస్తేనే గంజాయి స్మగ్లర్లకు, సాగుకు ఆర్థిక సహాయం అందించేవారికి భయం కలుగుతుందని డీఐజీ పేర్కొన్నారు. గంజాయికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడాలంటే కఠినమైన చర్యలకు దిగాల్సిందేనన్నారు. ఈ విషయమై మరోసారి సమావేశమయ్యేసరికి అంతా సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐదు జిల్లాల సీఐలతోపాటు లీగల్ అడ్వైజర్లు పాల్గొన్నారు.

హాస్టళ్లలో భద్రత డొల్ల..

- విద్యార్థినుల భద్రత బాధ్యత ప్రిన్సిపాల్, టీచర్లదే
- సాంఘిక సంక్షేమ హాస్టళ్ల దుస్థితిపై హైకోర్టు ఆందోళన
- సీసీ కెమెరాలు పెట్టాలి.. నిరంతరం పర్యవేక్షించాలి
- భద్రత విషయంలో ప్రభుత్వానికి పలు సూచనలు
- 2011లో బాలికతో వాచ్‌మన్ అనుచిత ప్రవర్తన..
- సర్వీసు నుంచి తొలగిస్తూ అధికారులిచ్చిన ఉత్తర్వులకు సమర్థన




అమరావతి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్ల దుస్థితిపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హాస్టళ్లలోని బాలికల భద్రత విషయంలో సంబంధిత అధికారులతో చర్చించి సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖను ఆదేశించింది. సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఓ బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించిన వాచ్‌మెన్‌ను సర్వీసు నుంచి తొలగిస్తూ అధికారులిచ్చిన ఉత్తర్వులను సమర్థించింది. ఈ కేసులో ఘటన జరిగి 13 ఏళ్లు గడుస్తున్నా సాంఘిక సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాలలు, హాస్టళ్లలోని పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదని ఆందోళన వ్యక్తం చేసింది. రెసిడెన్సియల్ పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పాఠశాలలోని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులదే అని స్పష్టం చేసింది. హాస్టళ్లలో భద్రత కల్పించే విషయంలో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టకుంటే.. గ్రామీణ, పట్టణ పిల్లల మధ్య విద్యలో అసమతుల్యత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విషయంలో సమగ్ర మార్గదర్శకాలు రూపొందించేందుకు వీలుగా ఉత్తర్వుల ప్రతిని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఆ సూచనలు ఏమిటంటే..

- సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనం చుట్టూ ప్రహరీ నిర్మించి, గేటు ఏర్పాటు చేయాలి. గోడపై సోలార్ ఫెన్సింగ్ వేయాలి. హాస్టల్‌కు వచ్చి, వెళ్లేవారి వివరాలు నమోదుకు రిజిస్టర్ ఉండాలి.
- హాస్టల్ ప్రవేశ మార్గాలు, కారిడార్, కామన్ ఏరియాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. సంబంధిత ఫుటేజ్‌ను అనధికార వ్యక్తులు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలి.
- బాత్‌రూమ్‌లు, టాయిలెట్లు పరిశుభ్రంగా నిర్వహించాలి.
- విద్యార్థులకు భద్రత విషయంలో సిబ్బందికి అవగాహన తరగతులు నిర్వహించాలి. లింగ సమానత్వంపై శిక్షణ ఇవ్వాలి.
- సిబ్బందికి ప్రవర్తనా నియమావళి రూపొందించాలి. దాన్ని అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి.
- హాస్టల్ వాతారణానికి అలవాటు పడేందుకు, వ్యక్తిగత సమస్యల నుంచి బయటపడేందుకు వీలుగా మానసిక వైద్యులను అందుబాటులో ఉంచాలి.
- పోక్సో చట్ట ప్రకారం నిందితులకు పడే శిక్షల వివరాలను స్థానిక భాషలో పోస్టర్లు ప్రదర్శించాలి.
- బాలికలు ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఆత్మరక్షణలో శిక్షణ ఇప్పించాలి.
- భద్రతా చర్యలు సమర్థవంతంగా అమలతున్నాయా..? లేదా.. అని ఎప్పటికప్పుడు సమీక్షించాలి.

అసలు ఏం జరిగిందంటే...

అనంతపురం జిల్లా, నరపల మండలానికి చెందిన కె.శంకరయ్య గుత్తి ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్సియల్ పాఠశాలలో 1996లో వంట మనిషిగా చేరి, వాచ్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సంక్షేమ హాస్టల్‌లో 2011 జూలై 24న ఓ బాలిక చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ వ్యవహారం తల్లిదండ్రుల ద్వారా ప్రిన్సిపాల్‌కు చేరడంతో ఆయన శంకరయ్యను సర్వీసు నుంచి తొలగిస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ 2014లో శంకరయ్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల ఇరువైపుల వాదనలు ముగియడంతో న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. పిటిషనర్ శంకరయ్య తీవ్ర దుష్ప్రవర్తను పాల్పడ్డారని పేర్కొంది. నిద్రించే సమయంలో తలుపులకు తాళం వేసుకోవాలని ఒక టీచర్ హాస్టల్ విద్యార్థినులకు చెప్పారంటే.. శంకరయ్య తీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొంది. శంకరయ్యను సర్వీసు నుంచి తొలగిస్తూ అధికారులిచ్చిన ఉత్తర్వులను సరైనవేనని తెలిపింది. దీనిలో జోక్యం చేసుకొనేందుకు ఎలాంటి కారణాలూ లేవని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.హరినాథ్ తీర్పు ఇచ్చారు.





డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, బ్యాక్టీరియాపై దాడి చేస్తున్న వైరస్‌లు (నమూనా చిత్రం)

ఔషధ నిరోధకతకు 'ఫేజ్ థెరపీ'తో చెక్

- పాత వైద్య విధానంతో చక్కటి ఫలితాలు
- ఇన్‌ఫెక్షన్ వ్యాధుల స్పెషలిస్ట్ కల్యాణ్ చక్రవర్తి

గుంటూరు మెడికల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మానవాళికి ఆరోగ్య ముప్పుగా పరిణమిస్తున్న యాంటీబయోటిక్ ఔషధ నిరోధకతను (ఏఎంఆర్) ఎదుర్కొనేందుకు పాత వైద్య విధానమైన బ్యాక్టీరియోఫేజ్ థెరపీ చక్కగా ఉపయోగపడుతుందని ఇన్‌ఫెక్షన్ వ్యాధుల నిపుణుడు డాక్టర్ కే కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని హెల్ప్ హాస్పిటల్‌లో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. మనిషిలో జబ్బులకు కారణమయ్యే బ్యాక్టీరియాలు యాంటీబయోటిక్ మందులను తట్టుకొని జీవిస్తున్నాయని, దీనివల్ల చిన్న వ్యాధులకు సైతం చికిత్స చేయడం కష్టంగా మారుతోందని వివరించారు. ఈ సమస్య వల్ల ఏటా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మృతిచెందుతున్నారని తెలిపారు. 'బ్యాక్టీరియాలు, వైరస్‌లు, ఫంగస్‌ల వల్ల వ్యాధులు మనిషిపై దాడి చేస్తాయి. అయితే ఈ బ్యాక్టీరియాలపై దాడిచేసి వాటిని పూర్తిగా భక్షించే వైరస్‌లు ప్రకృతిలో ఉన్నాయి. వీటినే బ్యాక్టీరియోఫేజ్‌గా పిలుస్తాం' అని తెలిపారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఫేజ్ థెరపీని వినియోగించినట్లు తెలిపారు. తమ హాస్పిటల్‌లో వెంటిలేటర్ అసిస్టెడ్ నిమోనియా (ఎసింటోబ్యాక్టర్ లోఫి)తో బాధపడుతున్న 60 ఏళ్ల మహిళకు ఫేజ్ థెరపీ చేపట్టామని, మూడు రోజుల్లోనే నిమోనియా నుంచి కోలుకుందన్నారు.

వేలేరుపాడు పోలీస్‌స్టేషన్‌కు బోరుగడ్డ


- విచారణ అనంతరం జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరు

వేలేరుపాడు(కుక్కునూరు)/జంగారెడ్డిగూడెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో బోరుగడ్డ అనిల్‌ను విచారణ నిమిత్తం శనివారం ఏలూరు జిల్లా వేలేరుపాడు పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. అనిల్‌పై అదే గ్రామానికి చెందిన ఉద్దగిరి రాణి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అనిల్‌ను పోలీసులు శుక్రవారం రాజమహేంద్రవరం నుంచి వేలేరుపాడు తీసుకొచ్చారు. పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, కుక్కునూరు సీఐ రమేష్‌బాబు, జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు అనిల్‌ను విచారించారు. అనంతరం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, స్థానిక కోర్టులో హాజరుపరిచారు. కాగా, బోరుగడ్డ అనిల్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కూటమి నాయకులు వేలేరుపాడు పోలీస్‌స్టేషన్ వద్ద దాదాపు గంటసేపు ఆందోళన నిర్వహించారు.

వర్రా కేసులో మరో ఆరుగురికి నోటీసులు

- నిందితుల ఇళ్లకు వెళ్లి అందించిన పోలీసులు

పులివెందుల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రా రెడ్డిపై ఉన్న కేసులో అభియోగాలున్న మరో ఆరుగురికి పోలీసులు శనివారం నోటీసులు జారీ చేశారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి సొంతూరైన లింగాల మండలం అంబకపల్లెలోని ఆయన ఇంటికి వెళ్లి నోటీసులు అతికించారు. పులివెందులలోని వివేకానందరెడ్డి, అర్జున్‌రెడ్డి ఇళ్లకు వెళ్లి నోటీసులు అందించారు. వివేకానంద రెడ్డి అందుబాటులో లేరని, వచ్చిన వెంటనే నోటీసుకు వివరణ ఇస్తారని కుటుంబసభ్యులు తెలిపారని సమాచారం. కడపకు చెందిన ఇద్దరికి, కాశినాయన మండలానికి చెందిన మరో వ్యక్తికి నోటీసులిచ్చారు. వర్రా రవీంద్రా రెడ్డి పెట్టిన పోస్టులకు సంబంధించి నమోదైన కేసు విషయంలో వారిపైనా ఆరోపణలు ఉన్నాయని, పులివెందుల డీఎస్పీ కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. చిత్తూరు, అనంతరం, నెల్లూరు తదితర జిల్లాల్లోనూ మరికొందరికి నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది.





జగన్ పెట్టిన ఇబ్బందులకు నేను పదిసార్లు ఆత్మహత్య చేసుకోవాలి!

అసెంబ్లీలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆవేదన

అమరావతి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనపై బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ నిప్పులు చెరిగారు. అసెంబ్లీ వేదికగా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లను నిలువునా ముంచేశారని జగన్‌పై విమర్శలు గుప్పించారు. "నేను 1983 నుంచి కాంట్రాక్టర్‌గా ఉన్నా. వైసీపీ ప్రభుత్వం లాంటి దారుణమైన దుర్మార్గమైన రాక్షస ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టు పనులు చేసిన తర్వాత తిప్పలు, బాధలు తెలిశాయి. నన్ను జగన్ పెట్టిన బాధతో 10 సార్లు ఆత్మహత్య చేసుకోవాలి. నాకు గుండె ధైర్యం ఎక్కువ. అందుకే ఐదు సార్లు గుండెపోటు వచ్చినా బతికా. అసెంబ్లీకి జగన్ ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తున్నా. దయచేసి జగన్‌ను అసెంబ్లీకి పిలిపించండి. ఆయన్ని పిలవాల్సిన బాధ్యత మీపై ఉంది. కాంట్రాక్టర్లతో పాటు ప్రజల్ని కూడా అప్పులు పాలు చేసి దుర్మార్గమైన పాలన చేశారు" అని బీజేపీ శాసన సభ పక్షనేత విష్ణుకుమార్ రాజు మండిపడ్డారు. శనివారం అసెంబ్లీలో టిడ్కో ఇళ్ల నిర్మాణంపై జరిగిన చర్చలో తొలుత ఆయన మాట్లాడారు. ప్రసంగం ప్రారంభంలోనే జగన్, వైసీపీ నేతలంతా తన ఆవేదనను టీవీలో చూస్తే సిగ్గుతో చస్తారని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ 2014-19లో ఏపీకి 7 లక్షలు ఇళ్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. అప్పటి సీఎం చంద్రబాబు 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చారని, వీటి నిర్మాణానికి కేంద్రం రూ.1.50 లక్షలు ఇవ్వడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1.50 లక్షల సబ్సిడీతో కలిపి లబ్ధిదారులకు రూ.3 లక్షలు అందించారన్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలం కూడా ఉచితం ఇచ్చిందన్నారు. తొలుత 2,61,641 ఇళ్ల నిర్మాణాన్ని అప్పటి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఆ మొత్తం ఇళ్ల నిర్మాణాలను జగన్ వచ్చాక నిలిపివేశారని గుర్తుచేశారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

దిక్కుమాలిన జగన్

"దిక్కుమాలిక జగన్, దుర్మార్గపు జగన్, నా ఎస్సీ, ఎస్టీలంటూ మాయ మాటలు చెప్పి ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత ప్రజల్ని మోసం చేశారు. వైసీపీకి ఓట్లు వేసిన వాళ్లు కూడా తలదించుకోవాలి. అత్యంత దారుణంగా, దుర్మార్గంగా 2,38,300 ఇళ్లను ఆపేశారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను రద్దు చేసిన ఘనత జగన్‌కే దక్కింది. ప్రభుత్వం మారిన తర్వాత కాంట్రాక్టర్లు, ప్రజలు పడ్డ బాధలు అన్నీ ఇన్నీ కావు. కాంట్రాక్టర్లు పని చేద్దామంటే డబ్బులు ఆపేశారు. చివరికి చేసిన పనులకు కూడా బిల్లులు ఇవ్వలేదు. అడిగితే చంద్రబాబు హయాంలో చేశారు. కాబట్టి వెళ్లి ఆయన్నే అడగండి అని వెటకారంగా మాట్లాడేవారు. ఒక ప్రభుత్వం చేపట్టిన పనులు తర్వాత వచ్చిన ప్రభుత్వం కూడా కొనసాగించాలన్న కనీస జ్ఞానం కూడా జగన్‌కు లేదు. రాజకీయ వ్యవహారాలు తెలియని అనుభవ శూన్యుడైన జగన్ వల్ల రాష్ట్రంలో ప్రజలతో పాటు కాంట్రాక్టర్లు కూడా సర్వనాశనం అయిపోయారు. గతంలో టీడీపీ ప్రభుత్వం గుర్తించిన లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వలేదు. వాళ్లేమో ఇల్లు ఎప్పుడు వస్తుందా అని ఆవేదనతో ఎదురుచూశారు. చివరికి వారికి ఇళ్లు ఇవ్వలేదు. జగన్ పెట్టిన ఇబ్బందులకు 43 మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారు. పనులు చేసిన తర్వాత వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వక, అప్పులుపాలై, బ్యాంక్‌లు కూడా రుణాలు ఇవ్వకపోడంతో నానా ఇబ్బందులు పడి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ భూమి మీద జగన్ ఉన్నంత కాలం రాష్ట్రం సర్వనాశనం అయిపోతుందనే అలా ప్రాణాలు తీసుకున్నారు" అని వ్యాఖ్యానించారు.

నా ఒక్కడికే 84 కోట్ల బకాయి

2014-19 స్వర్ణయుగం అయితే.. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో రాక్షస పాలన జరిగిందని విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. ఐదేళ్ల పాటు ప్రతి ఒకరూ ఇబ్బందులు పడ్డారని చెప్పారు. జగన్ ప్రభుత్వం జీవో 94ను అమలు చేయలేదని, ఐరన్ ధరలు పెరిగినా ఆ మేరకు బిల్లులు ఇవ్వలేదని వివరించారు. 2023లో బిల్లులు ఇవ్వకపోయినా కాంట్రాక్టర్లు పనులు చేశారన్నారు. నష్టాల్లో కూడా కాంట్రాక్టర్లు టిడ్కో ఇళ్లను నిర్మించారని చెప్పారు. తన ఒక్కడికే రూ.84 కోట్ల మేరకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. లబ్ధిదారుల పేరుతో రుణాలు తీసుకుని జగన్ బటన్ నొక్కుడుకు వాడేశారని, ఇప్పుడు బ్యాంకులు లబ్ధిదారులను పీడిస్తున్నాయని తెలిపారు. రుణాలు చెల్లించకపోతే ఇళ్లు వేలం వేస్తామని, లేదంటే ఉన్న ఆస్తులు జప్తు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఇటు కాంట్రాక్టర్లు, అటు లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని విష్ణుకుమార్ రాజు విన్నవించారు.



కరువు సీమకు నీళ్లిచ్చే బడ్జెట్ ఇది!

జగన్ నిర్లక్ష్యంతో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది

చంద్రబాబు అప్రమత్తతతో 'తుంగభద్ర' నిలబడింది

బడ్జెట్ కేటాయింపులపై అసెంబ్లీలో సభ్యుల స్పందన

అమరావతి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కరువుకు నిలయమైన రాయల సీమకు పుష్కలంగా నీరందేలా ఈ బడ్జెట్‌లో జలవనరులకు నిధులు కేటాయించడం హర్షణీయమని, ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ఎంత ప్రాధాన్యమిస్తోందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చని అసెంబ్లీలో పలువురు ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వ బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, లోకం మాధవి తదితరులు మాట్లాడారు. రాయలసీమలో ప్రతి ఎకరాకూ నీరివ్వాలన్న చంద్రబాబు ఆశయానికి అనుగుణంగా సాగునీటి రంగానికి భారీగా (16,735కోట్లు) నిధులు కేటాయించారని ప్రశంసించారు. నాడు జగన్ రెడ్డి నిర్లక్ష్యం వల్ల అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి ఊళ్లను ముంచేసి ఉపద్రవాన్ని సృష్టించిందన్నారు. అదే కూటమి ప్రభుత్వం వచ్చాక తుంగభద్ర ప్రాజెక్టు గేట్లకు ప్రమాదం ఏర్పడితే, కన్నయ్యనాయుడు లాంటి నిపుణుడిని తీసుకొచ్చి యుద్ధ ప్రాతిపదికన డ్యామ్ గేట్లు నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని కాల్వ శ్రీనివాసులు చెప్పారు. జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి మాట్లాడుతూ ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాలు ఎంతమేరకు అమలు చేస్తారో చెప్పలేం కానీ ప్రశాంతంగా ఊపిరి పీల్చుకోగలుగుతున్నాం అని ప్రజలు తనతో అనేవారని, అయితే బడ్జెట్ చూసిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలు కూడా పూర్తిగా నెరవేరుతాయనే నమ్మకం కలుగుతోందని చెప్పారు. ఆదోని మార్కెట్ యార్డులో దళారుల నిలువు దోపిడీని కట్టడి చేయాలని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. ఏపీఎస్పీ నుంచి ఏఆర్‌కు వచ్చేందుకు పదేళ్ల నుంచి నిరీక్షిస్తున్న వేలాది మంది స్పెషల్ పోలీసుల సమస్యను హోంమంత్రి పరిష్కరించాలని బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు కోరారు. రాజధానిలోని కొండవీటి వాగుపై రెండు చోట్ల బ్రిడ్జిల నిర్మాణ ఆవశ్యకతపై ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ వివరించారు. విజయవాడలో సింగ్ నగర్ బ్రిడ్జి ట్రాఫిక్‌ను తట్టుకోలేక పోతోందని, సమాంతరంగా మరొకటి నిర్మించాల్సిన అవశ్యకతను సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు గుర్తు చేశారు. ఇంకా పలువురు ఎమ్మెల్యేలు తమ ప్రాంతంలో రోడ్లు, కల్వర్టు నిర్మాణాల గురించి జీరో అవర్‌లో ప్రస్తావించారు.

డ్రైవర్ లేని వాహనంలా..!

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తన నియోజకవర్గంలోని సమస్యలు ప్రస్తావించే ముందు.. 'డ్రైవర్ లేని వాహనంలా సభ నడుస్తోంది అధ్యక్షా.. సభ్యులు లేవనెత్తుతున్న సమస్యల్ని మంత్రులెవ్వరూ రాసుకోవడం లేదు' అన్నారు. వెంటనే స్పందించిన స్పీకర్ 'నిండు సభలో అసత్యాలు మాట్లాడటం సరికాదు రవీ, ఇక్కడ రికార్డవుతోంది, మీరు దూరంగా కూర్చున్నందున కనిపించట్లేదని' బదులిచ్చారు. జీరో అవర్‌లో సభ్యులు లేవనెత్తే సమస్యలు ఏ మంత్రి సభలో ఉన్నా నోట్ చేసుకుని ప్రభుత్వానికి పంపించాల్సిందేనన్నారు. 'నేను నోట్ చేసుకుంటున్నా అధ్యక్షా' అంటూ మంత్రి నిమ్మల బదులిచ్చారు. మంత్రులు నోట్ చేసుకున్నట్లయితే ఇప్పుడు సభ్యులు ప్రస్తావించినవాటిలో ఎన్ని పరిష్కరించారో వచ్చే సమావేశాల్లో సభలో వెల్లడిస్తే బాగుంటుందని సూచించారు. రోడ్లు భవనాలు, పరిశ్రమలు, జలవనరులు, విద్యుత్, వ్యవసాయం, పౌర సరఫరాలు, గృహనిర్మాణం, రవాణా శాఖ మంత్రులు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కోసం చేసిన అభ్యర్థనలను సభ ఆమోదించింది.

నో మాక్.. నో అసెంబ్లీ!

- జగన్ విచిత్ర రాజకీయం
- శాసనసభలో సంఖ్యాబలం లేకున్నా ప్రతిపక్ష హోదాకు పట్టు
- ఆ సాకుతో సమావేశాలకు డుమ్మా.. మాక్ అసెంబ్లీ అంటూ అదీ లేదు
- మండలిలోనూ వైసీపీ పేలవ ప్రదర్శన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకుంటే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాబోమని, అప్పటి వరకు అసెంబ్లీలో తాను మాట్లాడాల్సినదంతా 'మాక్ అసెంబ్లీ' ద్వారా ప్రజలకు చేరవేస్తానంటూ గంభీరంగా ప్రకటించిన వైసీపీ అధ్యక్షుడు జగన్ రెంటికీ చెడ్డ రేవడిలా మారారు. అసెంబ్లీకి వెళ్లనందుకు రాజకీయంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. మాక్ అసెంబ్లీ అని ఆ ఊసెత్తకపోవడంతో సొంత పార్టీ నేతలు, కార్యకర్తల్లోనూ చులకనయ్యారు. ఈ నెల 11వ తేదీన అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి మాక్ అసెంబ్లీని చేపడతాన్న జగన్ ఆ ప్రయత్నం చేయలేదు. మరోవైపు అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశాన్ని వైసీపీ చేజార్చుకుంది. జగన్ నిర్ణయంతో ఆయన పార్టీ ఎమ్మెల్యేలూ అసెంబ్లీ సమావేశాలకు దూరం కావాల్సి వచ్చింది. మరోవైపు శాసన మండలిలోనూ ప్రజా సమస్యలను ప్రస్తావించడంలో వైసీపీ విఫలమైంది. శాసనమండలిలో 58 సభ్యులకు గాను వైసీపీకి 37 మంది ఉన్నారు. టీడీపీ నుంచి తొమ్మిది మంది, జనసేన నుంచి ఒకరు, పీడీఎఫ్ నుంచి ఇద్దరు, నలుగురు స్వతంత్ర సభ్యులు ఉన్నారు. ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. శాసన మండలిలో మెజారిటీ ఉండటంతో వైసీపీ సభ్యులు సమావేశాలకు హాజరవుతున్నారు. శాసనసభకు రాకున్నా శాసనమండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని వైసీపీ ప్రకటించింది. కానీ ప్రజా సమస్యలకు బదులు సోషల్ సైకోలకు మద్దతుగా మాట్లాడి ఆ పార్టీ సభ్యులు విమర్శలు మూటగట్టుకున్నారు. జగన్, వైసీపీ నేతల వైఖరిని ఆయన సోదరి, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కూడా ఎండగట్టారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలు చట్ట సభల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. 2019 నుంచి 2024 దాకా శాసన సభలో వైసీపీ సభ్యులు నోటికి అడ్డూ అదుపూ లేకుండా మాట్లాడేశారు. నాటి అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం కూడా వారికి సహకరించారు. గత ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోవడంతో ఇప్పుడు పరిస్థితి తలకిందులైంది. ప్రజాతీర్పును గౌరవించి ప్రతిపక్షంలో ఉండటానికి జగన్ అంగీకరించడం లేదు. సంఖ్యా బలం తగినంత లేకున్నా ప్రతిపక్ష నేత హోదా కోసం పట్టుబడుతున్నారని, అసెంబ్లీకి రాకుండా తప్పించుకునేందుకు ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. శాసనసభలో వైసీపీ ఎమ్మెల్యేలు కనిపించక పోగా, మండలిలో మెజారిటీ ఉన్నా వైసీపీ ఎమ్మెల్సీల పాత్ర అంతంత మాత్రమే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక సోషల్ మీడియాలో వైసీపీ సైకో బ్యాచ్ ఆగడాలపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. చెప్పడానికి వీలులేని భాషలో మహిళలపై పోస్టులు పెడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, చివరకు జగన్ తల్లి, చెల్లిపైనా వైసీపీ సోషల్ సైకో బ్యాచ్ నీచాతి నీచమైన పోస్టులు చేసింది. వీటిని ఖండించాల్సిన జగన్ వారికి మద్దతుగా మాట్లాడటం తీవ్ర విమర్శలకు దారి తీసింది. వైసీపీ సోషల్ మీడియాపై పోలీసుల చర్యలను నిరసిస్తూ శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఆ సమయంలో శాసన మండలిలోనే ఉన్న ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆనాడు శాసనసభలో వైసీపీ ఎమ్మెల్యేలు తన తల్లిని అవమానించిన తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు అసెంబ్లీ సమావేశాలలో జగన్ వ్యూహం ఏవిటో సొంత పార్టీ నేతలకే అర్థం కావడం లేదు. వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలలో కొందరు పార్టీ మారుతారంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మాక్ అసెంబ్లీని చేపడితే ఎంతమంది వస్తారో అనే సందేహాలు ఉన్నాయి. అందుకే జగన్ రెండుసార్లు మీడియా సమావేశాలతో సరిపుచ్చారని ఆ పార్టీ నేతలు అంటున్నారు. ఈ సమావేశాలకు జగన్ సానుకూల మీడియాను పిలిపించుకున్నారు. ఎవరూ ప్రశ్నించరు కనుక ప్రభుత్వంపై అడ్డగోలు ఆరోపణలు, విమర్శలు చేశారు.





మహారాష్ట్రలో ఎన్డీయే అభ్యర్థుల పక్షాన ఎన్నికల ప్రచారం చేస్తున్న ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

బీజేపీ మానవత్వ పార్టీ

- బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో హిందువులకు రక్షణ లేదు
- భారత్‌లో ఇతర మతాల హీరోలను అభిమానిస్తారు
- దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యం..
- మహారాష్ట్ర ప్రచారంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కుభీర్/మద్నూర్/అమరావతి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): బీజేపీ అంటే మతతత్వ పార్టీ కాదని, మానవత్వ పార్టీ అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో హిందువులకు రక్షణ లేదని.. భారతదేశంలో మాత్రం ఇతర మతాల హీరోలను ప్రజలు అభిమానిస్తారని పేర్కొన్నారు. శనివారం మహారాష్ట్రలో వివిధ నియోజకవర్గాల్లో పవన్ ప్రచారంలో పాల్గొన్నారు. లాతూర్‌లో బీజేపీ అభ్యర్థి అర్చన పాటిల్, నాందేడ్ జిల్లా భోకర్ నియోజకవర్గం అభ్యర్థి శ్రీజయ చవాన్ కోసం ఎన్నికల ప్రచారం చేశారు. లాతూర్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రజలు భారీగా పాల్గొన్నారు. నాందేడ్ జిల్లా బీజేపీ అభ్యర్థుల తరఫున నిర్వహించిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్, సనాతన ధర్మం, దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యమని, ఆ పార్టీని గెలిపించాలని కోరారు. మహారాష్ట్రలో సనాతన ధర్మ రక్షణ కోసం ఛత్రపతి శివాజీ, శివసేన వ్యవస్థాపకుడు బాల్‌థాక్రే చేసిన సేవలను కొనియాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని చూడాలన్నారు. ఆర్టికల్ 370 రద్దు, దేశ ప్రజల కల అయోధ్య రామమందిర నిర్మాణాన్ని నెరవేర్చారని అన్నారు. 30 కోట్లమంది గ్రామీణ మహిళలకు జనధన్ యోజన బ్యాంకు ఖాతాలను తెరిపించి స్వయం ఉపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు. 12 కోట్ల మంది రైతులకు పీఎం కిసాన్ పథకాన్ని వర్తింపజేశారని తెలిపారు. పాలాజ్ సత్యగణేష్ ఆలయంలో పవన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులతో మాట్లాడి.. ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. కాగా, బహిరంగ సభలో అభిమానులు కేకలు వేయడంతో "మీరంతా సరిహద్దు తెలంగాణ వాసులని అర్థమైంది"అని పవన్ అన్నారు. తెలంగాణ ఉద్యమ గడ్డ అని కొనియాడుతూ.. బండెనుక బండి గట్టి పదహారు బండ్లు గట్టి అనే పాటను పాడారు.

మహారాష్ట్ర కర్మభూమి

మహారాష్ట్ర నేల సంస్కృతి, సంప్రదాయాల కలబోతని, ఛత్రపతి శివాజీ మహారాజ్ తన పోరాట పౌరుషం నింపిన గడ్డ అని పవన్ అన్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ లాంటి మహనీయులను దేశానికి అందించిన గడ్డ మహారాష్ట్ర అని, కర్మభూమి అయిన మహారాష్ట్ర దేశానికి ఓ స్ఫూర్తి మంత్రమని పేర్కొన్నారు. పోరాటంలో ముందుండే మరాఠా ప్రజలను కలుసుకోవడం గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. జీవితంలో పదవులు ముఖ్యం కాదని... జాతి, దేశం కోసం పాటుపడే ఆలోచన అత్యుత్తమని నమ్మే బాల్‌థాక్రే సిద్ధాంతాలు తనకు స్ఫూర్తి అని చెప్పారు.

మాదిగలకు జగన్ అండగా ఉండడు

ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఆయన తీరే నిదర్శనం

- సీఎం చంద్రబాబు గతంలోనే వర్గీకరణ అమలు చేశారు
- ఏకసభ్య కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం
- 'అనంత' మాదిగల ఆత్మీయ సదస్సులో మందకృష్ణ

అనంతపురం సెంట్రల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు జగన్ అండగా ఉండడు.. ఉండబోడని, ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఆయన వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. అనంతపురంలో శనివారం నిర్వహించిన మాదిగల ఆత్మీయ సదస్సులో ఆయన మాట్లాడారు. 'అన్ని రాజకీయ పార్టీల్లో మాదిగలున్నట్లే.. వైసీపీలో ఉన్న బ్యాచ్ ఇక్కడ కూడా ఉంది. మన బిడ్డలకు వర్గీకరణ ఫలాలను అందించాలంటే మీ అన్నగా చెబుతున్నాను. నా మాటలను అర్థం చేసుకోండి' అని అభ్యర్థించారు. రిజర్వేషన్ల అమలు ప్రక్రియలో అంబేడ్కర్, గాంధీ మధ్య జరిగిన ఒప్పందాన్ని అప్పటి ప్రభుత్వం అమలు చేసిందని అన్నారు. కానీ నేడు వర్గీకరణను వ్యతిరేకించే మాలల కన్నా నాటి రిజర్వేషన్ల అమలుకు సహకరించిన అగ్రకుల వర్గాలదే న్యాయమని అభిప్రాయపడ్డారు. నాటి ప్రధాని లాల్‌బహదూరు శాస్త్రి వేసిన కమిషన్ 'ఎస్సీ వర్గీకరణ జరగాలి, ఎస్సీల నుంచి మాలలను తొలగించాలి' అని 1965 జూన్ 1న నివేదిక ఇచ్చిందన్నారు. అప్పటికే మాలలు అభివృద్ధిలోకి వచ్చారనేందుకు ఈ రిపోర్టు సాక్ష్యమని అన్నారు. దేశంలో ఎస్సీ వర్గీకరణ జరగాలా? వద్దా? అని ఎన్నో కమిషన్లు వేశారని, ఎమ్మార్పీఎస్ ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వం వేసిన జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ కూడా వర్గీకరణకు అనుకూలంగా నివేదిక ఇచ్చిందని గుర్తుచేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో వేసిన రామచంద్రన్ కమిషన్ కూడా ఎస్సీ వర్గీకరణ జరగాల్సిందేనని రిపోర్టు ఇచ్చిందన్నారు. తమిళనాడు, పంజాబ్, యూపీ, హరియాణా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలు వేసిన కమిషన్లు కూడా వర్గీకరణ జరగాలని సిఫారసు చేశాయని తెలిపారు. న్యాయం మాదిగల వైపు ఉన్నదని ఈ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని, అయినా తాము పట్టించుకోమని మాలలు చెబుతున్నారని అన్నారు. గతంలో ఎమ్మార్పీఎస్ సభకు హాజరైన ప్రధాని మోదీ కూడా వర్గీకరణ జరగాలని చెప్పారని అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ తీర్పునిచ్చారని పేర్కొన్నారు. అయినా తాము లెక్కచేయం, అడ్డుకుని తీరుతామని మాలలు అంటున్నారని, వారు ఎంత శక్తిమంతులో అర్థం చేసుకోవాలని అన్నారు. సమాజం అభిప్రాయాలు, కమిషన్ల నివేదికలు, అంబేడ్కర్, కాన్షీరాం ఆలోచనలు, రాష్ట్రపతులు, ప్రధానుల నిర్ణయాలు, సుప్రీంకోర్టు తీర్పులు మాలలకు పట్టవని విమర్శించారు. వాళ్లు ఎంత శక్తివంతులైనా యుద్ధం చేసి వర్గీకరణ సాధించామని అన్నారు. ఈ ఫలాలను మాదిగ బిడ్డలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పోరాటంలో రాజకీయంగా మాదిగలకు మిత్రులు, శత్రువులు ఎవరో మాదిగలు అర్థం చేసుకున్నారని తెలిపారు.



అనంతపురంలో జరిగిన మాదిగల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న మందకృష్ణ, హాజరైన మాదిగలు



సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు: మందకృష్ణ

ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ వేయడాన్ని స్వాగతిస్తున్నామని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. పది రోజుల క్రితం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. వర్గీకరణ అంశంపై తుది నివేదికకు రెండు నెలల గడువు విధించడం హర్షణీయమన్నారు. గతంలో వర్గీకరణ అమలు చేసి ఉద్యోగ, విద్య అవకాశాలు కల్పించిన సీఎం చంద్రబాబుకు మాదిగలు మొదటి నుంచి కృతజ్ఞతగా ఉన్నారని అన్నారు. వర్గీకరణ సాధనలో కీలక భూమిక పోషించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ అమరులకు, శ్రమజీవులైన నాయకులకు, కార్యకర్తలకు ఈ విజయం దక్కుతుందన్నారు. విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు స్పందిస్తూ.. వర్గీకరణ జరిగేంత వరకు రాష్ట్రంలో డీఎస్సీతోపాటు ఎలాంటి ఉద్యోగాల భర్తీ చేయొద్దని సీఎం చంద్రబాబును కోరామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. వర్గీకరణ జరిగిన తర్వాతే నోటిఫికేషన్లు ఇస్తామని సీఎం స్పష్టం చేయడం హర్షణీయమన్నారు.

రాయలసీమకు ఇం'ధనం'

పవర్ సెక్టార్‌లో 11,902 కోట్ల మేరకు ప్రైవేటు పెట్టుబడులు

- 6,075 మందికి పైగా ఉద్యోగాలు
- కీలక సంస్థల ప్రతిపాదనలకు ప్రోత్సాహక కమిటీ పచ్చజెండా
- సీఎం చంద్రబాబు నేతృత్వంలోని మండలి ఆమోదమే తరువాయి

అమరావతి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంధన రంగం పరుగులు పెట్టనుంది. ముఖ్యంగా వెనుకబడిన జిల్లాలుగా పేరున్న రాయలసీమలోని కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, కడప, అనంతపురంలో పవర్ సెక్టార్‌లో పెట్టుబడులు తరలి రానున్నాయి. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు తాజాగా ప్రాథమిక ఆమోదం లభించింది. దీంతో రూ.11,902 కోట్ల మేరకు పెట్టుబడులు రావడంతో పాటు.. 6075 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ మేరకు ఆయా సంస్థల పెట్టుబడులకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నేతృత్వంలోని రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ(ఎస్ఐపీసీ) పచ్చజెండా ఊపింది. అమరావతిలోని సచివాలయంలో శనివారం జరిగిన ఎస్ఐపీసీ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ చేసిన పెట్టుబడుల ప్రతిపాదనలకు కమిటీ సమ్మతి తెలిపింది. అయితే.. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన త్వరలో జరగనున్న రాష్ట్ర పెట్టుబడుల మండలి సమావేశంకూడా ఈ ప్రతిపాదనలకు అంగీకరిస్తే.. ఆ వెంటనే ఆయా సంస్థలు ప్రాజెక్టులను ప్రారంభించనున్నాయి.



రానున్న ప్రాజెక్టులు.. లభించే ఉద్యోగాలు

గ్రీన్‌కో సోలార్: కర్నూలు-నంద్యాల జిల్లాల్లో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టును ఏర్పాటు చేస్తారు. రూ.2000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 1,725 మందికి ఉద్యోగాలు దక్కుతాయి.

ఆస్త్రా గ్రీన్‌ఎనర్జీ: అన్నమయ్య-కడప జిల్లాల పరిధిలోని ఒంగిమాల గ్రామంలో 490 ఎకరాల్లో 1800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టును ఈ సంస్థ స్థాపించనుంది. దీనికిగాను రూ.8,240 కోట్లను పెట్టుబడిగా పెట్టనున్నారు. ఈ ప్లాంటు ద్వారా 4000 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.

ఎకోరాన్ ఎనర్జీ: అనంతపురం జిల్లాలో 277 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విండ్ పవర్‌ను స్థాపించనుంది. రాళ్ల అనంతపురంలో 108 మెగవాట్లు, కురుబరహల్లిలో 146.40 మెగావాట్లు, గంగదేవపల్లిలో 22 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దీనికిగాను రూ.1,662 కోట్లను పెట్టబడిగా పెట్టనుంది. ఈ ప్లాంట్ల ఏర్పాటుతో 350 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.

ఫోన్‌లో గేమ్స్ ఆడుతున్నాడని.. కొడుకుని బ్యాట్‌తో కొట్టి చంపేశాడు

బెంగళూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుతున్న కొడుకును క్రికెట్ బ్యాట్‌తో కొట్టి చంపేశాడు ఓ తండ్రి. ఈ సంఘటన బెంగళూరు నగరంలోని కుమారస్వామి లే అవుట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నగరానికి చెందిన రవికుమార్ శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఇంటికొచ్చాడు. ఆ సమయానికి కుమారుడు తేజస్ (14) సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ కనిపించాడు. తండ్రిని చూడగానే తేజస్ తనకు కొత్త ఫోన్ కొనివ్వాలని విసిగించాడు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన రవికుమార్ అందుబాటులో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో కొడుకు తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన తేజస్‌ను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారస్వామి లే అవుట్ పోలీసులు కేసు నమోదు చేసి రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. తేజస్ సుమారు 20 రోజులుగా బడికి వెళ్లకుండా బయట తిరుగుతున్నట్లు సమాచారం.



నిందితుడు రవికుమార్

మణిపూర్‌లో మళ్లీ నిరసన జ్వాల

» పశ్చిమ ఇంఫాల్‌లో కర్ఫ్యూ.. 7 జిల్లాల్లో ఇంటర్నెట్ బంద్

ఇంఫాల్, నవంబరు 16: మణిపూర్‌లో మళ్లీ నిరసన జ్వాల చెలరేగింది. నిరసన ప్రదర్శనలతో ఇంఫాల్ లోయ దద్దరిల్లింది. ఆందోళనకారులు రాజకీయ నాయకుల ఇళ్లను లక్ష్యంగా చేసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం కనిపించింది. ఇద్దరు మంత్రులు, ముగ్గురు ఎమ్మెల్యేలు, పలువురు బీజేపీ నేతల ఇళ్లపై ఆందోళనకారులు దాడులకు పాల్పడ్డారు. ఇందులో మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ అల్లుడు రాజ్‌కుమార్ సింగ్ నివాసం కూడా ఉంది. సీఎం ఇంటిపైనా దాడికి యత్నించారు. నిరసనలు తీవ్రం కావడంతో పశ్చిమ ఇంఫాల్‌లో నిరవధిక కర్ఫ్యూ విధించారు. ఇంఫాల్ లోయ సహా ఏడు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. శుక్రవారం ముగ్గురు మైతేయీల(ఇద్దరు పిల్లలు, ఒక మహిళ) మృతదేహాలు జిరి నదిలో తేలి కనిపించడం తాజా నిరసన జ్వాలలకు కారణమైంది. కాగా. శనివారం హింసాత్మక నిరసనలపై కేంద్రం కూడా స్పందించింది. శాంతిభద్రతల పునరుద్ధరణకు భద్రతా బలగాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

హెల్త్ సప్లిమెంట్లను ఔషధాలుగా పరిగణించాలి!

న్యూఢిల్లీ, నవంబరు 16: ఆరోగ్య సమస్యలను, వ్యాధులను నయం చేస్తాయంటూ పలు కంపెనీలు విక్రయిస్తున్న హెల్త్ సప్లిమెంట్లను ఔషధాల జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి ఓ అంతర్ మంత్రిత్వశాఖల కమిటీ సిఫార్సు చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖకు తన నివేదికను సమర్పించింది. ఈ సిఫార్సు సర్కారు ఆమోదం పొందితే హెల్త్ సప్లిమెంట్లు.. ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) పరిధిలోకి వస్తాయి. తద్వారా వాటి నాణ్యతా ప్రమాణాలను ఔషధాల స్థాయిలో పరీక్షించటం జరుగుతుంది. అలాగే, ఔషధాల ధరలను నిర్ణయించే 'జాతీయ ఔషధ ధరల సాధికార సంస్థ' (ఎన్‌పీపీఏ) వాటి ధరలను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న హెల్త్ సప్లిమెంట్లు.. 'సురక్షిత ఆహార, ప్రమాణాల సాధికార సంస్థ' (ఎఫ్ఎస్ఎస్ఏఐ) పరిధిలో ఉన్నాయి.

నాకు ఉద్యోగం వచ్చే వరకు నీవూ చేయకూడదు

» భార్యపై ఒత్తిడి తెచ్చిన భర్తకు విడాకులు మంజూరు

భోపాల్, నవంబరు 16: 'నాకు ఉద్యోగం వచ్చే వరకు నీవు కూడా జాబ్ చేయడానికి వీల్లేదు. చేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని మానేసెయ్' అంటూ భార్యపై ఒత్తిడి తెచ్చిన భర్తపై మధ్యప్రదేశ్ హైకోర్టు కఠినంగా వ్యవహరించింది. ఇది క్రూరత్వం కిందికే వస్తుందని పేర్కొంటూ విడాకులు మంజూరు చేసింది. ఓ జంటకు 2014లో వివాహం జరిగింది. ఇద్దరూ భోపాల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు. 2017లో ఆ మహిళ (33 ఏళ్లు)కు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలో మేనేజర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆయనకు ఏ ఉద్యోగం రాలేదు. దాంతో ఆమెను వేధించడం ప్రారంభించాడు. చేస్తున్న ఉద్యోగాన్ని మానేసి, భోపాల్ తిరిగి వచ్చి తనతో కలిసి ఉండాలంటూ ఒత్తిడి తెచ్చాడు. తనకు ఉద్యోగం వచ్చే దాకా ఆమె ఏ ఉద్యోగం చేయడానికి వీల్లేదని గట్టిగా చెప్పాడు. విసిగిపోయిన ఆమె ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించి విడాకుల కోసం దరఖాస్తు చేసింది. విడాకులు ఇచ్చేందుకు ఆ కోర్టు నిరాకరించడంతో హైకోర్టులో అప్పీలు చేసింది. విచారణ జరిపిన ధర్మాసనం విడాకులు ఇప్పించింది.

విద్యార్థుల సొమ్ము కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

కోల్‌కతా, నవంబరు 16: సైబర్ నేరగాళ్ల దృష్టి విద్యార్థుల పైనా పడింది. ట్యాబ్స్ కొనుగోలు కోసం వారి బ్యాంకు ఖాతాల్లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం జమ చేసిన సొమ్మును అక్రమ మార్గాల్లో బదిలీ చేయించుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10, 12వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరుణర్ స్వప్నో పథకాన్ని అమలు చేస్తోంది. మొత్తం 16లక్షల మంది విద్యార్థుల ఖాతాల్లో రూ.10వేల వంతున జమ చేస్తోంది. అయితే అందులో 1,911 మంది విద్యార్థుల ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు సొమ్మును అపహరించినట్టు పోలీసులు గుర్తించారు. దీనిపై 93 కేసులు నమోదు చేసి, 11 మందిని అరెస్టు చేసినట్టు శుక్రవారం తెలిపారు. నేరగాళ్లు మహారాష్ట్ర, ఝార్ఖండ్, రాజస్థాన్ ఇతర రాష్ట్రాల నుంచి వ్యవహారాన్ని నడిపినట్టు చెప్పారు.

కొలువుల భర్తీకి ఇకపై 'ట్యాబ్' ఆధారిత పరీక్షలు

» రాజస్థాన్ సర్కారు నిర్ణయం..ఐఐటీ హ్యాకర్లతో ట్రయల్

జైపూర్, నవంబరు 16: పోటీ/ప్రవేశ పరీక్షల్లో ఆప్టికల్ మార్క్ రీడర్(ఓఎంఆర్), కంప్యూటర్ ఆధారిత పరీక్షల(సీబీటీ)ను చూశాం. ఇకపై ట్యాబ్/ట్యాబ్‌లెట్ ఆధారిత పరీక్షల(టీబీటీ)ను నిర్వహించాలని రాజస్థాన్ సర్కారు నిర్ణయించింది. మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ, ట్యాంపరింగ్ వంటి సమస్యలకు టీబీటీతో చెక్ పట్టవచ్చని భావిస్తోంది. ఈ విషయాన్ని రాజస్థాన్ స్టాఫ్ సెలక్షన్ బోర్డు(ఆర్‌జేఎస్ఎస్‌బీ) చైర్మన్ అలోక్‌రాజ్ వెల్లడించారు. లీకేజీ రహితంగా పరీక్షల నిర్వహణకు టీబీటీని పరిశీలిస్తున్నట్లు వివరించారు. "ఈ నెలాఖరులో 400 మంది డమ్మీ విద్యార్థులతో షిఫ్టుల వారీగా మాక్‌టెస్ట్ నిర్వహిస్తాం. పరీక్ష ప్రారంభానికి ముందు.. పరీక్ష జరుగుతున్నప్పుడు లీకేజీ, కాపీయింగ్ సాధ్యమవుతుందా? అనే కోణంపైనా దృష్టి పెట్టాం. మాక్‌టెస్ట్ సమయంలో ఐఐటీ-కాన్పూర్‌కు చెందిన హ్యాకర్లను నియమించి.. ప్రశ్నపత్రం లీకేజీకి ప్రయత్నిస్తాం. హ్యాకర్లు విఫలమైతే.. టీబీటీ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలుచేస్తాం" అని చెప్పారు.

హైదరాబాద్-తిరుపతి విమానంలో టెక్నికల్ లోపం

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి తిరుపతికి బయల్దేరిన విమానంలో హఠాత్తుగా సాంకేతికలోపం తలెత్తడంతో చెన్నై విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం 169 మంది ప్రయాణికులు, సిబ్బంది..మొత్తం 177 మందితో బయల్దేరిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతికలోపం తలెత్తినట్టు పైలెట్ గుర్తించాడు. దీంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు విమానాన్ని చెన్నైలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. వారిని వేరే విమానంలో తిరుపతికి పంపించినట్టు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

తెరుచుకున్న శబరిమల అయ్యప్ప ఆలయం

తిరువనంతపురం, నవంబరు 16: మండల-మకరవిళక్కు దీక్షల సీజన్‌లో భాగంగా శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం తెరుచుకుంది. శనివారం ఉదయం నుంచి భక్తులను అయ్యప్ప దర్శనానికి అనుమతిస్తున్నారు. తొలి రోజునే 30 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. ఆలయ ప్రధాన పూజారుల సమక్షంలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు గర్భాలయ తలుపులు తెరిచారు. పూజా కార్యక్రమాల అనంతరం శనివారం ఉదయం నుంచి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పిస్తున్నారు. కాగా, రోజూ లక్ష మంది భక్తులు దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆలయం వద్ద ఏర్పాట్లు చేశామని ఏడీజీపీ శ్రీజిత్ తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

» ఐదుగురు మావోయిస్టులు మృతి

చింతూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. అభూజ్‌మాడ్ పరిధిలోని నారాయణపూర్, కాంకేర్ జిల్లాల సరిహద్దున మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో శనివారం ఉదయం 8 గంటలకు రెండు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న డీఆర్‌జీ (జిల్లా రిజర్వుగార్డు), ఎస్టీఎఫ్ (స్పెషల్ టాస్క్‌ఫోర్స్), బీఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సు) ఉమ్మడిగా తరలివెళ్లి మావోయిస్టులున్న ప్రదేశాన్ని చుట్టుముట్టారు. ఈ సందర్భంలో ఇరుపక్షాల నడుమ ఎదురుకాల్పులు జరిగాయి. అనంతరం సంఘటన స్థలంలో గాలించగా ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఐదు తుపాకులు లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు.

సంక్షేమమే తారకమంత్రం

ఇదే పరమార్థంగా పాలన.. ప్రతి దేశంలో ప్రభుత్వాలు మారుతున్నాయి.. మాకు వరుస గెలుపులు

» నాడు ఉగ్రవాదం భయపెట్టేది

» నేడు సొంతగడ్డపైనే అది భయపడుతోంది

» హిందుస్థాన్ టైమ్స్ సదస్సులో మోదీ

న్యూఢిల్లీ, నవంబరు 16: ఓటు బ్యాంకు రాజకీయాలకు దూరం.. సంక్షేమమే తారకమంత్రం...ఇదే పరమార్థంగా తన ప్రభుత్వం పనిచేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే అనే స్ఫూర్తితో ముందుకు వెళుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు దీనికి పూర్తి వ్యతిరేకంగా ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం వల్ల దేశం ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నదని విమర్శించారు. ఉగ్రవాదులు తమ సొంతగడ్డ పైనే భయంభయంగా బతికే పరిస్థితులను కల్పించామని మోదీ వ్యాఖ్యానించారు. 100 ఏళ్లు పూర్తిచేసుకున్న 'హిందుస్థాన్ టైమ్స్' నిర్వహించిన లీడర్‌షిప్ సదస్సులో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విపక్షాలను దుయ్యబట్టారు. ఎన్నికలు జరిగిన ప్రతి దేశంలో ప్రభుత్వాలు మారుతున్నాయని, భారత్‌లో మాత్రం మూడోసారి కూడా ప్రజలు తమకు అధికారం కట్టబెట్టారని చెప్పారు. తమ ప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకానికి ఇదే నిదర్శనమన్నారు. దుష్ప్రచారాలను, తప్పుడు సమాచారాన్ని వెదజల్లేందుకు ఎక్కువ అవకాశం ఉన్న సోషల్ మీడియా యుగంలోనూ ఎన్డీయే కూటమి, ప్రభుత్వం పట్ల ప్రజలు విశ్వాసం కలిగి ఉన్నతీరును అంతా అర్థం చేసుకోవాలన్నారు. "గతంలో ఎన్నికల్లో గెలిచిన ప్రభుత్వానికి తిరిగి వచ్చే ఎన్నికలపైనే ధ్యాస ఉండేది. దీనికోసం ఓటుబ్యాంకు రాజకీయాలే లక్ష్యంగా పలు పథకాలను ప్రవేశపెట్టేవి. కాంగ్రెస్ పాలన అంతా ఇలాగే గడిచింది" అని మోదీ ఆక్షేపించారు. అభివృద్ధిలో భారత్‌ను పరుగులు పెట్టించే దిశగా న్యూ ఇండియాను నిర్మించడమే పరమార్థంగా తన ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కాగా, పాత పత్రికలు తిరగేస్తుంటే ఉద్వేగం కలుగుతూ ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు. 1947 అక్టోబరులో భారత్‌లో కశ్మీర్ విలీనమైన వార్త ఉన్న పత్రికను చదివిన అప్పటి పాఠకులు ఎలాంటి ఉద్విగ్నతకు లోనయ్యారో, ఇప్పటికీ తాను కూడా అదే అనుభూతికి గురవుతుంటానని చెప్పారు. కాగా, విదేశీ పర్యటన నిమిత్తం మోదీ శనివారం బయలుదేరి వెళ్లారు. ఆయన అయిదు రోజుల పాటు నైజీరియా, బ్రెజిల్, గుయానా దేశాల్లో పర్యటించనున్నారు. నైజీరియా ప్రధాని బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు వెళ్తున్న మోదీ ఆ దేశంలో రెండు రోజుల పాటు గడపనున్నారు. మోదీ అక్కడ నుంచి బ్రెజిల్ వెళ్లి ఈనెల 18న జీ-20 19వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు. చివరగా ఈ నెల 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు గుయానాలో పర్యటిస్తారు.



హిందూస్థాన్ టైమ్స్ ఎడిటోరియల్ డైరెక్టర్ శోభనతో ప్రధాని మోదీ

బీజేపీ, కాంగ్రెస్‌కు ఈసీ నోటీసులు

న్యూఢిల్లీ, నవంబరు 16: బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నోటీసులు జారీ చేసింది. ఇరు పార్టీలకు చెందిన స్టార్ క్యాంపెయినర్లు అమిత్ షా, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. వారి వ్యాఖ్యలు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించేలా ఉన్నాయని తెలిపింది. సోమవారం మధ్యాహ్నం 1 గంటకల్లా స్పందన తెలియజేయాలని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేలకు స్పష్టం చేసింది. ఈ నెల 6న ముంబైలో జరిగిన ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ మహారాష్ట్ర యువతను రెచ్చగొట్టేలా మాట్లాడారని బీజేపీ ఈ నెల 11న ఈసీకి ఫిర్యాదు చేసింది. మహారాష్ట్రలోని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ఇతర రాష్ట్రాల వారు దోచుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు దేశ సమగ్రతకు, ఐక్యతకు ముప్పు కలిగిస్తాయని బీజేపీ పేర్కొంది. దీనికి ప్రతిగా కాంగ్రెస్ పార్టీ కూడా బీజేపీ నేత అమిత్ షాపై ఈసీకి ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్, కూటమి పార్టీలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను లాగేసుకొని, ఒక మతానికి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ షా ఆరోపించారని.. ఇది మత విద్వేషాలను రెచ్చగొట్టడమేనని ఫిర్యాదులో పేర్కొంది.

బైడెన్‌లాగే మోదీకీ మతిమరుపు..

అమెరికా అధ్యక్షుడు బైడెన్ లాగే ప్రధాని మోదీ కూడా జ్ఞాపకశక్తి కోల్పోయారని రాహుల్ గాంధీ విమర్శించారు. కాంగ్రెస్ మాట్లాడే విషయాలపైనే ఆయన మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శనివారం మహారాష్ట్రలోని అమరావతిలో ఎన్నికల ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. 'బీజేపీ రాజ్యాంగంపై దాడి చేస్తోందని.. హక్కులను హరిస్తోందని గతేడాది కాలంగా నా ప్రసంగాల్లో చెబుతుంటే.. కాంగ్రెస్సే రాజ్యాంగంపై దాడి చేస్తోందని మోదీ అంటున్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి అధికారంలోకి వస్తే 50% రిజర్వేషన్ల పరిమితి ఎత్తేస్తానని లోక్‌సభలో చెప్పాను. కానీ రాహుల్ గాంధీనే రిజర్వేషన్లకు వ్యతిరేకమని మోదీ ఇప్పటికీ అంటున్నారు. అందుకే ఆయనకు మతిమరుపు వచ్చినట్లనిపిస్తోంది. ఇప్పటికైనా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి. ఏమో.. వచ్చే సమావేశంలో కులగణనకు రాహుల్ గాంధీనే వ్యతిరేకమని మోదీ చెప్పినా చెబుతారు' అంటూ ఎద్దేవా చేశారు. అంతకుముందు హెలికాప్టర్‌లో రాహుల్ అమరావతి చేరుకోగానే.. ఆయన బ్యాగులను ఎన్నికల సిబ్బంది తనిఖీ చేశారు.

నటి కస్తూరి అరెస్టు

హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న చెన్నై పోలీసులు



హైదరాబాద్ సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల తెలుగువారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సినీ నటి కస్తూరిని చెన్నై పోలీసులు హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం అరెస్టు చేశారు. ఆమె పుప్పాలగూడలో బీఆర్‌సీ అపార్టుమెంట్‌లో ఉన్నట్లు గుర్తించి.. సైబరాబాద్ పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకుని చెన్నై తరలించారు. ఇటీవల చెన్నైలో బ్రాహ్మణ సమాజం సమ్మేళనంలో పాల్గొన్న కస్తూరి తమిళనాడులో స్థిరపడ్డ తెలుగువారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. 'తమిళనాడులోని తెలుగువారు ఊడిగం చేసుకోవడానికి ఉండిపోయారా.. తెలుగువారంటే అంత చిన్నచూపా' అంటూ పలు తెలుగు సంఘాలు కస్తూరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. ఆందోళనలు చేపట్టాయి. దీంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. మహాజన సంఘం రాష్ట్ర సభ్యుల ఫిర్యాదు మేరకు చెన్నై పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. ఆమె అప్పటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆమె ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు కొట్టివేసింది.

నా దగ్గర బాంబు ఉంది

» శంషాబాద్ నుంచి బ్యాంకాక్ వెళ్లాల్సిన విమానంలో ఓ ప్రయాణికుడి బెదిరింపు

శంషాబాద్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ నుంచి బ్యాంకాక్ వెళ్లాల్సిన విమానంలో ఎక్కిన ఓ ప్రయాణికుడు విమానం కొద్దిసేపట్లో టేకాఫ్ అవుతుందనగా.. తన దగ్గర బాంబు ఉందని ప్రయాణికులను బెదిరించాడు. ఉలిక్కిపడ్డ ఫ్లైట్ సిబ్బంది వెంటనే భద్రతా బలగాలను అప్రమత్తం చేశారు. సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ బలగాలు ప్రయాణికులను వెంటనే కిందికి దింపేసి విమానాన్ని, బెదిరించిన వ్యక్తిని, ప్యాసింజర్లను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఎలాంటి బాంబు లేదని తేల్చిన అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30గంటలకు విమానం బయల్దేరాల్సి ఉండగా, బాంబు బెదిరింపుతో 16 గంటలు ఆలస్యంగా శనివారం సాయంత్రం 5గంటలకు బయల్దేరి వెళ్లింది.

యూకే వర్సిటీలా.. వద్దులే!

» మొహం చాటేస్తున్న భారతీయ విద్యార్థులు

» వెల్లడించిన 'ఆఫీస్ ఫర్ స్టూడెంట్స్' సర్వే నివేదిక

లండన్ నవంబరు 16: యూకేలోని విశ్వవిద్యాలయాల్లో చేరడానికి భారతీయ విద్యార్థులు ఆసక్తి కనబర్చడం లేదు. ఇప్పటికే పరిమిత బడ్జెట్లతో సతమతమవుతున్న వర్సిటీలకు ఈ ధోరణి శరాఘాతంలా మారింది. విద్యార్థులు తమ దరఖాస్తులను వాయిదా వేస్తుండటం వాటి ఆర్థిక ఇబ్బందులను మరింత పెంచుతోందని ఆఫీస్ ఫర్ స్టూడెంట్స్(ఓఎఫ్ఎస్) సంస్థ శుక్రవారం విడుదల చేసిన సర్వే నివేదిక వెల్లడించింది. 2022-23 నుంచి 2023-24 వరకూ యూకే వర్సిటీల్లో చదివే భారత విద్యార్థుల సంఖ్య 1,39,914 నుంచి 1,11329కి తగ్గిందని తెలిపింది. ఇటీవల కొన్ని నగరాల్లో ఇమిగ్రేషన్ వ్యతిరేక అల్లర్లు జరగడం, పరిమిత ఉద్యోగావకాశాలు, భద్రతా పరమైన ఆందోళనలు దీనికి కారణం కావచ్చని అక్కడి భారత విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ విద్యార్థులకు జారీచేసే స్పాన్సర్‌షిప్‌లలో 11.8 శాతం క్షీణత నమోదైందని నివేదిక పేర్కొంది. విదేశీ విద్యార్థులు తమ జీవిత భాగస్వాములను తీసుకురావడంపై ఆంక్షలు విధించినందున విద్యార్థుల సంఖ్య తగ్గడంలో ఆశ్చర్యమేమీ లేదని ఇండియన్ నేషనల్ స్టూడెంట్స్ ఆసోసియేషన్ (ఐఎన్ఎస్ఏ) తెలిపింది. డిపెండెంట్లపై కన్జర్వేటివ్ నిషేధం, పోస్టు స్టడీ వర్క్ వీసాపై గందరగోళం, కార్మికుల జీతంపై పరిమితులు పెరగడం, ఉద్యోగాల కొరత వంటి అనేక అంశాలు విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడానికి దోహదం చేస్తున్నాయని నేషనల్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అలుమ్నీ యూనియన్ (ఎన్ఐఎస్ఏయూ) చైర్మన్ సనమ్ అరోరా అభిప్రాయపడ్డారు.

మస్క్ రాకెట్.. ఇస్రో శాటిలైట్!

ఫాల్కన్-9తో జీశాట్-ఎన్2 ప్రయోగం.. స్పేస్ ఎక్స్, ఇస్రో మధ్య కీలక ఒప్పందం

» వచ్చే వారం అమెరికాలో ప్రయోగం

» ఈ ఉపగ్రహంతో భారత్‌లో ఇన్‌ఫ్లైట్ సేవలు.. ఇంటర్నెట్ వినియోగం

న్యూఢిల్లీ, నవంబరు 16: వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఇస్రో వచ్చేవారం మరో వాణిజ్య ప్రయోగానికి సిద్ధమవుతోంది. అయితే ఈ ప్రయోగానికి అమెరికా బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ రూపొందించిన ఫాల్కన్-9 రాకెట్‌ను వినియోగించనుంది. ఈ మేరకు స్పేస్ ఎక్స్‌తో ఇస్రో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఇస్రో, స్పేస్ ఎక్స్ మధ్య వాణిజ్య ఒప్పందాల్లో ఇదే మొదటి ప్రయోగం. అలాగే డొనాల్డ్ ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఇరు సంస్థల మధ్య కుదిరిన మొదటి డీల్ కూడా ఇదే కావడం విశేషం. డొనాల్డ్ ట్రంప్‌తోపాటు, భారత ప్రధాని మోదీ కూడా గతంలో ఎలాన్ మస్క్‌ను 'నా స్నేహితుడు' అని పేర్కొంటూ.. ఆయనతో తమకున్న గొప్ప అనుబంధాన్ని చాటుకున్న సంగతి తెలిసిందే. మస్క్ కూడా తాను మోదీ అభిమానినని గతంలో చెప్పారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న కేప్ కెనెరవాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు. జీశాట్-ఎన్2 లేదా జీశాట్-20గా పిలిచే ఈ ఉపగ్రహం భారత్‌లో ఇన్-ఫ్లైట్ ఇంటర్నెట్ సేవలను అందించనుంది. ప్రస్తుతానికి దేశంలో ఇన్-ఫ్లైట్ ఇంటర్నెట్ యాక్సెస్‌పై నిషేధం ఉంది. ఈ సేవలను అందిస్తున్న విమానయాన సంస్థలు కూడా భారత గగనతలం మీదుగా ప్రయాణించే సమయంలో వాటిని నిలిపివేయాలి. అయితే భారత గగనతలంపై 3,000 మీటర్ల ఎత్తుకు చేరుకున్న తర్వాత ప్రయాణికులు వైఫై ద్వారా ఇంటర్నెట్ సేవలను వినియోగించుకోవచ్చని పేర్కొంటూ ఈ నెల 4న ప్రభుత్వం నిబంధనలు సవరించింది. ఈ నేపథ్యంలో జీశాట్-ఎన్2 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తే.. ఇన్-ఫ్లైట్ ఇంటర్నెట్ సేవలు కూడా పొందే అవకాశం ఉంటుంది. ఇస్రో ప్రయోగిస్తున్న ఈ శాటిలైట్ జీవితకాలం 14 సంవత్సరాలు. భారత్‌లోని మారుమూల ప్రాంతాల్లో సైతం అత్యాధునిక కమ్యూనికేషన్‌ను అందించడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది. ఈ ప్రయోగం కోసం ఇస్రో దాదాపు రూ.590 కోట్లు చేస్తున్నట్టు అంచనా.


ఫాల్కన్-9 రాకెట్

స్పేస్ ఎక్స్ రాకెట్ ఎందుకంటే..?

భారీ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చాలంటే ఇస్రో.. తన సొంత ప్రయోగ వాహనం మార్క్-3 రాకెట్‌ను రంగంలోకి దించుతుంది. బాహుబలిగా పేరు గాంచిన ఈ రాకెట్ 4,000 కేజీల బరువున్న భారీ శాటిలైట్లను సైతం మోసుకెళ్లగలదు. అయితే ఇస్రో తాజాగా సిద్ధం చేసిన జీశాట్-ఎన్2 బరువు దాదాపు 4,700 కేజీలు. గతంలో ఇలాంటి భారీ ఉపగ్రహ ప్రయోగాల కోసం ఫ్రెంచ్ సంస్థ ఏరియన్ స్పేస్‌పై ఇస్రో ఆధారపడింది. ప్రస్తుతం ఆ కంపెనీ వద్ద ఇలాంటి ఆపరేషనల్ రాకెట్లు లేవు. అలాగే ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా రష్యా సేవలను పొందే అవకాశం కూడా లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో భారీ రాకెట్లను ప్రయోగించగల స్పేస్ ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్‌ను ఇస్రో ఎంచుకుంది.

వృద్ధుల సంరక్షణకు కొత్త పాలసీ!

» గత 25 ఏళ్లలో ఇదే తొలిసారి

» ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా రూపకల్పన

న్యూఢిల్లీ, నవంబరు 16: వృద్ధుల కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకురానుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ వెల్లడించారు. గత 25ఏండ్లలో కేంద్రం తొలిసారిగా ఈ పాలసీని తయారు చేస్తోందని తెలిపారు. 'తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ, సంక్షేమ చట్టం-2007'కు సవరణలు చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో వృద్ధుల అవసరాలకు అనుగుణంగా ఈ కొత్త పాలసీ ఉంటుందని చెప్పారు. వృద్ధుల సంరక్షణ కోసం ప్రపంచ దేశాల్లో పాటిస్తున్న అత్యుత్తమ విధానాలపై అధ్యయనం చేసేందుకు ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని అసోసియేషన్ ఆఫ్ సీనియర్ లివింగ్ ఇండియా(ఏఎస్ఎల్ఐ) ప్రభుత్వాన్ని కోరింది. భారతదేశంలో 2024 నాటికి 15.67 కోట్లుగా ఉన్న వృద్ధుల సంఖ్య.. 2050 నాటికి రెట్టింపై 34.6 కోట్లకు చేరుకుంటుందని అంచనా. కొన్నేళ్లుగా దేశ మొత్తం జనాభాలో వృద్ధుల శాతం పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో వారి సంరక్షణ కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా సంస్కరణలు అవసరమనే వాదనలు వినిపిస్తున్నాయి. అమిత్ యాదవ్ మాట్లాడుతూ 'మా మంత్రిత్వ శాఖ ప్రస్తుతం రెండు అంశాలపై పనిచేస్తుంది. వాటిల్లో ఒకటి కొత్త పాలసీ. విస్తృతమైన సంప్రదింపుల తర్వాత 1999లో వృద్ధుల కోసం ఒక పాలసీని తీసుకొచ్చారు. ఇప్పుడు కొత్త పాలసీ రూపకల్పనలో ఉంది. ఈ పాలసీ రాబోవు 25 సంవత్సరాలకు మార్గదర్శకం చేస్తుంది' అని పేర్కొన్నారు. రెండో అంశంగా 'తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ, సంక్షేమ చట్టం-2007'కు సవరణలు చేస్తామని తెలిపారు. గతంలో ఎదురైన సవాళ్లకు పరిష్కారం చూపే విధంగా కొత్త పాలసీ ఉంటుందని చెప్పారు. 'సిటీ మాస్టర్ ప్లాన్‌లో వృద్ధుల జీవనానికి అనుకూల ప్రాంతాలను గుర్తించాలి. ఈ విషయంలో కొన్ని రాష్ట్రాలు కొత్త పాలసీతో వచ్చాయి. మిగతా రాష్ట్రాలు కూడా ఈ విధంగా ముందుకు రావాలి' అని ఏఎస్ఎల్ఐ చైర్మన్, అంతారా సీనియర్ కేర్ సీఈవో రాజీవ్ మెహతా పేర్కొన్నారు. రిటైర్‌మెంట్ తర్వాత, ఒక వయసు వచ్చిన తర్వాత వృద్ధులు నివసించేందుకు సీనియర్ లివింగ్ ప్రాజెక్టులు(హౌసింగ్ సొసైటీలు) నిర్మించే డెవలపర్లు అందించే సేవలపై విధిస్తున్న 18 శాతం జీఎస్టీని తగ్గించాలని ఏఎస్ఎల్ఐ సహ వ్యవస్థాపకులు, ఆశియానా హౌసింగ్ ఎండీ అంకుర్ గుప్తా కోరారు. చాలా తక్కువ మందికి పింఛను సదుపాయం అందుబాటులో ఉన్నందున ఆర్థిక సమస్య కూడా ఉందని, రివర్స్ మోర్టగేజ్ స్కీమ్‌లను ప్రోత్సహించాలన్నారు. ఒక సర్వే ప్రకారం.. పట్టణ వృద్ధుల జనాభాలో 27శాతం మంది కుటుంబంతో కాకుండా తమ జీవిత భాగస్వామితో లేదా ఒంటరిగా జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక సమగ్రమైన, ప్రత్యేకమైన సీనియర్ లివింగ్ పరిష్కారాలను ఇది నొక్కిచెబుతోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.